తెలంగాణ సాధనకై

# మిలియన్ మార్చ్

## 2011

(ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు)

తెలంగాణ రిసోర్స్ సెంటర్

హైదరాబాద్

# తెలంగాణ సాధనకై మిలియన్ మార్చ్

Telangana Sadhanakai Million March


| | | |
|---|---|---|
| ప్రచురణ కాలం | : | ఆగస్టు, 2011 |
| Edition | : | August, 2011 |
| ప్రచురణ | : | తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్ |
| Published by | : | Telangana Resource Centre, Hyderabad. |
| ప్రచురణ కర్త | : | **ఎం. వేదకుమార్,** చైర్మెన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Publisher | : | M. Vedakumar, Chairman, Telangana Resource Centre |
| సంపాదకులు | : | **బొనకుర్తి సోమేశ్వర్,** కో-ఆర్డినేటర్, తెలంగాణ రిసోర్స్ సెంటర్ |
| Editor | : | Bonakurthi Someshwar, Co-ordinator, Telangana Resource Centre |
| ప్రతులకు | : | **తెలంగాణ రిసోర్స్ సెంటర్**<br>"చంద్రం" 490, స్ట్రీట్ నెం. 11, హిమయత్‌నగర్, హైదరాబాద్.<br>telanganaresource@gmail.com; Mobile : 9030626288<br>దిశ పుస్తక కేంద్రం • సహచర బుక్‌మార్క్ • ధరణి బుక్‌స్టాల్ • నవయుగ బుక్ హౌస్ • నవోదయ బుక్ హౌస్ |
| Copies | : | Telangana Resource Centre<br>"Chandram" 490, Street No. 11, Himayathnagar, Hyderabad. Mobile : 9030626288<br>trchyd@gmail.com, telanganaresource@gmail.com |
| కంపోజింగ్ | : | ధరణి గ్రాఫిక్స్, ఫీవర్ హాస్పిటల్‌చౌరస్తా, హైదరాబాద్-44, సెల్ : 9491875063 |
| వెల | : | **రూ. 20/-** |

Printed at :
DECCAN PRESS Azamabad, Hyderabad. Ph.+91-040-27678411
e-mail : deccan.press@yahoo.com

తెలంగాణ సాధనకై

# మిలియన్ మార్చ్ 2011

## ప్రముఖుల వ్యాసాలు, అభిప్రాయాలు




తెలంగాణ రిసోర్స్ సెంటర్
హిమాయత్‌నగర్
హైదరాబాద్

# విషయ సూచిక


**తెలంగాణ రిసోర్స్ సెంటర్ మాట**

| | | |
|---|---|---|
| మిలియన్ మార్చ్ | – వేదకుమార్. యం | 3 |

**ముందుమాట**

| | | |
|---|---|---|
| సాగరతీరంపై అలల కలల అలజడి అర్థమయ్యే రోజున... | – ప్రొ॥ జయధీర్ తిరుమల రావు | 4 |
| శ్రీశ్రీ సరే ... దాశరథి మాటేమిటి ...? | – ప్రొ॥ జయశంకర్ | 10 |
| విగ్రహాలు ఎందుకు కూలాయి? | – చుక్కారామయ్య | 12 |
| నిగ్రహం ఆగ్రహమైన వేళ! | – సంగిశెట్టి శ్రీనివాస్ | 14 |
| విధ్వంసం, దాడులు అవాంఛనీయమే కాని.. | | |
| మిలియన్ మార్చ్‌కు కారణం ఆధిపత్యం | – ప్రొ॥ లక్ష్మణ్ | 16 |
| మిలియన్ మార్చ్ : ముబారకిజం | – టంకశాల అశోక్ | 19 |
| అధిష్ఠానం కళ్లు తెరవాలి | – టంకశాల అశోక్ | 21 |
| ఇంకా రెచ్చగొట్టడమే ... | – టంకశాల అశోక్ | 23 |
| విగ్రహ విధ్వంసంపై నిగ్రహంతో విచారిద్దాం | – కె. శ్రీనివాస్ | 25 |
| విధ్వంస సార్వభౌముడు | – అల్లం నారాయణ | 28 |
| విగ్రహాల విధ్వంసం.. గతం | – అల్లం నారాయణ | 31 |
| మిలియన్ మార్చ్ ... విగ్రహాల కూల్చివేత | – నలమాస కృష్ణ | 35 |
| ట్యాంక్‌బండ్‌పై కూలినవి విగ్రహాలే ... | | |
| తెలంగాణలో కూలతున్నవి జీవితాలు | – శ్రీధరరావు దేశ్‌పాండే | 38 |
| ట్యాంక్‌బండ్ విగ్రహారాధన | – ప్రొ॥ కె. శ్రీనివాసులు | 42 |
| విగ్రహాల కూల్చివేతను ఎలా అర్థం చేసుకోవాలి? | – లోకె రాజ్‌పవన్ | 46 |
| 'మిలియన్ మార్చ్'ను ఎత్తిపట్టండి | – ప్రతాప్ | 52 |
| ప్రజా ఉద్యమానికి పగ్గం | – జూకంటి జగన్నాథం, పెద్దింటి అశోక్‌కుమార్ | 54 |
| మాగడ్డపై మాజ్ఞాపకాలు ఉండాలి... | – బోనకుర్తి సోమేశ్వర్ | 56 |
| విగ్రహాల కూల్చివేత – నిరసన రూపం | – అనిశెట్టి రజిత | 58 |
| మిలియన్ మార్చ్ ... మీకెందుకు భయం | – పోటు నారాయణ | 61 |
| ఆ రోజు ఏం జరిగిందంటే..! | – పల్లె రవికుమార్ | 63 |
| థింక్ బండ్ | – జూలూరు గౌరీశంకర్ | 66 |

**పుస్తక సమీక్ష**

| | | |
|---|---|---|
| హమారా హైదరాబాద్ తెలంగాణ వ్యాస సంకలనం | – డా॥ శ్రీమతి ముదిగొండ భవాని | 71 |

## తెలంగాణ రిసోర్స్ సెంటర్ మాట

# మిలియన్ మార్చ్

మిలియన్ మార్చ్, మిలియన్‌వార్‌గా మారింది ... ర్యాలీగా వెళ్ళాలనుకున్న వాళ్ళు, అరెస్టులయ్యారు. బస్సులలో వస్తున్న వారు, 60 70 కి.మీ. నడవాల్సి వచ్చింది. అడుగడుగున భారీకేడ్లు, ముళ్ల కంచెలు, వాటిని దాటుకుంటూ వెళ్తుంటే, నా గడ్డపై, నా నేలపై, నాకు ఇంత నిర్బంధమేంది? అని మిలియన్ మార్చ్‌లో పాల్గొన్న ప్రతి తెలంగాణ బిడ్డకు అనిపించింది. ఎటు చూసినా సీమాంధ్ర ప్రతిరూపం కనిపిస్తుంటే ...

సమ్మక్క ... సారక్కల కోసం, కొమరం భీం, రాంజీ గోండు, చిందు ఎల్లమ్మ, భాగ్యరెడ్డి వర్మ, సదాలక్ష్మి, చాకలి ఐలమ్మ, జె. ఈశ్వరీబాయి చందా, సర్వాయి పాపన్న, దొడ్డి కమరయ్య, షేక్ బందగీ, షోయబుల్లాఖాన్, తుర్రెబాజ్‌ఖాన్, హుస్సేన్ షావలి, మిద్దె రాములు, సుంకం అచ్యాలు, బి. శ్యాం సుందర్, బెల్లి లలిత, అరిగె రామస్వామి, సుద్దాదల హనుమంతు, సులూరి బాబయ్య, బి.ఎస్. వెంకట్రావ్, కేవల్ కిషన్, కృష్ణ స్వామి ముదిరాజ్, జమలాపురం కేశవరావు, సర్వజ్ఞ సింగ భూపాలుడు, విద్యానాథుడు, కందుకూరి రుద్రకవి, బద్దెన, మారెన, వేములవాడ భీమకవి, గుణాఢ్యుడు, గోన బుద్దా రెడ్డి, పాల్కురికి సోమనాథుడు, మల్లినాథసూరి, పొన్నెగంటి తెలగన్న, వట్టికోట ఆళ్వారు స్వామి, దాశరథి, కాళోజి, బండి యాదగిరి, అలీ యావర్ జంగ్, మెహదీనవాజ్ జంగ్, కొత్వాల్ వెంకట్రామారెడ్డి, కులీ కుతుబ్‌షా, ఇబ్రహీం కుతుబ్‌షా, ప్రతాప రుద్రుడు, మీర్ ఉస్మాన్ అలీఖాన్, రాజా నాయిని వెంకట్రంగారావు, వానమామలై వరదాచార్యులు, ఆరుట్ల దంపతులు, షబ్నవీసు వీళ్ళందరు ఏరి ...? అంటే మా తెలంగాణ గడ్డపైన మా స్మృతులు లేవనే ఆలోచనే, విగ్రహాల విధ్వంసానికి దారితీసింది.

విగ్రహాలు కూలతున్నప్పుడు అక్కడున్న ఎవరికీ శ్రీశ్రీ మీదో, వేమన మీదో, బ్రహ్మనాయుడి మీదో కోపం లేదు. శ్రీశ్రీ కవిత్వం అభిమానించే వాళ్ళు, వేమనను గుండెల్లో పూజించే వాళ్ళకు కూడా తప్పనిపించలేదు. ఎందుకంటే అంత ఆక్రోశం, అసహ్యం ఉందక్కడ. ఇంక ఎంత మంది చావాలి తెలంగణలో ...? ఇంక ఎన్నేండ్లు కొట్లాడాలె ...? మా బతుకంతా కొట్లాటల్లోనేనా ...? అని ప్రతి తెలంగాణ బిడ్డ అంతరంగంలో ఆక్రోశించింది. విగ్రహాలు మళ్లీ పెట్టడానికే నిధులు కేటాయిస్తున్న ఓ సీమాంధ్ర ప్రభుత్వమా? మరో మలియిన్ మార్చ్‌కు స్థానం కల్పించకుండ్రి. మా స్మృతులు, మా జ్ఞాపకాలు, మాకు కావాలి. అది మా తెలంగాణ వచ్చాకే.

సమైక్యాంధ్ర అంటే తెలంగాణ విగ్రహాలను ట్యాంకుబండ్‌పై పెట్టకూడదని కాదు ...
సమైక్యాంధ్ర అంటే తెలంగాణ వారి ఉద్యోగాలు కాజేయటం కాదు ...
సమైక్యాంధ్ర అంటే తెలంగాణ నీరు, నిధులు దొబ్బుకెళ్ళటం కాదు ...
సమైక్యాంధ్ర అంటే తెలంగాణ భూములు ఆక్రమించడం కాదు ...

**– వేదకుమార్. యం**
ఛైర్మన్, తెలంగాణ రిసోర్స్ సెంటర్

## ముందుమాట

# సాగరతీరంపై అలల కలల అలజడి అర్థమయ్యే రోజున...

ఐదునెలల తదుపరి.....

ఎంతో చర్చ జరిగాక, పుస్తకాలు వచ్చాక, ఆనాటి ఉద్యమ ఉధృతిని మనసు మరచి పోతున్న వేళ... అప్పట్లో రాసిన, కొత్తగా చేర్చిన కొన్ని రచనలతో 'మిలియన్ మార్చ్'పై ఒక పుస్తకం. మళ్ళీ పునఃసమీక్ష. ఇంతకీ ఆ రోజు ఏం జరిగింది? ఆ ఆలోచనలోకి మరోసారి వెళ్ళక తప్పదు.

విరిగిన లాఠీ చప్పుళ్ళ వెనక దాగిన అసహనం–మేం మార్చ్ (ఫాస్ట్) చేస్తామని చెప్పిన ఉద్యమకారులు అలాగే చేస్తారు కదా! మిలియన్ మార్చ్(ఫాస్ట్) ని అప్రకటితంగా నిషేధించడం ఎందుకు? జిల్లాలవారిగా, జిల్లాలనూ రాజధాననీ కలిపి పోలీసు వలయాలు ఎందుకు? మేం మా రాజధానికి వస్తాం అంటే–ఎందుకు రావొద్దనే ప్రశ్నకు జవాబు ఇచ్చేవారెవరు? ఇవ్వడానికి ఎవరైనా ఉన్నారా? ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది కదా? వాళ్ళు రావాలని కొన్ని రోజులుగా అనుకున్నారు. అలా వచ్చి తమ చైతన్యాన్ని, సంఘటిత శక్తిని టాంక్‌బండ్ పై ప్రకటించాలని భావించారు. పరీక్షలున్నయని ఓసారి తామే 'మార్చ్' కార్యక్రమాన్ని వాయిదా వేశారు. మార్చ్ 10న కదులుతామని చివరి సైరనేశారు. చాలా ముందుగానే నగరం నడిబొడ్డుకి చేరాలని తపన. ఆ నడిబొడ్డు పేరు హుస్సేన్ సాగర్. ఆహారం చుట్టూ తమ అస్థిత్వ హహాకారాలు వినిపించాలన్నదే వారి కోరిక.

అక్కడ అనాదిగా ఏకధాటిగా తొమ్మిది రోజులు వేలాది వినాయకుల విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. డప్పులు, తాళ మేళాలతో, నృత్యాలతో, అరుపులతో, కేకలతో, పూనకంతో కొందరు, భక్తితో కొందరు అక్కడికి వస్తారు. సందెట్లో సడేమియాలూ, కపట మనుషులూ కొందరు ఉంటారు. బతుకమ్మలాటలకూ హుస్సేన్ సాగరే అడ్డా. పేర్చిన బతుకమ్మలూ, తయారుచేసిన విగ్రహాలనే కదా నీటిలో కలుపుతారు. విగ్రహాలను జలరాసిలో నిమజ్జనం చేయడం ఒక తెలుగు సంప్రదాయమే కాదు, భారతీయ సంప్రదాయం కూడా. ఆదిమ మానవ సారం లోంచి రూపొందిన ఒక అనివార్య కార్యాచరణ.

తుడిచిపెట్టే నీరే విడవకుండా బ్రతుకుని సింగారిస్తుంది. నీటికి బ్రతుకును నిలపడం తెలుసు. అందుకే మనిషి చితాభస్మం నీళ్ళలో కలుపుతారు. తిరిగి జీవించే భావన మనిషికి బలీయంగా ఉంటుంది. అది నీటికీ, ఏటి గట్టుకీ తెలుసు. చాకలివాళ్ళ కులదైవం మడేలు గుడి చెరువు ప్రక్కనే. స్నాన పానాలేకాదు, బట్టలను చెరువు శుభ్రం చేస్తుంది. కొత్తదనానికీ, పరిశుభ్రతకీ చిహ్నం చెరువుకట్ట.

అదో అలాంటి హుస్సేన్ సాగర్ చెరువుకట్టమీదకు చేరాలని జనం తాపత్రయం. చెరువు ప్రక్కనే జాతరలు జరుగుతాయి. నీటి ఆదరువే సంస్కృతికి మూలం. చెరువు కట్టని ఆనుకొని మైసమ్మ గుడి ఉంటుంది. మైసమ్మకి మొక్కకుందామని కూడా అక్కడికొచ్చిన కొందరు అనుకొని ఉంటారు. మైసమ్మకి బలి ఇవ్వడం జన సంప్రదాయం నల్లకోడో, కొబ్బరికాయో పగలకొట్టి పగటిపూట నైవేద్యం ఇస్తారు. టాంక్ బండ్ క్రింద మైసమ్మ గుడి ఉందని కొందరికే తెలుసు. కట్ట క్రింద నుండి పోతుంటే మధ్యలో కట్టని మోసే మూల విగ్రహం మైసమ్మే. ఈ ప్రక్కనే మెట్లున్నాయి. కోట్ల ధనం కుమ్మరించి తెప్పించిన ఉత్తర భారతానికి చెందిన సిఆర్‌పి జవానులకు ఆ మెట్ల గురించి

తెలియదు. మైసమ్మ మాయ అలాంటిది. ఆ మెట్ల మీద నుంచే వేలాది జనం కట్టమీదకు చేరారు ఆనాడు.

కట్టకిరువైపులా రాపిడ్ ఆక్షన్ ఫోర్సులు. తుపాకులతో వందలాది పోలీసులు. అత్యాధునిక వాహనాలు. జనం కనిపిస్తే లాఠీలు, టియర్ గ్యాసు తూటాలు దేనికవే పదునుదేరాయి. లాఠీలను నమ్ముకున్న ప్రజాస్వామ్యం తన గోతిని తనే తవ్వుకుంటోంది. జరిగింది అదే.

ప్రజలకు ఉద్యమించే హక్కు లేదిక్కడ. రాజ్యాంగం చిన్నపోయింది. కానీ దానికి ప్రాణం పోసేందుకు ప్రజలు నలువైపు జిల్లాలనుండి తండోప తండాలుగా వచ్చారు. యాభై కిలోమీటర్ల దూరం నుండి నడిచివచ్చిన వాళ్ళున్నారు. రక్తమోడే అవయవాలతో టాంక్ బండ్ చేరిన యువకుల శరీరం లోంచి కారిన రక్తం చూసి కొన్ని విగ్రహాల కళ్ళల్లో అరుణిమ. గాయపడిన యువకుల దేహాలు చూసిన మిగతా వాళ్ళకి ఏమనిపిస్తుంది? ఎవరైనా ఊహించగలరా! తిరిగి వెళ్లేపుడు ఇంటికే వెళతారో, జైలుకే వెళతారో, ఎక్కడికెళ్ళినా ప్రాణాలతో ఉంటారో లేదో తెలియదు. పరిస్థితులు అంత కర్కశంగా మారాయి.

**తన అస్థిత్వానికి విఘాతం కలిగినప్పుడు మనిషి ఏమవుతాడు?** క్రూరత్వం మార్చ్ చేస్తుంటే – చేస్తూ ఇనుప బూట్లతో గర్జిస్తుంటే – లోకాన వేల ఉద్యమాలు జరిగాయి కదా! ఏం జరిగింది? ఆనాడు స్వాతంత్రోద్యమంలో ఏం జరిగింది? రాయ్ రప్ప, పలకా బలపం ఏదైనా నిరసనకి సంకేతం అవుతుంది. చిట్టచివరికి చెప్పులు కూడ నిరసనగా విసరబడ్డాయి. ఐనా లాఠీల మార్చ్ ఆగలేదు. ఆ శబ్దం టాంక్ బండ్ మారుమ్రోగింది. నాటి పదఘట్టనలతో బండ్ గాయపడింది. మార్చ్ చేస్తున్నది ఎవరో అప్పుడు చెప్పడం కష్టమైనపనే లాఠీలా? – జనం నినాదాలా?

టాంక్ బండ్‌యుద్ధం సమైక్య బలగాలకి, సామాన్య జనాలకి మధ్య జరిగింది. ఒకరిది అణచివేత. మరొకరిది నవనిర్మాణ భావన. పోలీసులు, వారి ఆయుధాలు సమైక్యంగా ఉన్నాయి. ప్రజలు గుంపు గుంపులుగా చీల్చబడ్డారు. కనిపిస్తే లాఠీలు లేచాయి. వేలాది వీపులు చీరిపోయాయి. కొన్ని తలలు పగిలి రక్తమోడ్చాయి. ఆగ్రహాన్ని ఆవలి వేపుదాకా కిందపడేసి లాక్కెళ్ళితే ఏం జరుగుతుంది? అది రాజ్యానికి తెలుసు. తెలిసి ఆందోళనకారులపై విధ్వంసం రేగింది. కొన్ని గంటలపాటు శరీరాలపై విధ్వంసం జరుగుతూనే ఉంది. ఒక్కో అవయవం గాయపడుతూనే ఉంది.

ఏవరైన ఏం చేస్తారు? దోపిడీకి గురైన రైతు – దేవుడిని సైతం తిట్టగలడు. అతడు కనిపిస్తే పాదరక్ష విసరగలడు. అమెరికా అధ్యక్షుడికి ఏమైందో తెలుసు. నాలుగు బంగారు కాసులు వస్తాయనుకుంటే ప్రకృతి ప్రసాదించిన ఇసక మేటల్ని, చరిత్ర నిర్మించిన సాంస్కృతిక సంపదని సమైక్యంగా త్రేన్చగలరు. బాక్సైట్ పేరుతో చివరి గిరిజనుణ్ణి చిదిమేయగలరు. భూదాహం, భూగర్భ వనరుల దాహం, తల్లి గర్భాన్ని స్పృశింప చేయగలరు. ఇదంతా సమైక్యంగా చేయబడుతుంది. వంచించడం ఎప్పుడూ సమైక్యమే. రాజకీయాలు ఎక్కడివైనా అంతే. విగ్రహాల, ఆలయ ప్రాకారాల విధ్వంసం నిరంతరం జరుగుతున్నా గొంతెత్తదు రాజకీయం.

నలువైపులా తలుపులు మూసి పిల్లిని అదరగొడితే పీక పడుతుంది. సమైక్యతకి వంతపాడే ప్రభుత్వాలు నిలిపిన విగ్రహాలు అప్పుడు అక్కడ కనిపించాయి. ఆగ్రహాపు పిల్లికూనలకి కొన్ని విగ్రహాలు కనుపించాయి. వాటిని టాంకుబండ్ జలంలో కలిపేయాలనుకున్నారేమో, వాటిని సృష్టించిన సమైక్య సంస్కృతిలోని డొల్లతనాన్ని జలంతో అభిషేకించాలనుకున్నారు. ఆనాటి తమ అస్థిత్వ వేదనకి ఒక ఆరూప నిర్మాణ కార్యక్రమం కల్పించాలనుకున్నారు. ప్రభుత్వంపై ముఖ్యంగా అక్కడ విలయతాండవం చేసిన లాఠీలపై నిరశన తెలపడం అనివార్యమైందని పాల్గొన్నవారు చెప్పగా విన్నాం. విషాద పరిస్థితులను గంటలకొద్ది కొనసాగించడం ఆటవికతనం. ఇప్పుడక్కడ తన – పర తారతమ్యాలు ఉండవు. మంచి చెడుల మధ్య కర్కశంగా మలిపేసిన గీతలు ఒక సంకేతాన్ని గుర్తుపెట్టుకుంటాయి.

చరిత్రలో బౌద్ధ నిర్మాణాలను నాశనం చేశారు. బుద్ధుడి బోధనలనే కాదు, విగ్రహాలను కూడా మట్టి కరిపించారు. అలాగే అన్ని మతాల విగ్రహాలను మరో మతం ధ్వంసం చేసింది. రెండున్నర వేల ఏళ్ళ నాటి భారతీయ చరిత్ర ఇది. సోవియట్ రష్యాలోని వివిధ ప్రాంతాలలో వేలాది లెనిన్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. వామపక్షం నెరపిన రాజకీయ నియంతల పాలనని వ్యతిరేకించేవారు అప్పుడు కనుపించిన లెనిన్ విగ్రహాలను కూల్చేసారు. చాలామంది

కోపం లెనిన్ మీద కాదు, నియంతృత్వం మీద. స్టాలిన్ కావచ్చు, స్థానిక ప్రాంతీయ రాజకీయాలు కావచ్చు. ఆరాచక పాలన ఎవరిదైతేనేం, విగ్రహాలను అడ్డుపెట్టుకుంటే జరిగేది ఇదే. లెనిన్ విగ్రహాలు కూలిపోతుంటే అది తప్పని ఏనాడూ అతని వాళ్ళూ, పైగా సంతోష ప్రకటన చేసిన పెట్టుబడి వర్గాలకి చెందిన తెలుగు మేధావులు ఎందరో. ఇది యుగద్వంద స్వభావం.

ఇకపోతే మార్క్సిజం విగ్రహాల సంస్కృతిని హర్షించదు. తొలినాట్ల విప్లవ సాంస్కృతిక రంగం సాహిత్య విగ్రహాలను అక్షరాల ద్వారా కూల్చారు. జాతుల సిద్ధాంతం కేంద్రీకృత పాలనని, నాటి విగ్రహాలను ఏ విధంగానూ హర్షించలేదు. వివిధ మతాలు కూల్చిన విగ్రహాల లెక్క చెప్పలేదు. ఈనాడు అత్యాధునిక సిద్ధాంతాలు కూడా విగ్రహాల కుదుపుని ఆహ్వానించాయి. ప్రతి దాన్ని ప్రశ్నించే సూక్ష్మ విధానం పెరిగిన వేళ మహా విగ్రహాలు కూడా ఇవ్వాళ నిలువని పరిస్థితి. దళిత, స్త్రీనాదాలు, బ్రాహ్మణ, పురుషాధిక్య విగ్రహాలను ప్రశ్నించాయి. కొన్ని కుప్ప కూలాయి. సామాన్యులు సంధించిన ప్రశ్నలకు మరికొన్ని విగ్రహాలు అవిటివయ్యాయి. సాహిత్య కళారంగాలలో ఆధిపత్య వర్గాలకి చెందిన వాళ్ళ నిలువెత్తు ప్రశ్నల ధాటికి నిట్టనిలువునా అనేక విగ్రహాలు కూలాయి. బ్రాహ్మణ్య సాహిత్య సాంస్కృతిక రంగంలో సజీవ విగ్రహాలని ప్రశ్నించడం చూస్తూనే ఉన్నాం. ఈ విగ్రహాలు జవాబివ్వలేని ఈ పరిస్థితి ఒక వాస్తవం.

ఈ నేపధ్యంలో ...

విగ్రహాలపై అగ్రహం కట్టలు తెగిన నిరాశ. అప్పుడు కనిపించాయి. ఆ కట్ట మీద కొన్ని బొమ్మలు.

మనం టాంక్‌బండ్ మీద విరిగిన బొమ్మల్ని కాదు. – ఆ బొమ్మల వెలుపల వాటిపై ఎవరూ ఆసక్తిగా లేరని గ్రహించాలి. ఇష్టం లేనిచోట– అయిష్టత పెరిగిన కాలాన రాజకీయ పెట్టుబడిదారీ నియంతల ప్రకటనలపై నిరసన ఇది. ఈ కొత్త ధనిక వర్గాల విగ్రహాల బలవంతపు సమైక్య వాదాల మీద నిరసన. చర్నాకోల చరుపు ఇది. "జగడా"లమారులు తమని తామ దాచుకోవడానికి ఉపయోగించుకునే ఈ విగ్రహాలపై అప్పుడు ఆ సమయంలో ఎగసిన ఆగ్రహాజ్వాలగా మాత్రమే చూడాలి. ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రకటనలకు ఎప్పుడూ కళ్ళెం వేయనివారు, తరతరాలుగా ఇక్కడ జరిగే విధ్వంసానికి గుర్తించి మానవతాన్ని ప్రకటించని వాళ్ళు నేరస్థులునిగానే మిగిలిపోతారు. ఇక ముందు ప్రజలు ఎలాంటి నిగ్రహం పాటించకపోయినా అందుకు బాధ్యత ఈ కుహనా ప్రజాస్వామ్య వాదులదే. తప్పులు జరిగేదాకా లాగే తత్వం వెనుక ఒక క్రూర స్వభావం తాండవిస్తుందని తెలుసుకోవాలి. ఈ క్రూరత్వాన్ని ఎదురించే సంఘటనగా దీన్ని చూడాలి.

విగ్రహాల స్థాపన చాలా వరకు పాక్షిక ప్రయోజనకారే. చరిత్రలో చాలా సార్లు వినిర్మాణం నిర్మాణానికి దారితీసింది. నిర్మాణ లోపాలను సరిదిద్ది మరింత సరైన మార్గంలో కట్టడం జరుగుతుందని చరిత్ర తేల్చి చెప్పన నిజం. మరో విషయం ఏమంటే విగ్రహ నిరసన ఎప్పుడూ జనోద్యమానికి, ప్రతిబింబం. ఉద్యమ తీవ్రత కొలిచే జ్వరమానిని. ఎక్కడో పేలాల్సిన విస్ఫోటనకి నిరసన ప్రతిరూపం ఆనాడు బొమ్మలపై కోపం తీరకపోతే మునుషులపై ప్రతీకారం పెరిగేది. ప్రతీకారం ఏవైపు మంచిదికాదు. అది జ్వాలగా మారితే ఆర్పడానికి మనవద్ద ఎలాంటి పరికరాలు సిద్ధంగా లేవు. ఆసోం, కాశ్మీర్, శ్రీలంక వంటి దౌర్భాగ్య పరిస్థితులు ఏర్పడ్డం మనకు అవసరం లేదు. అలాంటి పరిస్థితుల నుండి గుణపాఠాలు తీసుకోవాలి. అవి తలెత్తకముందే విజ్ఞత మేల్కోవాలి. పోతే ఏవైపు నుండి కూడా గీత దాటకూడదు. ఈసారి మొదట గీతలు పెట్టి గీత దాటింది రాజ్యం. అందుకే కిమ్మనకుండా గమ్మునుండిపోయింది.

పిల్లి పిల్లిలని గదిలో వేసి నలువైపుల నుండి తరమకండి. అది జాతీయమో సామెతో తెలియదు. వాస్తవం అయ్యుంటుంది. గీతలు గీసి గీసి అందులో వేసి కొట్టవద్దు. సజీవ విగ్రహాలు పేలుడు పదార్థాలయ్యే దాకా వత్తిడి పెంచకండి. ఆ వత్తిడి ఏర్పడిన తదుపరి వారు చేసిన పనులని తప్పు పట్టవద్దు. పీక పట్టిన పిల్లితో ఏమని సంభాషిస్తాం?

ఇంత వరకు పిల్లలు తమని తాము దహనవాటికలు చేసుకున్నారు. విధించుకున్న ఉరితాడులో తెలంగాణ గీతాలు పాడారు. లేఖల్లో తమ దౌర్భాగ్యానికి వగచారు. విషం తాగి లేత ప్రాణాలు అర్పించారు. ప్రాంత ప్రాంతేతర కుట్రలు కుతంత్రాలను అగ్గిపుల్లల వెలుగులో చూపారు. ఇదే అదునుగా ఇంకా విద్వేషాగ్ని రేపవద్దు. లాఠీలు, కేసులూ, అరెస్టులతో మహోద్యమం చల్లారగలదా? ఆలోచించండి.

తీగ లాగితే డొంక కదలాలి. కాని డొంకని కదిలించి తీగల్ని మెలిపెట్టాలని చూడ్డం విజ్ఞతకాదు. నా దేశానికి నన్ను రానివ్వకపోతే నేను నేరస్థున్నైనా ఫరవాలేదు. నా దేశంలోకి దొంగతనంగా జొరబడతారు. నా మాతృభూమి నా హక్కు. రాజకీయ కారణాలు చూపి నిషేధించడం నియంతృత్వం. నియంతలు గీచిన గీతలు అప్పటికప్పుడు చాలా ధృడంగా ఉన్నట్లు కనిపిస్తాయి. కాని అవి ఎంత డొల్లవో వాటిని దాటిన చిట్టెలుక నిరూపిస్తుంది. ఆ చిట్టెలుకలు గీతల్ని కొరికి పడేస్తాయి.

అనాడు తెలంగాణాలో జరిగింది అదే. నిరంకుశ నైజాం నవాబు 53 గస్తీ నిషాన్‌ని తెలంగాణ తిరస్కరించింది. దాని ప్రతులను అగ్గిపుల్లలు పలకరించాయి. తుర్రేబాజ్ ఖాన్ ఆంగ్లేయ రెసిడెన్సీని విక్టోరియా రాణి విగ్రహాన్ని నిరాకరించాడు. గోలుకొండ ఖిల్లా కింద ఘోరీ కడ్తానని ఒక యాదగిరి ప్రకటించాడు. నిజాం విగ్రహాలు టపటప నేలకూలాయి. ఆ మధ్య అందరూ ఒక్కటై తెలంగాణలో నిషేధ ప్రాంతాలు ప్రకటించారు. కానీ వాళ్ళే నామరూపాలు లేకుండా కాలగర్భంలో కలిసిపోయారు. ఇప్పుడు ఆ ప్రాంతాలు ఆత్మగౌరవం కోసం పోరాడుతున్నాయి. ఉద్యమం పేర యువకులని ఊచకోత కోస్తే అది ఆదిలాబాద్ నిషేధ ప్రాంతాలుగా ప్రకటిస్తే అది కరీంనగరు. జగిత్యాల ట్రాన్స్ ఫార్మరుకు గిరిజనుడిని వేలాడదీసిన ఓరుగల్లు. ఇలా పది జిల్లాల్లో అనేకమంది ... ప్రాణాలు, ఆస్థి భూమి అన్నీ కోల్పోయినవారు ఉన్నారు. కానీ తెలంగాణా ప్రజలు ఓడిపోలేదు. వాళ్ళు గెలవడానికే ఊపరి పీల్చారు. ఆ ఊపిరే ఇవ్వాళ ఉద్యమం అయ్యింది.

టాంక్‌బండ్ పై ఎగిసిన యువకిశోరాల క్రోధం వెనుక ఇంత చరిత్ర దాగి ఉంది. వచ్చినవాళ్ళు పోలీసులు. వారు ప్రజలను రాకుండా బ్యారికేడ్లు ఏర్పరిచారు. అలా తమని తాము అక్కడ బంధీ చేసుకున్నారు. ఆలోగా కొంత సమయం దొరికింది. ఏం చేయాలి? మనసులో ఓటమి బాధ మమ్మల్ని రానివ్వకుండా పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని సందేశాలుగా మిత్రుల సెల్ ఫోనుల రొద తమ భాధ కాదు, ఇతరుల మీద జరిగే అకారణ హింస సందేశాలుగా .... ఉక్రోషం కట్టలు తెంచుకుంది. ఆ కట్ట మీద ఏం చేయాలి? ఏం చేస్తారు?

అందరి మనసులో మాట – మమ్మల్ని మా రాజధానికి రానిస్తే ఏమౌతుంది? అలా వచ్చి ఇలా వెళ్ళేవాళ్ళం కదా. బందోబస్తు కోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టే ఏర్పాట్లు చేయడం ఎందుకు? ఇంత అణచివేత అవసరం లేదు కదా!

ఇదే ఆనాటి టాంక్‌బండ్ మీద ఎగిసిన ఆలోచనలు అక్కడ లభ్యమైన స్వల్ప సమయంలో కంటి ముందు కనిపించినయి విగ్రహాలు, ఆ విగ్రహాల వెనుక జగడాలమారులు, జగన్మోహనులూ అలా ఎందరో కనిపించారు.

ఆ విగ్రహాలపై ఆగ్రహం నిజమైందా? ఇంకా ఎవరి 'హస్తా'లైనా ప్రచ్ఛన్నంగా ఉన్నాయా? ఇప్పటికీ తెలంగాణాని తొలిచే ప్రశ్న ఏదో సినిమాలో 'కొట్టకండి కొట్టకండి' అంటూ అరిచిన అరుపులు విని కోపోద్రిక్తులైన ప్రజలు కొట్టే చూపారట.

అలాంటి సంఘటనకి కూడా ఆస్కారం ఉందనేది నలుగురి నమ్మిక. జరిగిపోయింది ఒక సంఘటన అది సమైక్యతకి విధ్వంసంలా కనిపించింది. ప్రత్యేకతకి నూత్న నిర్మాణంలాగా అనిపించింది. ఏది ఏమైనా ఉత్తర, దక్షిణ ధ్రువాలంతటి వాస్తవం.

ఆక్రోశం కట్టలు తెంచుకుంది. ఆవైపు బలిదానాలు చేసిన ప్రాణాలకు శాంతి కలిగిందని భావించారు. ఈ వైపు గతం పగిలిన చప్పుడు వర్తమానంలో కూలుతున్న సజీవ విగ్రహాలు. విగ్రహానికి పెట్టిన పరీక్షలో ఓడింది అంక్షలే.

ప్రజాస్వామిక సమాజం ఏది ఒప్పు ఏది తప్పు చెప్పలేక చాలా వరకు మౌనం వహించింది. ఎటూ మొగ్గు చూపని లోకం కంటి ముందర పగుళ్ళకన్నా ప్రచ్ఛన్న ద్రోహం నేర రంగంలోంచి తప్పించుకుపోయింది. తెలంగాణ తల్లి విగ్రహం ఆవిర్భావం రోజే అన్ని విగ్రహాలు పటాపంచలయ్యాయి. పెంపుడు తెలుగు తల్లి పక్కన అసలు తల్లి వచ్చి నిలవడంతోనే స్పష్టమైంది. విగ్రహా సంస్కృతికి అప్పటి నుండే చెక్. ఆ పరిస్థితులు తెచ్చింది మాత్రం అక్రమ ఆక్రమణల పెట్టుబడి సౌధాల సాధకులే అన్నది అందరి భావన.

ఒకటే రంది. పగబట్టిన శక్తులపై ఎదురు తిరగడం ఎలా అని రంది అధికమవుతుంటే హృదయానికి తెలంగాణ దగ్గరవుతున్నది. కోపం పెరిగిన కొద్ది లక్ష్యం స్పష్టమౌతుంది. రాజకీయరంగం పట్టు సడలించవచ్చు. కాని జనం ఉడుముల్లా పట్టుకుని కూర్చున్నారు. ఈ పట్టు విడివడదు. విడిపోవడం తప్ప.

ఒక గట్టి నమ్మకం ఏమంటే ...

హుస్సేన్ సాగర్ నీళ్ళు లేకుంటే, హుస్సేన్ సాగర్ కట్ట అయ్యుండకపోతే విగ్రహాలు విరిగేవి కావేమో. జల సమర్పణ చేయడమే ఆనాటి అప్రకటిత లక్ష్యం అని అనిపిస్తున్నది. నీళ్ళలో పడిన సంకేతాలు తిరిగి పుడతాయి. మట్టితో చేసిన వినాయకుడి విగ్రహం తీరం చేరుతుంది. కోసిన పూలు నీటిలోకి సాగనంపిన బతుకమ్మ తిరిగి కొమ్మలపై చిగురిస్తుంది. అవి బతుకులను తిరిగి కొత్తగా అలరిస్తాయి. విగ్రహాల వరుసలో కొన్ని కొత్తవి చేరాలని అనుకున్నారు. మరిన్ని విగ్రహాల సమతౌల్యత ఆశించారు.

ఒనాడు విగ్రహంగా రూపం లేని కట్టమైసమ్మ ఇప్పుడు విగ్రహంగా మారింది. భావన స్థలాన్ని బట్టి ఉంటుంది. రూపం ఉండదు. రూపం ఏర్పడ్డాక అన్ని ప్రాంతాల్లో అలాగే ఉండదు. భావన ఉంటుంది. అది ముఖ్యం విగ్రహాల వద్ద క్రొత్త విగ్రహాభావన – విగ్రహం చెడా? స్థిరమా? అంటే ఏ విగ్రహం స్థిరం కాదు. గతం వర్తమానం కానట్లే.

ఒక దిక్కు విగ్రహం ఆదర్శంగా పెట్టుబడిదారులు, మరో దిక్కు పోరాట రూపంగా బ్యారికేడ్లే విగ్రహాలు. ఈ విగ్రహాలను లాఠీలు పడేస్తున్నాయి.

ద్రుశ్యాల్లో ఇమడని నిరంతర ధ్వంసం పది జిల్లాల్లో అంతటా కనుపిస్తున్నది. ఇది ఒక బాధాకరమైన కిరాతకం. కనుపించే కొన్ని పగుళ్ళు మాత్రమే చూస్తే అది మహా నేరం. అలాంటి నేరస్థ జాతితో సమైక్య జీవనం ఎందుకు? ఏం భావుకుందామని? నినదిస్తే కేసు. ఉద్యమిస్తే అరెస్టు. ఎంతకాలం భాగోతం ఇది? నిజంగా ఇక్కడ సహజీవనం చేయగలరా? ఇంత జరిగాక. అణచివేత ఇంత పెచ్చరిల్లితే మరిన్ని విగ్రహాలు కూలుతాయనే భయంకూడా లేదు. అట్లని పరస్పర అంగీకారంతో సుహృద్భావ వాతావరణం అయినా ఏర్పాటు చేస్తారా? అదీ లేదు. అందుకే విగ్రహాలు పగిలిన చోట తమ రియల్ కట్టడాలు ఉంటాయా? ఉండే వీలులేదు. అందుకే తిరస్కారం వినిపించాల్సిన సమయంలో సమైక్య యుగళగీతాలు ఎందుకో ఎవరైనా చెప్పగలరా? రాజ్యమే తాలిబనీయం అయినప్పుడు దాన్ని ధిక్కరించినవాడు తాలిబనే అవుతాడు. ఐనా మనం గొప్పగా చెప్పుకునే నియంతృత్వ మతాలు, రాజ్యంతో మిలాఖతయి కూల్చిన ఆలయాలు అనేకం. కూలిన విగ్రహాల లెక్క వేలల్లోనే కదా! తాలీబనాంకురాలు ఆధిపత్యంలోనే సేదతీరుతాయి. ప్రజోద్యమాలలో కాదు. ఆనాడు అక్కడ జరిగింది. అప్పటికప్పుడు ఎగసిన ఆగ్రహజ్వాల మాత్రమే. తాలీబనీయ భావన అధిపత్య పాలకవర్గ స్వభావం. అది పాలితులు, సామాన్య జనం ఆలోచన అసలే కాదు.

పాతబస్తీ అల్లర్లు, విజయవాడ అల్లర్లు, ఎస్టీఆర్ పదవీచ్యుతి, రెండోసారి దశమగ్రహం నమ్మకం ద్రోహం, దళిత మానవ ఊచకోతలు. ఇవన్నీ ఎవరి కోసం జరిగాయి? ఈ కుహకంలో దాగిన తాలీబనీయత ఎన్ని రెట్లతో చెలరేగిందో అందరికీ తెలుసు. అది సమైక్య వాదులు చేసినవి. కాబట్టి వాటిని విస్మరించాలి. అది వ్యక్తిగత స్వార్థం కోసం జరిగిన విధ్వంసం. అరవై ఏళ్ళ జనం అసహనంపై విధ్వంసకారుల నిరసనకి పోలిక ఉందా?

పీవీ విగ్రహం బదులు వైఎస్, ఎన్టీఆర్ బొమ్మని కాదని నాదెండ్ల, మామని కాదని అల్లుడు ఇలా ఎన్నెన్ని విగ్రహ విధ్వంసపు ఉదాహరణలు. ఎన్నింటిని చెప్పినా కనుపించేది విగ్రహా విధ్వంస లక్షణమే. నాలుగు కోట్ల విగ్రహ విధ్వంసంలో ప్రజలు విడిపోరు. నాయకులు, వారి తాబేదారులు తప్ప.

టాంక్‌బండ్ ఇవ్వాళ ఒక ఆలోచనల మందిపు కేంద్రం. కుదుపుకి సంకేతం.

నిర్మాణానికైనా వినిర్మాణానికైనా ఒక జలదరింపు తప్పదు. ఒక ఒత్త దశలో కదలికలు అనివార్యం. ప్రసవవేదన మాత్రం వాస్తవం. వాస్తవం గుర్తిస్తే మార్గం కనుపిస్తుంది.

సునామీ తరువాత కూడా బతుకు విస్తరిస్తుంది. బాధలోంచి, భయంల్లోంచి ఒక విస్పష్టత దారి తీస్తుంది. గతం గురించి కాదు. ఆ గతం గురించి మనం జాగురూకులమై ఉండాలి. రాజకీయ వలయాల్లో చిక్కకుండా ప్రజలు రెండు ప్రాంతాల నుండి, తీరాల నుండి పరస్పరం పలకరించుకున్ననాడు. విగ్రహాలు ముఖ్యం కాదు. సంభాషణ ముఖ్యం. అప్పుడు రెండు ప్రాంతాల ప్రజలు మనుషుల్ని కాకుండా సంకేతాలను మిళితం చేస్తారు. ఇవి కొత్త సమాజం నిర్మిస్తాయి.

అందుకే ... ...

అప్పుడు సాగర తీరంపై అలల కలల అలజడి అర్థం కాక మానదు.

**– ప్రొ॥ జయధీర్ తిరుమలరావు**





# శ్రీశ్రీ సరే ... దాశరథి మాటేమిటి ...?

చాలాకాలంగా చర్చ దోపిడీ గురించి జరిగింది. అయితే దోపిడీతో పాటు దాడి కూడా మొదలైంది. తెలంగాణ సంస్కృతిపైన ... యాసపైన, భాష పైన, ఇక్కడి నుడికాంపైన, ఇక్కడి పండగలపైన వారు దాడి చేశారు. వీళ్లకు చరిత్ర లేదు అనే పరిస్థితి సృష్టించే ప్రయత్నం చేశారు. ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల విషయంలో అలనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో అప్పుడే గొడవపడ్డాం. ఎం.ఐ.ఎం. వాళ్లయితే ఏ విగ్రహాలు పెట్టినా కూల్చేస్తామని అప్పుడే అన్నారు. మనుషులకు లేని రక్షణ విగ్రహాలకు ఎందుకన్నారు. ఈ విషయం ఇటీవల అసెంబ్లీలో అక్బరుద్దీన్ కూడా ప్రస్తావనకు తీసుకొచ్చాడు. కవులు శ్రీశ్రీ, జాషువాలు గొప్పవారే ... అందులో మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ దాశరథి కూడా శ్రీశ్రీ అంతటి గొప్పవాడే. ఎందుకు ఆయన విగ్రహం పెట్టలేదు? ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చేసరికి దాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు. ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు. సరే ... ఎలాగూ చంపేశారు కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

అల్లూరి సీతారామరాజులాగే కొమురం భీం కూడా గొప్పవాడే అని ఆనాడే చెప్పాం. అయినా తిరస్కరించారు. తెలంగాణ వైతాళికుల్లో దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామిలు కూడా గొప్పవారే. వాళ్లిద్దరూ నిజామాబాద్ జైల్లో ఉన్నప్పుడు దాశరథి గోడలమీద నిజాంకు వ్యతిరేకంగా నినాదాలు రాసేవారు. ఆయనను చూసి వట్టికోట ఆళ్వారుస్వామి కూడా రాస్తానంటే ఆయన్నూ పోలీసులు కొట్టారు. ఈ విధంగా నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వారి విగ్రహాలు పెట్టలేదు.

ఇక్కడ కొన్ని చారిత్రక వాస్తవాలు మర్చిపోకూడదు... నిజాం దర్బారులో కొంత కాలంఓ కొలువ చేసిన శ్రీశ్రీకి ఇచ్చిన గౌరవం ... నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామికివ్వలేదు. ఇది మన చారిత్రక నేపథ్యాన్ని తుడిచివేసే ప్రయత్నమే. అలాగే విద్యావేత్త, ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా పని చేసిన కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహం పెట్టారు కానీ ... అంతకన్నా గొప్ప పేరున్న ఉస్మానియా యూనివర్శిటీకి వీసీగా చేసిన నవాబ్ అలీ యవర్‌జంగ్ విగ్రహం ఎందుకు పెట్టలేదు? నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వాళ్లలో ముస్లింలు కూడా ఉన్నారు కదా ... జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను విస్మరించారు. ఇక పార్కులకు, రోడ్లకు అన్నింటికీ ఆంధ్రప్రాంతం వారి పేర్లు పెట్టారు కానీ ఒక్క తెలంగాణ ప్రముఖుడి పేరైనా పెట్టారా? వాళ్లకన్నా గొప్పవాళ్లు అనేక మంది ఇక్కడ వున్నారు. అయినా తెలంగాణ వైతాళికులను కావాలని పక్కన పెట్టారు.

ఈ సాంస్కృతిక దాడిలో కుట్ర ఏంటంటే ... తెలంగాణ వైతాళికులను మరుగున పడేయటం ...

అంతెందుకు ... వావిలాల, కాళోజీ దాదాపుగా ఒకేసారి చనిపోయారు. ఇందరూ గొప్పవాళ్లే ... సందేహం లేదు. కానీ వావిలాల చనిపోతే ఆయన స్మారకార్థం కొంత స్థలం కేటాయించారు... విగ్రహాలు పెట్టారు. అది చేయవలసిన పని ... ధర్మం కూడా ... అదే కాళోజీ స్మారకార్థం వరంగల్‌లో వెయ్యి గజాలు ఇవ్వమని అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిని అడిగితే ఇవ్వలేదు. హన్మకొండ, వరంగల్‌లో వెయ్యి గజాలు ఇవ్వడం కష్టమా?

చివరికి ఆయన విగ్రహాన్ని అక్కడి ప్రజల సహకారంతో పెడితే ... దాన్ని కూడా రోడ్డు విస్తరణ పేరుతో మూలన పడేశారు. వావిలాలను మేం గౌరవించాం. కానీ మా వాళ్ళకు మీరిచ్చిన గౌరవం ఏంటి? హుస్సేన్ సాగర్ తీరాన్ని ఎన్టీఆర్ కోసం ఘాట్‌గా మార్చారు. పీవీ నర్సింహారావు చితి దగ్గర కనీసం కాటికాపరిని కూడా పెట్టలేదు ... ఇదెక్కడి న్యాయం?

## సామాజిక న్యాయం ... తెలంగాణలోనే సాధ్యం ...

సామాజిక న్యాయం జరగాలనేది ఉద్యమంలో ఒక భాగం. సామాజిక న్యాయం అనేది సమైక్యాంధ్రలో అసాధ్యం. తెలంగాణలో మాత్రమే సాధ్యమవుతుంది. సామాజిక న్యాయం అంటే బడుగు బలహీన వర్గాల నుంచి ఓ నాయకుడు తనకు తానుగా నిలబడి ముఖ్య మంత్రి కావాలి. ఇప్పటిదాకా సమైక్యాంధ్రలో అలా ఎవరైనా అయ్యారా? తెలంగాణలో ఎట్ల సాధ్యమంటే ... తెలంగాణలో బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం బాగా పెరిగింది. దీనికి అనేక ఉద్యమాలు తోడ్పడ్డాయి. దానికి ఏమిటి నిదర్శనం అంటే ... అప్పటికీ కూడా ఆంధ్ర ప్రాంతంలో దళితులను ఊచకోత కోస్తున్నారు. కానీ తెలంగాణలో దళితుల్లో ఉన్న చైతన్యం వారిని కాపాడుతోంది. ఈ వాస్తవాన్ని తెలంగాణలోని ఓ సామాజిక వర్గం గుర్తించింది. కనుక మాకేం వస్తది అని ఇప్పుడు కాదు ... తెలంగాణ వచ్చిన తర్వాత ప్రశ్నించాలి. ఎప్పుడైనా యాచిస్తే హక్కులు రావు ... పోరాడితే వస్తాయి.

**– ప్రొ॥ జయశంకర్**

(నమస్తే తెలంగాణ దినపత్రికకు ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో భాగం)

జూన్ 7, 2011



# విగ్రహాలు ఎందుకు కూలాయి?

– చుక్కారామయ్య

**ఆ సంఘటన అందరి హృదయాల్ని కలచి వేసింది. దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోవలసిన అవకాశాలు ప్రజలకంటే పాలకులకే ఎక్కువగా ఉన్నాయి. కానీ దాన్ని కూడా వదులుకుంటున్నారు. ఇలా జనం చీమల్లా ట్యాంక్‌బండ్ మీదకు కదిలిరావటం ఇదే మొదటిసారి కాదు. ప్రతి బతుకమ్మ పండుగకు, వినాయక నిమజ్జనం సమయంలో ఆబాల గోపాలం కదలి ట్యాంక్‌బండ్ మీదకు రావడం జరిగేదే. కానీ, ఆ సందర్భంలో మాత్రం ఆ జనం మొఖాలపై నవ్వులు, కేరింతలు, ఉత్సాహాలు చూసేవాళ్లం. పోలీసులు కూడా కనపడేవారు. కానీ వారు లాఠీలను చూసి మురిసి పోయిందానికన్నా ప్రజల మధ్యన ఉండి, ప్రజల సంతోషాలతో లీనమౌతూ, తాము కూడా ఉన్నామని ప్రజలకు చెబుతూ ఉండేవారు. ప్రజలు ఈ 25 ఏళ్ల కాలంలో ట్యాంక్‌బండ్‌పై ఒక్క విగ్రహాన్ని కూడా ముట్టుకోలేదు. అది హైదరాబాద్ ప్రజల సంప్రదాయాన్ని, సహనాన్ని, నాగరికతను ప్రతిఫలించింది. అకస్మాత్తుగా మిలియన్ మార్చ్ ఎందుకు ప్రజల ఆలోచనల్ని మార్చింది? సంతోషాలకు బదులుగా ఆ సమయంలో కక్షలు ఎందుకు రేగాయి? ప్రజల మనోభావాల్లో ఎందుకు ఈ మార్పు వచ్చింది? దీని వెనుక 'రాజముద్ర' కనపడుతున్నది. ప్రజలను ట్యాంక్‌బండ్‌కు రానివ్వకూడదని, జేఏసీ ఇచ్చిన పిలుపును విచ్ఛిన్నం చేయాలని, తెలంగాణ ప్రజల మనోభావాలు కనపడకుండా చేయాలన్న ఎత్తుగడ పాలకులది. కేంద్రం మన్ననలను పొందాలన్న తహతహ రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. చిదంబరం మెప్పు పొంది అధికార పీఠంలో మరో మెట్టు ఎక్కాలన్న తపన ప్రభుత్వంలో ఉన్నట్లుగా కనిపించింది.**

మార్చి 10వ తేదీన పిల్లల పరీక్షను తమ బలంతో రాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ప్రజాబలంకన్నా అధికార బలం ఎక్కువని నిరూపించాలనుకున్నారు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు అధికారంతో నడవవు. పోలీసుల పహారాలో పాలన ఎంతకాలమో సాగదు.

ఏ రాజకీయ పార్టీ అయినా కూడా ప్రజల ఆకాంక్షను కాదనలేదు. ఈనాడు ప్రజలు తమ పిల్లలు చదువుకోవాలని, తమ పిల్లలు మానవ సంపదగా తయారు కావాలని, తమ ఆర్థిక ఎదుగుదలకు చేయూత నివ్వాలని ప్రజలు కాంక్షిస్తున్నారు. దాన్ని గమనించే బహుశా టీఆర్ఎస్, జేఏసీ తను కార్యక్రమంలో మార్పులు చేసుకుని పిల్లల పరీక్షలకు అవకాశం కూడా కల్పించడం జరిగింది.

ముఖ్యమంత్రి ఒప్పుకున్నారు. ఉద్యమం చేసే నిర్వాహకులు ఒప్పుకున్నారు. పిల్లల్లో టెన్షన్ తగ్గిందని ఆనిందించాను. ఇంటికొచ్చే సరికి టెలిఫోన్ కాల్స్ వచ్చాయి. సిద్ధిపేట, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ నుంచి వచ్చిన వందల మందిని అరెస్టు చేశారని చెప్పారు. నన్ను ఎందుకు మాట్లాడరని కొందరు అడిగారు. సహనం వహించండి! అరెస్టులు చేయరని చెప్పాను.

9వతేదీ రాత్రి నేను కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాను. రాత్రి 12 గంటల సమయంలో అడుగడుగునా తనిఖీలు చేయటం కళ్లారా చూశాను. అది ఒక్కచోటనే కాదు. పదిచోట్ల నా కారును నిలువెల్లా సోదా చేయడం జరిగింది. నా కారునే కాదు మొత్తం తెలంగాణ అంతటా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

తెల్లవారగానే మార్చి 10వ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వాకింగ్‌కు వెళ్లాను. పరీక్షల రోజున కూడా విశ్వవిద్యాలయం చుట్టూ అవే ముళ్లకంచెలున్నాయి. పరీక్షలు సాఫీగా జరగాలని పిల్లల్లో భయోత్పాతం పోవాలని ఎంత ప్రయత్నం చేసినా ఈ భయంకర పరిస్థితి తప్పలేదు. ఇంటర్ పిల్లలు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. కొందరు ఇంటర్ పిల్లల్ని కూడా అరెస్టు చేశారు. తల్లిదండ్రులను కూడా అనుమతించడం లేదని కొందరు ఫోన్లు చేశారు.ఏది కాకూడదని తలచానో అదే జరిగింది.పిల్లలు పరీక్ష రాశారు.కానీ 10 వేల పైచిలుకు విద్యార్థులు పరీక్ష రాయలేక పోయారు. పరీక్షకు ఒత్తిళ్లమధ్య హాజరైన విద్యార్థి ఏం రాయగలుగుతారో నాకు తెలుసు ఏదో పరీక్షలు జరిపామని ప్రభుత్వానికి సంతోషమా? జేఏసీ, టీఆర్ఎస్ ప్రోగ్రాంలను జరగనీయకుండా అపగలిగామని అహంభావమా? పరీక్షలు ఎవరి కోసం? ప్రభుత్వ గౌరవం కోసమా? పిల్లల భవిష్యత్తుకా? పిల్లలు పరీక్షలు రాసి వచ్చామన్న సంతోషాన్ని చూడాలా? లేక పోలీసుల ప్రవర్తనతో వారి మొఖాల మీద అసహనం చూడాలా?

ఇంటర్ పరీక్ష అయిపోయింది. మధ్యాహ్నం 1 గంట నుంచి ట్యాంక్‌బండ్‌పై రెండవ అధ్యాయం మొదలైంది. తెలంగాణ రాష్ట్ర సాధన పరీక్ష మొదలైంది. ఆ సమయంలో నేనప్పుడు ఒక నవోదయ స్కూల్లో ఉన్నాను. పరీక్షకు ఎలా ప్రిపేర్ కావలి! ఎంత ప్రశాంతంగా ఉండాలో వారికి చెబుతున్నారు. ఇంకోపక్క పిల్లలు పరుగెత్తుకుంటూ ట్యాంక్‌బండ్ వైపుకు వస్తున్నారు. హైదరాబాద్ చుట్టూ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రదర్శనలు చూసి తల్లిదండ్రులు సాయంతో ట్యాంక్‌బండ్ ఎక్కారు. పిల్లలు జమగూడితే వారి వెంబడి నడిచాను. ఒక్కొక్కరుగా తమ బాధలను చెప్పుకుంటున్నారు. అవి వినుకుంటూ వారిని సముదాయించుకుంటూ ట్యాంక్‌బండ్‌పై ఆ మూల నుంచి ఈ మూలకు తిరిగాను. ఒక విద్యార్థి ఆత్మహత్యప్రయత్నం చేసుకున్నాడని ఆ లేఖను చూపించి కొందరు విలపించారు.

విద్యార్థులను ఏం అనకండని పోలీసులను వేడుకున్నారు. దాని తర్వాత ఇంటికి వచ్చాను. ఇంటికొచ్చి టీవీ చూశాక మనస్తాపం చెందాను. ప్రజలకు,రాజకీయ పార్టీలకు మధ్య ఆగాధం ఏర్పడిందని అనిపించింది. రాజకీయ పార్టీలు విధినిర్వహణలో విఫలమయ్యాయి. అవి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ పౌరజీవనాన్ని కాపాడాలి. ఇలాంటి సంఘటనల నుంచి, ఇలాంటి క్షేత్రాల నుంచి రాజకీయ పార్టీలను దూరంగా ఉంచితే ఏం జరుగుతుందో అదే జరిగింది. ప్రభుత్వం డీజీపితో సంప్రదించేకన్నా రాజకీయ పార్టీలతో సంప్రదిస్తే బాగుండేది. రాజకీయ పార్టీలు పౌరజీవనాన్ని కాపాడగలుగుతాయి. దానికి ప్రత్యామ్నాయం పోలీసులు కాదని ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఘటనలు మరొకసారి తేల్చిచెప్పాయి. ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకోవటం కోసం భావితరానికి స్వేచ్ఛా వాతావరణం కల్పించటం కోసం ట్యాంక్‌బండ్ సంఘటనపైన ఒక సమగ్ర విచారణ జరిపించండని కోరుతున్నాను. ఇది దోషులను పట్టుకోవడం కోసం కాదు. ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడటం కోసం ఆ పని చేయాలి. ఆ విగ్రహాలను పడగొట్టింది కొందరు వ్యక్తులు మాత్రమే. వారు కావలని వాటిని పడగొట్టలేదు.

ప్రజాస్వామిక భావాలను చెదరగొట్టింది ప్రభుత్వమే. చెదిరి పోయిన ఆలోచనల నుంచి తలెత్తే ఆగ్రహానికి ఎవరూ ఎదురు నిలవలేరు. సహనం బద్దలైతే సంభవించేది ఉపద్రవాలే. సరిగ్గా అదే జరిగింది. ఇందుకు మూలాలు ఇకనైనా ఆలోచిస్తారా?

**– చుక్కారామయ్య,**

ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు

మార్చి26,2011, సాక్షి దినపత్రిక

# నిగ్రహం ఆగ్రహమైన వేళ!

**- సంగిశెట్టి శ్రీనివాస్**

కూలిన విగ్రహాలను చూసి ఆగ్రహంతో శివాలూగుతున్న సీమాంధ్ర నాయకులుగానీ, సాహిత్యకారులుగానీ, 55 ఏండ్ల నుంచి ఏడుస్తున్న 'తెలంగాణ తల్లి' కన్నీళ్లు తుడిసిండ్రా అని అడుగుతున్నాం. నోరులేని విగ్రహాలు ఏంజేసినయని అమాయకంగా అడుగుతున్నారు. ఆ విగ్రహాలేంజెయ్యలే. మా స్ఫూర్తి ప్రదాతలుండాల్సిన స్థలాన్ని కబ్జాచేసిండ్రు. ఖాళీ చేస్తలేరు. ఇది సాంస్కృతిక విషాదం అని వగచేముందు, ఆరు వందల మంది తెలంగాణ బిడ్డలు పాణాల్తీసుకున్న ఎందుకు కనికరం చూపలేదన్నది గుర్తు చేసుకోవాలి. మరికొందరు చీకటిరోజు అంటున్నరు. ఆరు ఏళ్ల నుంచి తెలంగాణ ప్రజలు చీకట్లనే బతుకుతున్నరు. అయినా అదెన్నడు ఆళ్లకు కనబడలే.

శ్రీకాంతాచారి,యాదయ్య, వేణుగోపాలరెడ్డి, పోలీసు కిష్టయ్య సహా వందల సంఖ్యలో తెలంగాణ బిడ్డలు బతుకులు బలిపెడితే సంతాపం కూడా ప్రకటించ లేదు. ఇది 'దుర్మార్గ చర్య' అంటూ రాష్ట్ర మంత్రులు మూకుమ్మడిగా ప్రకటన చేస్తరు! హైదరాబాద్ గల్లిగల్లిల ఇనుప కంచెలు, బార్బ్‌డ్ వైర్లతో రోడ్లన్నీ అష్ట దిగ్భంధం చేసి అడ్డుకోవడం దుర్మార్గ చర్య కాదా? నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాలన్నింటిని మిలటరీకి అప్పచెప్పి, బార్డర్లో మాదిరిగా కాపలా కాయించి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా కదలకుండా చేయడం దుర్మార్గం కాదా?

విగ్రహ విధ్వంసం తెలంగాణవాదుల మూర్ఖత్వానికి నిదర్శనం అని సీమాంధ్రులు గగ్గోలు పెడుతుండ్రు! ఇచ్చిన మాటకు కట్టుబడకుండా, తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైతదని ప్రకటించిన 24 గంటల్లోనే రాజీనామా డ్రామాలతో అలజడి సృష్టించి నోటికాడి బుక్కని కాలదన్నింది ఎవరు? ఇన్నిచేసి, ఇప్పుడు ఉద్యమంలో హింస చోటుచేసుకుందని వగల ఏడుపు ఏడుస్తుండ్రు! 2009 డిసెంబర్ 9 నుంచి 23 వరకూ సీమాంధ్రలో తగలబెట్టిన దాంతో పోలిస్తే, తెలంగాణలో జరుగుతున్నది లెక్కలోకే రాదు.

తెలంగాణకు ఏమాత్రం సంబంధం లేకుండా, కేవలం ఆంధ్ర రాష్ట్రం కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు విగ్రహం పెట్టుకుండ్రు, మరి తెలంగాణ కోసం కొసదనుక కొట్లాడిన జమలాపురం కేశవరావు, కొమురం భీం విగ్రహాలు ఎందుకు లేవు? ప్రథమాంధ్ర సంస్కర్త కందుకూరి విరేశలింగం అంటరు! ఆయన్ని మించిన ప్రథమ సంస్కర్త వనపర్తి రాజేశ్వరరావు అని, ఆధారలతో సహా సురవరం ప్రతాపరెడ్డి నిరూపించిండు. ఆయన ప్రతిమ ఎందుకు లేరు? మొట్టమొదటి అచ్చతెనుగు కావ్యం 'యాయాతి చరిత్ర' రాసి, తెలుగు భాషకు హారాన్ని అందించిన పొన్నగంటి తెలగనార్యునికి ట్యాంక్‌బండ్‌పై తానెందుకు లేదు? 'భాష'ను దేశీ మార్గం పట్టించి, సామాన్యుల 'సంభాషణ'లకు కావ్యగౌరవం కల్పించిన పాల్కురికి సోమనాథుడు ఎక్కడా కనిపించడెందుకు? సీమాంధ్రుడు సీఆర్ రెడ్డికి ఏమాత్రం తీసిపోని విధంగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి విశ్వవ్యాప్త కీర్తి తీసుకొచ్చిన వైస్‌చాన్సలర్ అలీ యావర్‌జంగ్‌ని ఎందుకు విస్మరించిండ్రు?

తెలంగాణ మహిళల్లో చైతన్యం తీసుకొచ్చిన టీఎన్ సదాలక్ష్మి జే ఈశ్వరీబాయి, సంగెం లక్ష్మీబాయి, సుగ్రాహుమాయూన్ మీర్జా, చాకలి ఐలమ్మ, మహిలఖాబాయిల విగ్రహాలు ఎక్కడని ప్రశ్నిస్తున్నాం. నాటి ప్రభువులను గడగడలాడించిన తెలంగాణ రాబిన్‌హుడ్ సర్వాయి పాపన్న,తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి ప్రాణమిచ్చిన

దొడ్డి కొమరయ్య. బ్రిటిష్ రెసిడెన్సీపై ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసిన తుర్రెబాజ్‌ఖాన్, గాయాల్ని గేయాలుగా మార్చిన సుద్దాల హనుమంతు, తెలంగాణ ఆర్తికి ప్రతీకలు కొత్వాలు వెంకటరామారెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి కృష్ణమాచార్య, రావి నారాయణరెడ్డి, బత్తిని మొగిలయ్యగౌడ్, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బద్ద ఎల్లారెడ్డివంటి వారిని సీమాంధ్రుల పాలన పూర్తిగా విస్తరించింది. వారిని స్మరించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది.

అన్ని రంగాలకు చెందిన సీమాంధ్రులంతా ఒక్కటై, తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికి కంకణం కట్టుకున్నరు.అందుకే తెలంగాణ ఉద్యమంలోకి నక్సలైట్లు, సంఘ విద్రోహ శక్తులు చొరబడ్డారని దుష్ప్రచారం చేస్తున్నరు. నిజానికి 'మిలియన్ మార్చ్'ను శాంతియుతంగా జరుపుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చివుంటే, ప్రజల్లో భావోద్వేగాలు తీవ్రమయ్యేవి కావు. అనుమతి నిరాకరించిన ఫలితంగా ఉద్రిక్తతలు చోటుచేసుకుని విగ్రహాల విధ్వంసానికి తోవతీసింది. ప్రణాళికాబద్ధంగా విగ్రహాల కూల్చివేత సాగివుంటే, 1969 ఉద్యమంలో 369 మందిని బలితీసుకున్న కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం మిగిలేదా?

**- సంగిశెట్టి శ్రీనివాస్**
తెలంగాణ హిస్టరీ సొసైటీ

సాక్షి దినపత్రిక, మార్చి26,2011


మార్చ్‌లో గద్దర్

# విధ్వంసం, దాడులు అవాంఛనీయమే కాని... మిలియన్ మార్చ్‌కు కారణం ఆధిపత్యం

**- ప్రొ॥ లక్ష్మణ్**

తెలంగాణ రాజకీయ ఐక్య కార్యాచరణ కమటి పిలుపు మేరకు ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్, మార్చ్ విజయవంతమైందని తెలంగాణవాదులు వాదిస్తుంటే తెలంగాణ వ్యతిరేకులు మాత్రం ఆది చరిత్ర పుటల్లో ఒక మాయని మచ్చని పేర్కొంటున్నారు. మిలియన్ మార్చ్ విజయవంతమైందా? విఫలమయ్యిందా? అన్నది కాదు ప్రశ్న. మిలియన్ మార్చ్ నుండి మనం తెల్సుకోవల్సింది ఏమిటి అన్నదే ప్రశ్న. అది తెలియాలంటే మిలియన్ మార్చ్‌లో జరిగిన సంఘటనలను విశ్వేషిస్తే తప్ప మనకు అర్థం కావు.

విద్యార్థుల వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని జెఎసి తాము తలపెట్టిన మిలియన్ మార్చ్ కొన్ని మార్పులు కూడా చేసింది. మిలియన్ మార్చ్ నిరసన కార్యక్రమం మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుందని, అంటే కేవలం మూడు గంటల పాటే అది జరుగుతుందని అందులో పాల్గొనే ఉద్యమకారులంతా తెలంగాణ రాష్ట్ర సాధనకై ప్రతిజ్ఞలు చేస్తారని ప్రకటించింది. అయినా మిలియన్ మార్చ్ కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. న్యాయస్థానాలు కూడా అనుమతి ఇచ్చేందుకు నిరాకరించడంతో చాలా మంది తెలంగాణ వాదులు నిరాశ, నిస్పృహలకు లోనయినారు. అసలు మిలియన్ మార్చ్ జరుగుతుందా? లేదా? అన్న సందిగ్ధంలో పడ్డారు. ఏ అనుమతులు లేకున్నా మిలియన్ మార్చ్ నిర్వహిస్తామని జెఎసి ప్రకటించడంతో దానికి బిజెపి, టిఆర్ఎస్, న్యూడెమోక్రసే పార్టీలతో పాటు విద్యార్థులు, న్యాయవాదులు, ఉద్యమ సంస్థలు, ఉద్యోగ సంఘాలు వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న తెలంగాణవాదులు మద్దతు పలికారు. వివిధ కారణాల వల్ల ఆశించిన స్థాయిలో మిలియన్ మార్చ్‌లో తెలంగాణ అభిమానులు పాల్గొనలేకపోయినా అది విజయవంతమైంది. కానీ అందులో చోటుచేసుకున్న సంఘటనలు ఒకటి విగ్రహాల విధ్వంసం, రెండవది నాయకులు మరియు మీడియాపై జరిగిన దాడులు, మూడు రకాల విగ్రహాల విధ్వంసం.

## చరిత్రకు చిహ్నాలు

విగ్రహాల విధ్వంసం ఇప్పటివరకు మూడు రకాలుగా జరగుతూ వచ్చింది. మొదటిది మతపరమైన విగ్రహాల విధ్వంసం, బౌద్ధమతం ఆవిర్భవించిన తొలి రోజుల్లో కొంతమంది రాజులు బౌద్ధాన్ని స్వీకరించి ఆ మతవ్యాప్తిలో భాగంగా పలు ప్రాంతాలలో గౌతమబుద్ధుని విగ్రహాలను ప్రతిష్టించినారు. ఇతర మతస్తులు, బౌద్ధమత స్వీకరించి ఆ మతవ్యాప్తిలో భాగంగా పలు ప్రాంతాలలో గౌతమబుద్ధుని విగ్రహాలను ప్రతిష్టించినారు. ఇతర మతస్తులు, బౌద్ధమత వ్యాప్తిని జీర్ణించుకోలేక బుద్ధుని విగ్రహాలను ధ్వంసంచేసిన సంఘటనలు చరిత్రలో కోకొల్లలు. రెండవ రకం విగ్రహాల విధ్వంసం పాలకులకు చెందినవి. హిట్లర్ నుండి సద్దాంహుస్సేన్ వరకు పెక్కు నియంతల విగ్రహాలు సంఘ సంస్కర్తలు, కవులు, రచయితలు, కళాకారులవి. మూడవ రకానికి చెందిన విగ్రహాల విధ్వంసం అనేది చాలా అరుదుగా జరిగే సంఘటనలుగా చెప్పవచ్చును. ఏ ఉద్యమములో కూడా వీళ్ల విగ్రహాలు ప్రజాగ్రహానికి టార్గెట్ కావు. కులాలలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా భావించబడే వీళ్లవిగ్రహాలే ట్యాంక్‌బండ్‌పై నేలమట్టమయ్యాయి.

## విధ్వంసం వెనుక తెలంగాణ మనోభావాలు

ట్యాంక్‌బండ్‌పై 33 విగ్రహాలు ఉంటే అందులో తెలంగాణ ప్రాంతానికి చెందిన మహానుభావుల విగ్రహాలు నామమాత్రమే. తెలంగాణ ప్రాంతానికి చెందిన మహానుభావుల విగ్రహాలు అతి స్వల్పంగా ఉండడంతో, కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రముఖుల విగ్రహాలే అక్కడ అధికంగా ఉండటంతో తెలంగాణ వాదుల్లో మొదటి నుంచి ద్వేషభావం అనేది చోటుచేసుకుంది. అందుకే తెలంగాణ వాదులు ఎప్పుడూ అంటూ ఉంటారు. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు మీవి – హుస్సేన్‌సాగర్‌లో శవాలు మావా? అని. ఏది ఏమైనా ఇక్కడి మనుషుల్లో ఉన్న భావోద్వేగాలకు నిదర్శనంగా అవి నేలమట్టమయ్యాయి. అవి నేలమట్టమయిన పిదప జరుగుతున్న రాజకీయాల దివాలా కోరుతనాన్నే మనం ఈనాడు సీరియస్‌గా పరిశీలించాల్సింది. ఏది ఏమైనా విగ్రహాల విధ్వంసం తప్పే. కానీ విగ్రహాల విధ్వంసం వెనుక ఉన్న తెలంగాణవాదుల మనోభావాలను కూడా ఒకసారి అర్థం తెలంగాణవాదుల మనోభావాలను కూడా ఒకసారి అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం కోస్తాంధ్ర ప్రాంతం వారిదే భాష. సంస్కృతి, చరిత్ర అయినట్లు తెలంగాణ వారిది కాదన్నట్లు మొదటి నుంచి కుట్రపూరితంగా సాంస్కృతిక పెత్తందారితనాన్ని అధిపత్య ధోరణిని కోస్తాంధ్ర పాలకవర్గాలు ఆచరిస్తున్నాయి. కోస్తాంధ్రకు చెందిన వివిధ రంగాలకు చెందిన నిష్ణాతుల విగ్రహాలను దానిలో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించింది. వారి భాషా సంస్కృతులు అయినట్లు ప్రచారం చేస్తూ తమ్ప్లాఆంతానికి తప్ప మిగతా ్లాఆంతాల వారికి భాషా సంస్కృతులే లేవన్నట్లు ప్రచారం చేస్తున్నారు. భాషా సంస్కృతుల పేరిట వారి సాంస్కృతిక ఆదిపత్యాన్ని చాటుకునే కుట్రలో భాగంగానే ఆ విగ్రహాలను ప్రతిష్టించింది. తెలంగాణ వాదులెవ్వరికి కూడా వ్యక్తిగతంగా ఆ మహానుభావులంటే అయిష్టతలేదు. అందరికి వారి రచనలన్నీ అభిమానమే. జాషువా అన్నా శ్రీశ్రీ అన్నా గురజాడ అప్పారావు అన్నా వారికి ఆపారమైన ప్రేమ. కానీ ఈ వ్యక్తుల విగ్రహాలను అడ్డుపెట్టుకొని కొనసాగిస్తున్న సాంస్కృతిక ఆదిపత్యధోరణిని వీళ్లు జీర్ణించుకోలేక పోతున్నారు. విధ్వంసం అయింది ప్రత్యక్షంగా వ్యక్తుల విగ్రహాలైన పరోక్షంగా మాత్రం సాంస్కృతిక ఆధిపత్యంపైనే దాడి జరిగిందన్నది నిర్వివా దాంశం, విగ్రహాల విధ్వంసం పిదప పండితులు, మేధావులు అనబడేవారు ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వాడిన భాష, ప్రాంతీయ విద్వేషాలను పెంచు తుందా లేక నివారిస్తుందో ఒకసారి సమైక్యవాదులు అలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర సమైక్యతను, సమగ్రతను కోరేవారు మిలియన్ మార్చ్‌లో పాల్గొన్న ప్రజలను దున్నపోతులతో, తాలబన్లతో పోల్చడం ఎంత వరకు సమంజ సమోఆలోచించాలి. విగ్రహాలు విధ్వంసం పిదప తెలంగాణ వాదులు వినిపిస్తున్న గొంతు ఏమిటో ఒకసారి ఆలోచించాల్సిన అవసరముంది. ట్యాంక్‌బండ్‌పై కొమరంభీం లాంటి వ్యక్తులకు ఎందుకు స్థానం కల్పించలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ చరిత్ర నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన వ్యక్తులను కావాలనే పక్కనబెట్టి కేవలం మీ ప్రాంతం వ్యక్తులకే పెద్ద పీఠ వెయ్యడం కుట్ర కాదా అని ప్రశ్నిస్తున్నారు. ప్రాంతం ఏదైనా మహా పురుషులను గౌరవించాలి.కేవలం కోస్తాంధ్ర ప్రాంతంలోనే అలాంటి వ్యక్తులు పుట్టినట్లు వారికి పెద్ద పీఠవేసి, తెలంగాణ ప్రాంతంలో అలాంటి వ్యక్తులే పుట్టలేదని భావితరాలకు చెప్పాలనే దురుద్దేశమేకదా వారికి ట్యాంక్‌బండ్‌పై స్థానం కల్గించ పోవడానికి ఉన్న ప్రధానకారణం. కేవలం కోస్తాంధ్రప్రాంతం వారిదే చరిత్ర, సంస్కృతిఅయినట్లు తెలంగాణవారిది కాదన్నట్లు మొదటి నుండి కుట్రపూరితంగా సాంస్కృతిక పెత్తందారీతనాన్ని అధిపత్య ధోరణిని కోస్తాంధ్ర పాలక వర్గాలు ఆచరిస్తున్నాయి. దీన్ని తెలంగాణవాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. వాళ్లలో పెరిగిన అసహనమే విగ్రహాల విధ్వంసానికి దారి తీసింది.

## తెలంగాణకి సముచిత స్థానం ఏది?

తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖుల విగ్రహాలను మరికొన్నింటిని అక్కడ ప్రతిష్టించి ఉంటే, ఈ విగ్రహాలు మా వాళ్లవి అని చెప్పుకునే మానసిక భావోద్వేగం తెలంగాణవారికి కలిగేది. ఈ విగ్రహాలు మా వాళ్లవి అని

చెప్పుకునే భావోద్వేగం వాళ్లకు కల్గటంలేదంటే దానికి కారణం తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖులకు అక్కడ సముచిత ప్రాతినిధ్యం కల్పించక పోవడమే అన్న నగ్నసత్యాన్ని గుర్తించాల్సిన అవసరముంది.

ఇక ట్యాంక్‌బండ్‌పై జరిగిన రెండవ సంఘటన రాజకీయ నేతలపై జరిగిన భౌతిక దాడులు. ఈ దాడుల నుండి నేర్చుకోవాల్సిన గుణపాఠలు కూడా చాలా ఉన్నాయి. ఈ భౌతిక దాడులు మొన్ననే ప్రారంభమైనవికావు. అంతకుముందు నాగం,అనిల్, జెపిలపై జరిగినాయి. మొన్న కేశవరావు,మధుయాష్కిలపై జరిగినాయి. ఇవేవి కూడా ఒక పద్ధతి ప్రకారం ప్రణాళిక బద్ధంగా జరిగిన దాడులు మాత్రం కావు. తెలంగాణ ఉద్యమకారులు ఎప్పుడు కూడా సమైక్యాంధ్రప్రదేశ్‌కే తాము కట్టుబడి ఉన్నామని, అదే తమపార్టీ వైఖరి అని ప్రకటిస్తున్న ఎంఐఎం, పార్టీ జోలికిగాని, లేదా సిపిఎం పార్టీ జోలికి కాని ఎవ్వరు పోవడం లేదు. తెలంగాణ విషయంలో స్పష్టమైన వైఖరితో ఉన్న ఏ రాజకీయ పార్టీ జోలికి వీళ్లు పోకుండా కేవలం అవకాశవాద వైఖరీని అవలంభిస్తున్న పార్టీల నాయకులనే వాళ్లు టార్గెట్ చేస్తుంది. తెలంగాణ విషయంలో ఏమి మాట్లాడకుండా ఉండే నాయకుల జోలికి కూడా వాళ్లు పోవడంలేదు. కేవలం ప్రజలను కన్‌ఫ్యూజ్ చేసే మాటలతో ముంచెత్తుతున్న నాయకులే టార్గెట్ అవుతున్నారు. ఎన్నికల ముందు తాము సహితం తెలంగాణకు అనుకూలమని, సామాజిక తెలంగాణే తమ ధ్యేయమని, ప్రకటించి ఎన్నికలు అయిపోయిన పిదప సమైక్యాన్ని వినిపిస్తున్న పార్టీ నాయకులనే ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నది. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు తాము తెలంగాణకు కట్టుబడి ఉన్నామని, తెలంగాణ బిల్లుపెడితే మద్దతు తెలుపుతామని ప్రకటించి, చిదంబరం తెలంగాణపై ప్రకటన చేసిన మరుక్షణమే రెండుకళ్ళ వాదాన్ని తెరపైకి తెచ్చి రెండు నాల్కల విధానాన్ని అనుసరించడాన్ని తెలంగాణ వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. అదేవిధంగా తమ ద్వారానే తెలంగాణ వస్తుందని, తెచ్చేది ఇచ్చేది తామేనని అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతూ మోసగిస్తువస్తున్న పార్టీల వైఖరినే ఉద్యమకారులు ఎండగడుతున్నారు. పరోక్షంగా ఉద్యమకారులు ఎండగడుతున్నారు. పరోక్షంగా ఉద్యమకారులు ఎండగడుతుంది రాజకీయ పార్టీల వైఖరులను మాత్రమే గాని వ్యక్తులను మాత్రం కాదు అన్నది నగ్నసత్యం.

## తెలంగాణ పట్ల నిబద్ధత లేదా?

నాగం, అనిల్, కేశవరావు, మధుయాష్కిలపై జరిగిన దాడులు మనకు 'ఏం బోధిస్తున్నాయే ఒక్కసారి విశ్వేషించు కోవాల్సిన అవసరముంది. ఉద్యమకారులు ఒక ప్రణాళిక ప్రకారం వాళ్లను టార్గెట్ చేసి దాడులకు దిగలేదు. ఉద్యమకారులు ఏవో కొన్ని నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు వాళ్లకు మద్దతు తెలిపేందుకు వాళ్ల దగ్గరికి వెళ్లినప్పుడే నాయకులపై దాడులు జరిగింది. ఉద్యమకారులు నాయకుల వద్దకు పోలేదు. నాయకులే ఉద్యమకారుల దగ్గరికి వెళ్లి దాడులకు గురయ్యారు. అంటే అక్కడికి వెళ్ళకుంటే దాడులు జరిగేవి కాదన్నమాట. మద్దతు తెలిపేందుకు వచ్చిన వారిపై దాడులు జరుగుతున్నాయంటే దానికి ప్రధాన కారణం ఈ నాయకులకు తెలంగాణ పట్ల ఉన్న నిబద్ధతను ఉద్యమకారులు శంకిస్తున్నారన్న విషయాన్ని గమనించాలి.

ఏది ఏమైనా విగ్రహాల విధ్వంసం నాయకులపై, మీడియాపై జరిగిన దాడులు అవాంఛనీయం, వాటిని ఎవ్వరు ప్రోత్సహించరు. అనుమతించరు. ఏ రాజకీయపార్టీవాళ్లయినా, ఉద్యమసంస్థలయినా వాటిని ప్రోత్సహించలేదు. అవన్నీ యాదృచ్ఛికంగా జరిగిన సంఘటనలే. ట్యాంక్‌బండ్‌పైకి వచ్చిన తెలంగాణ వాదులు ఎవ్వరు కూడా ఏ నాయకుడి ఆదేశాలు వినే స్థితిలో లేరు. నాయకులకు వారిపై నియంత్రణ లేదన్నది స్పష్టం. గత కొంగకాలంగా తమపై కొనసాగుతున్న సాంస్కృతిక ఆధిపత్య ధోరణిని వాళ్లు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ పట్ల రాజకీయ పార్టీలు అవలంభిస్తున్న అవకాశవాద విధానాలను వాళ్లు ఎండకడుతున్నారు. అందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి అన్నది నగ్నసత్యం.

***– ప్రొ॥ లక్ష్మణ్,*** *రచయిత తెలంగాణ ఫోరం కన్వీనర్*

వార్త, మార్చి23, 2011

# మిలియన్ మార్చ్ : ముబారకిజం

**– టంకశాల అశోక్**

ఈ నెల 10వ తేదీన జరప తలపెట్టిన 'మిలియన్ మార్చ్' కార్యక్రమంలో తెలంగాణ జాక్ నాయకులు మార్పులు చేయటం ఆహ్వానించదగ్గది. వారు మొదట ప్రకటించిన కార్యక్రమంతో పోల్చితే ఇది రాజీయే గాని, అది పిల్లల కోసం పడిన రాజీ, అంతే తప్ప దానిని తమ లక్ష్యంతోనో, ఉద్యమ దీక్షతోనో రాజీ పడటమని ఎవరూ అనలేరు. అయితే వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనల ప్రకారం కార్యక్రమాన్ని వాయిదా వేయటమా, లేక ఉద్యమకారులు నిరుత్సాహపడగలరు గనుక యథాతథంగా సాగించటమా అన్న ద్వైదీభావం జాక్‌ను కొంత వేధించింది. చివరకు ఉభయతారకమైన పరిష్కారాన్ని వారు కనుగొనగలిగారు. ఈ మార్పు విద్యార్థులకు, వారి తండ్రులకు వారం రోజులుగా ఏర్పడిన ఉత్కంఠను పోగొట్టి ఉంటుంది. మిలియన్ మార్చ్ ఆలోచనలకు ప్రేరణ కైరోలోని తెహరీర్ చౌకును ఆందోలనకారులు రోజుల తరబడి రాత్రింబవళ్ళు దిగ్బంధం చేయటమన్నది తెలిసిందే. ఆ ఉదంతం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక ఉద్యమకారులకు వలెనే తెలంగాణ వాదులకు కూడా స్ఫూర్తినిచ్చింది. అదే పద్ధతిలో హైదరాబాద్ నగర ప్రధాన కూడళ్ళను రోజుల తరబడి రాత్రింబళ్ళు అష్టదిగ్బంధనం చేయడం మొదలుకొని, ఒక రోజు కార్యక్రమానికి పరిమితం చేయటం వరకు రకరకాల ఆలోచనలు జరిగాయి. చివరకు ఒక రోజు అన్న నిర్ణయం జరిగింది. అందుకు తెలంగాణ అంటి నుంచి, వివిధ పార్టీలూ సంస్థల నుంచి వచ్చిన స్పందనలను, రేకెత్తిన ఉత్సాహాన్ని గమనించినపుడు, ఆ కార్యక్రమం దిగ్విజయం కాగలదన్న అభిప్రాయం కలిగింది. ఈ కార్యక్రమ తేదీని నిర్ణయించినపుడు పరీక్షల మాట నాయకుల దృష్టికి వచ్చిందో లేదో తెలియదు గానీ, వచ్చి ఉండి కూడా ఆ పద్ధతిలో కార్యక్రమాన్ని నిర్ణయించి ఉంటే అది పొరపాటనాలి. ఎందుకంటే, తక్కిన ఇబ్బందులకు, విద్యార్థులకు కలిగే పరీక్షల భయాలకు తేడా ఉంది. కార్యక్రమం జరిపి తీరుతామంటే పరీక్షను ప్రభుత్వం వాయిదా వేయగలదని ఉద్యమ నేతలు భావించి ఉండవచ్చు. కానీ అటువంటివి ఉభయుల మధ్య ఒక రోజులో తేలిపోతే సమస్య ఉండదు గాని, రోజుల తరబడి పోటా పోటీ పట్టుదలల వల్ల అనిశ్చితి ఏర్పడి పిల్లలకు భయాన్ని కలిగిస్తుంది. వారి తల్లిదండ్రులకు, టీచర్లకూ అదే స్థితిని సృష్టిస్తుంది. ఇందుకు అవకాశమివ్వటం ఏ ఉద్యమానికి కూడా సరైనది కాదు. పైగా ఈ పిల్లలలో అత్యధికులు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మద్ధతుదారులు, కార్యక్రమాలలో పాల్గొంటున్నవారు. వారికి భయాలు, నష్టం కలిగించరాదనేందుకు ఇది అదనపు కారణం. మిలియన్ మార్చ్ కార్యక్రమం 10వ తారీఖునాడే జరిగి తీరవలసిందేమీ కాదు. ఆ తేదీకి ప్రత్యేకత, పవిత్రత అనదగ్గవేమీ లేవు. అందువల్ల 10కి బదులు మరొక రోజున చేసినా ఉద్యమ ప్రతిష్ఠకు భంగం కలిగేది ఎంత మాత్రం ఉండదు. ఒకవేళ వాయిదా వేయదలిస్తే అందుకు గల కారణం ఏమిటన్నది అందరికీ కనిపిస్తున్నదే అయినపుడు, వాయిదా వల్ల ప్రతిష్ఠా భంగం కలగవచ్చుననే అనుమానం అపోహ మాత్రమే. చివరకు వాయిదాగాని, యథాతథం గాని కాకుండా మధ్యే మార్గం కనుగొన్నారు.

మిలియన్ మార్చ్‌ను శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోగలమని జాక్ ప్రకటించిన దృష్ట్యా, ఆ కార్యక్రమాన్ని సాఫీగా జరగనివ్వవలసిన బాధ్యత పోలీసు అధికారులపై కూడా ఉంటుంది.

అనుమతిలేదనే పేరుతోనో, మరేదో నెపంతోనో, లేక అసలేమీ చెప్పకుండానే కార్యక్రమాన్ని భంగపరిచి తీరేందుకు కంకణం కట్టుకోవటం సరైన వైఖరి కాబోదు. రాజధానిలో, జిల్లాలలో ముందుగానే అరెస్టులు, బయటి నుంచి వచ్చే రోడ్ల వెంట చెక్‌పోస్టులు, తదితర చర్యలు ఒక శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని, కార్యక్రమాన్ని ఉద్దేశ పూర్వకంగా అణచివేయ చూడటమే అవుతుంది. శాంతి భద్రతల నిబంధనలు అవసరమే, కాని పోలీసులకు విచక్షణా దృష్టి కూడా అవసరం. ఆ దృష్టి వారికి సాధారణంగా ఉండేదే. కాని వద్దనుకున్నప్పుడు మరచి పోగలరు కూడా. సాధారణ పరిస్థితులకు, ఉద్యమ పరిస్థితులకు తేడా ఉంటుందన్నది తమకు తెలుసు. ఆ మాటను విస్మరించి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, శాంతియుత ఉద్యమానికి కూడా సమస్యలు సృష్టించి ఛిన్నాభిన్నం చేయాలన్నది వారి పద్ధతి అయితే, అది ఒక ప్రాంత ప్రజల పట్ల వివక్షా పూరితంగా వ్యవహరించటమే అవుతుంది. కార్యక్రమం వల్ల శాంతిభద్రతలకు భంగం కలగరాదని వారు స్పష్టీకరించటం వరకు సమంజసమవుతుందిగాని, శాంతియుత ప్రజాస్వామిక ఆందోళనా కార్యక్రమాలను సైతం సహించబోమంటే అది 'ముబారకిజం' అవుతుంది. వుద్యమం అణచివేత తమ ఉద్దేశం కాదని, శాంతియుత కార్యక్రమాలకు భంగం కలిగించబోమని తాము లోగడ చేసిన ప్రకటనను వారు గుర్తించుకోగలరని ఆశించాలి.

**– టంకశాల అశోక్**

08.03.2011, వార్త ఎడిట్ పేజీ

మీరు చావకండి ... ఒకవేళ చావాలనుకుంటే మాత్రం ...
తెలంగాణ వ్యతిరేకులైన సీమాంధ్ర
పెట్టుబడిదారులను చంపి చావండి ... భగత్‌సింగ్‌లా చరిత్రలో నిలిచిపోతారు ...

**– పొన్నం ప్రభాకర్, ఎం.పీ.**

అసలు రాసేటోడు తెలుగోడై
చదివేటోడుగూడా తెలుగోడైతే
సహృదయత వుంటే
తెలుగు అర్థమయితది.
నాకు అర్థం కాలేదంటే ...
నీవు తెలుగోడివి కాదన్నమాట ...
లేకపోతే సహృదయత లేదన్నమాట.

**– కాళోజీ**

కోటిన్నర మేటి ప్రజల
గొంతొక్కటి , గొడవొక్కటి
తెలంగాణ వెలసి నిలిచి
ఫలించాలె భారతాన
భారత్ మాతాకీ జై
తెలంగాణ జిందాబాద్

**– కాళోజీ**

# అధిష్ఠానం కళ్లు తెరవాలి

**– టంకశాల అశోక్**

పోలీసుల అన్ని నిర్బంధాలను ధిక్కరించిన తెలంగాణ ఉద్యమకారులు తమ 'మిలియన్ మార్చ్' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పోలీసులు తెలంగాణ అంతటా సాగిస్తున్న అరెస్టులు, బైండోవర్లు, చెక్‌పోస్టులు, తనిఖీలనూ, గురువారం ఉదయం ఆరు నుంచే నగరమంతటా చేసిన దిగ్బంధాన్ని గమనించినపుడు, ట్యాంక్‌బండ్ వంటి ఇరుకైన వేదిక పైకి ఆందోళనకారులు నిజంగా చేరగలరా అనే సందేహాలు కలిగాయి. కాని అనూహ్యమైన రీతిలో ఒంటిగంటయ్యే సరికి ప్రత్యేక రాష్ట్ర వాదులు ఆ ప్రాంతానికి దూసుకురావటం మొదలై, చూస్తుండగానే ట్యాంక్‌బండ్ అంతా వారితో నిండిపోయింది. ఆ విధంగా ఉద్యమకారులు తమ సంకల్ప బలాన్ని మరొకమారు తిరుగులేని విధంగా రుజువు చేశారు. ఇంకా చెప్పాలంటే ఈసారి కార్యక్రమంలో కొత్త ఉధృతీ కొట్టవచ్చినట్లు కన్పించింది. ఆ ఉధృతిలో తెలుగు ప్రముఖులు కొందరి విగ్రహాలపై దాడి చేయటమనే అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నాయి. మీడియాపై దాడి కూడా అటువంటి ఖండనీయమైన ధోరణే.

మొత్తం పరిణామాలను సమీక్షించినపుడు ఇందులో పోలీసుల ఆలోచన ఏమిటన్నది బోధపడకుండా ఉంది. మార్చ్‌ను రకరకాల సాకులు చెప్పి అణచివేయ చూడటం గాక, చెప్పవలసిన జాగ్రత్తలు చెప్పి సాధారణ బందోబస్తు ఏర్పాట్లతో వదిలివేసినట్లయితే ఏమయ్యేది? తెలంగాణ జాక్ చెప్పిన రెండు మూడు రూట్లతో పాటు ట్యాంక్‌బండ్‌పై మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు సమస్య ఏర్పడేది. సమస్య అంతటికి పరిమితమయ్యేది. కాని పోలీసులు చేస్తూ వచ్చిన అతివల్ల ఉద్రిక్తతలు, భయాలు, ఆగ్రహాల వాతావరణం ఏర్పడుతూ వచ్చింది. ఇదే అర్థంలేని వ్యూహాన్ని గురువారం నాడు కొనసాగించారు. జాక్ నాయకత్వం తమ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 1 నుంచి 4 మధ్యకు కుదించుకొన్నప్పటికీ, ఆ నిర్ణయంలోని స్ఫూర్తిని, హేతుబద్ధతను గుర్తించని పోలీసులు ఉదయం 6 నుంచే అస్తవ్యస్త పరిస్థితులు సృష్టించారు. నగరమంతటా బారికేడ్లు, అరెస్టుల వల్ల జరిగిందేమిటి? కార్యక్రమం రెండు మూడు రూట్లకు, ట్యాంక్‌బండ్‌కు పరిమితం కావలసి వుండగా పోలీసులు ప్రతి రూటును గందరగోళంగా మార్చివేశారు. కార్యక్రమం పగలు ఒంటిగంట  నుంచి కాగా, పోలీసుల కార్యక్రమం అంతకు ఆరేడు గంటల ముందు నుంచే మొదలైంది. జాక్ తన కార్యక్రమ వేళలను మార్చుకోవటం ఇంటర్ పరీక్షలను దృష్టిలో వుంచుకుని కాగా, సరిగా అదే విద్యార్థులకు పోలీసులు సమస్యలు సృష్టించారు. జాక్ కొత్త నిర్ణయంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, విద్యాశాఖాధికారులకు కలిగిన సంతోషాన్ని మట్టిపాలు చేశారు. చివరకు ఒంటిగంట నుంచి మొదలుకొని ట్యాంకుబండ్ నిండనే నిండింది. తాము తీసుకున్న జాగ్రత్తల వల్లనే నాలుగు ఐదు వేలకు మించి రాలేదని పోలీసు కమీషనర్ ఎ.కె. ఖాన్ తనను తాను మెచ్చుకున్నారు. కానీ, పోలీసుల గత రెండు రోజుల తీరువల్ల చెడిపోయిన వాతావరణంలో, ఆ నాలుగయిదు వేలమందిలోనూ కొందరు ఆగ్రహంతో కొన్ని అవాంఛనీయ చర్యలకు పాల్పడ్డారు. అట్లాగాక అంతా ప్రశాంతంగా జరిగే వీలు కల్పించి ఉంటే నలభై యాభైవేల మంది వచ్చినా ఏమీ జరగకపోయేదేమో. కార్యక్రమంలో మరిన్ని మార్పులకు జాక్ సుముఖత చూపినా, అనుమతికి ససేమిరా అనటాన్ని ఎట్లా అర్థం చేసుకోవలి?

పోలీసులది ఇదే వైఫల్యం. అరెస్టుల విషయంలోనూ కన్పిస్తుంది. ఉదాహరణకు జాక్ అధ్యక్షుడు కోదండరామ్‌ను, పార్టీల నేతలను అరెస్టు చేయవలసిన అవసరమేమిటి? ఇటువంటి ఉద్యమ కార్యక్రమాలు జరిగినపుడు బాధ్యతగా వ్యవహరించి కార్యక్రమాలను చక్కబెట్టే నాయకులు అక్కడ ఉన్నట్లయితే ఒకవేళ ఉద్రిక్తత్తలు తలెత్తినా పరిస్థితి చేయిదాటకుండా సవరించగలరు. మరి అటువంటి వారిని నిర్బంధిస్తే, ఉద్రిక్తతలను దారిన పెట్టగల వారెవరు? పోలీసులు ఎవరితో మాట్లాడుతారు? ఉద్యమకారుల సమూమంతోనా? మాట్లాడేది లాఠలు, బాష్పవాయువు, తుపాకుల భాషలోనా?

పోలీసులు మొదటి నుంచి వివేకంగా వ్యవహరించి ఉంటే ట్యాంక్‌బండ్‌పై నాయకత్వ శూన్యం ఏర్పడేది కాదు. కె.కె., యాష్కీలపై దాడి, విగ్రహాలపై, మీడియాపై దాడి, పోలీసు వాహనం దహనం వంటి ఘటనలు చోటు చేసుకునేవి కావు. కనుక దీనికంతటికీ పోలీసులు తమను తామే నిందించుకోవాలి. అదే సమయంలో, ఇన్నేళ్ళపాటు ఉద్యమాన్ని శాంతియుతంగా నడిపిన తెలంగాణ యువత ఇక ముందూ అదే సంయమనం చూపటం తమకే మేలు చేస్తుందని గ్రహించాలి.

'మిలియన్ మార్చ్' కార్యక్రమం ఇన్ని నిర్బంధాల మధ్య ఇంతగా విజయవంతం కావటం కేంద్ర పెద్దలకు, తెలంగాణ కాంగ్రెస్ నేతలకూ కనువిప్పు కావాలి. వారు ఇప్పటికైనా తాత్సారాలు మానకపోతే తమ బాధ్యతా రాహిత్యాన్ని చరిత్ర క్షమించదు.

**– *టంకశాల అశోక్***

11.03.2011, వార్త ఎడిటోరియల్

ఆత్మాహుతి దాడులు చేస్తామన్నంత దూరం ఆయనెందుకు

వెళ్లాల్సి వచ్చింది ...

సామాజిక స్పృహను ...

సంయమనాన్ని ..

ఎందుకు కోల్పోవాల్సి వచ్చింది?

ఇలాంటి మాటలను వీరే స్వయంగా మాట్లాడుతున్నారా?

ఈ చిలుక పలుకులకు ఎవరైనా ప్రాంప్టింగ్ ఇస్తున్నారా ...?

**– *గద్దర్,*** *తెలంగాణ ప్రజా ఫ్రంట్ చైర్మన్*

# ఇంకా రెచ్చగొట్టడమే ...

**– టంకశాల అశోక్**

టీఆర్ఎస్ తెలంగాణ ఐకాస నాయకులపై, ఇతరులపై పోలీసులు హత్యాయత్నం కేసు (ఐ.పి.సి. సెక్షన్ 307) మోపటం తెలంగాణ ప్రజలను మరింత రెచ్చగొట్టేందుకు తప్ప ఎందుకూ ఉపయోగపడదు. మిలియన్ మార్చ్ ఘటనల దరిమిలా తమపై వచ్చిన విమర్శల నుంచి ఆత్మరక్షణ చేసుకోవాలన్న పోలీసుల ఆతురుత అర్థం చేసుకోదగినదే గాని, ఈ తరహా తీవ్రమైన కేసులు పెట్టటం అందుకు తగిన మార్గం కాబోదు. తమ ఉద్యమ నాయకులపై కేవలం కక్షపూరితంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారనే భావన ప్రజలకు ఏర్పడితే అటువంటి మానసికతవల్ల కలిగే ప్రభావాలు తీవ్రంగా వుంటాయి. పోలీసు ఉన్నతాధికారులలో తగిన వివేకం, వివేచనగలవారు తప్పక ఉన్నారు. వారు ఈ విషయమై పునరాలోచన చేయటం మంచింది. ఈ మాట ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డిని, హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని కూడా ఉద్దేశించి అంటున్నటువంటిది.

పదవ తేదీ నాటి ఘటనలపై విచారణ తప్పక జరగాలి. కాని ఆ ప్రయత్నంలో 'అతి'కి అవకాశమివ్వకూడదు. నాయకులు, సాధారణ ఉద్యమకారులు ఎవరైనా సరే కక్ష సాధింపులకు గురవుతున్నారనే భావన ప్రజలకు కలిగినట్లయితే, ఇప్పటికే సున్నితంగా ఉన్న పరిస్థితి మరింత సున్నితంగా మారుతుంది. ఇంతకు ముందు కూడా ఉస్మానియా విద్యార్థులపై హత్యాయత్నం కేసులు మోపారు. వాటిని రుజువు చేసేందుకు ఈ ఏడాది కాలంలో ఏమి రుజువులు సంపాదించారో తెలియదుకాని, అటువంటి కేసులూ – వేధింపుల ప్రభావం విద్యార్థి లోకంపై ఎంతగా ఉందో వారు తెలుసుకునేందుకు ప్రయత్నించారా? చేతిలో అధికారం ఉందిగదానని నిర్విచక్షణగా ఉపయోగించబూనితే అందువల్ల కలిగే పాజిటివ్ ఫలితాలు ఏమీ వుండవుగాని, అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నారనే అపఖ్యాతి మాత్రం తప్పదు. అంతేకాదు. ఈ పని ఉద్యమ వ్యతిరేకులకు ఉపయోగపడటం కోసం చేస్తున్నారనే అపోహలు కలిగే ప్రమాదం ఉంది. నిజం చెప్పాలంటే, ఉస్మానియా దశను అట్లుంచితే ఇటీవలి మాసాలలో పోలీసులు చాలా వరకు సంయమన పూరితంగా వ్యవహరిస్తున్నారు. ఈ పదవ తేదీన కూడా అదే కన్పించింది. అందుకు పరిశీలకులే గాక, జనాంతికంగా ఉద్యమ నేతలు సైతం వారిని ప్రశంసించటం వింటున్నాము. ఇటువంటి నేపథ్యానికి విరుద్ధమైన రీతిలో వారిపుడు ఏకంగా హత్యాయత్నం కేసులు మోపటం వారిపై గల వత్తిడిని సూచిస్తుంది తప్ప, సహేతుకమైన ఆలోచనను కాదు. అందువల్ల దీనిపై సమీక్ష జరిపి ఈ సెక్షన్లను అందరిపైనా ఉపసంహరించాలి.

విగ్రహాల విధ్వంసం తప్పకుండా తీవ్రమైన విషయమే. దానిపై ఉద్యమకారులకు తమ వాదనలు తమకున్నా, శాంతిభద్రతలను కాపాడవలసిన సంస్థలు తమ పని తాము చేయవలసిందే. అయితే, అందుకు సంబంధించిన దర్యాప్తులు వృత్తిపరమైన నిజాయితీతో నిష్పాక్షికంగా జరగాలిగాని ఇతరేతర పరిగణనలతో కాదు. మన పోలీసు అధికారులు శిక్షణా సమయంలో ఇటువంటి పాఠాలు ఎన్నెన్ని నేర్చుకున్నా, విధులలో చేరిన తర్వాత విశ్వస నీయత కోల్పోవటానికి, పోలీసు శాఖ అప్రతిష్టపాలు కావటానికి కారణం ఆ పాఠాలు మరిచిపోవటమే. ప్రతి కీలకమైన విధి బాధ్యత చేపట్టే ప్రతి కొత్త అధికారీ, ప్రజల విశ్వాసం చూరగొంటామనే ప్రకటన చేయటం, ఆ పనిలో విఫలం కావటం ఒక ఆనవాయితీ అయిపోయింది. ఉద్యమకారులపై, విద్యార్థులపై హత్యాయత్నం వంటి

ఆరోపణలు చేయటం తమపట్ల విశ్వాసాన్ని, గౌరవాన్ని పెంచుతుందో లేక మరింత తగ్గిస్తుందో వారు ఆలోచించుకోవాలి. చేతిలోని ఆయుధాన్ని నిర్వచక్షణగా వాడాలనే టెంప్టేషన్ నేరస్తులకు ఉంటే అసహజత కాదు గాని, అది పోలీసు అధికారుల కుండటం వికృతిగా మారుతుంది.

తెలంగాణ ఉద్యమం 1969-70 దశకు భిన్నంగా ఇపుడు శాంతియుతంగా జరుగుతున్నది. అది కూడా పదేళ్ళుగా, చెదురుమదురుగా తప్ప. ఆ చెదురుమదురులోనూ కొన్నింటికి కారణం పోలీసులు రెచ్చగొట్టడమే. రాజకీయ నాయకత్వాలు, ప్రభుత్వాలు ఇంతింత కాపట్యాన్ని చూపటం వల్ల తీవ్రమైన నిస్పృహలకు గురవుతూ కూడా ఆవేశాలను అణచుకుంటూ పదేళ్ళుగా సంయమనంతో ఉద్యమం సాగిస్తున్న వారు నిజానికి ప్రశంసార్హులు. ఈ స్థితితో పోల్చదగ్గ ఉద్యమాలు ఇంత సుదీర్ఘకాలం నిర్విరామంగా దేశంలో మరెక్కడైనా సాగాయో, సాగుతున్నాయో ప్రభుత్వ నేతలు, పోలీసు అధికారులు చూపగలరా? కనుక, పదవ తేదీ ఘటనలపై తప్పక విచారణ చేయండి. చర్యలు తీసుకోండి. కాని ఆ పని కక్షపూరితమైన పద్ధతులలో చేస్తున్నారనే భావన ప్రజలకు కలగనివ్వకపోవటం తక్కిన విషయాలను అట్లుంచి పోలీసుల విశ్వసనీయత దృష్ట్యా కూడా అవసరం.

**- టంకశాల అశోక్**

14.03.2011, వార్త, ఎడిటోరియల్

ఇక్కడ కొన్ని చారిత్రక వాస్తవాలు మర్చిపోకూడదు...
నిజాం దర్బారులో కొంత కాలంఓ కొలువ చేసిన శ్రీశ్రీకి ఇచ్చిన గౌరవం ...
నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామికివ్వలేదు.
ఇది మన చారిత్రక నేపథ్యాన్ని తుడిచివేసే ప్రయత్నమే. అలాగే విద్యావేత్త, ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీగా పని చేసిన కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహం పెట్టారు కానీ ...
అంతకన్నా గొప్ప పేరున్న ఉస్మానియా యూనివర్శిటీకి వీసీగా చేసిన నవాబ్ అలీ యవర్‌జంగ్ విగ్రహం ఎందుకు పెట్టలేదు? నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వాళ్లలో ముస్లింలు కూడా ఉన్నారు కదా ... జర్నలిస్టు షోయబుల్లాఖాన్‌ను విస్మరించారు. ఇక పార్కులకు, రోడ్లకు అన్నింటికీ ఆంధ్రప్రాంతం వారి పేర్లు పెట్టారు కానీ ఒక్క తెలంగాణ ప్రముఖుడి పేరైనా పెట్టారా? వాళ్లకన్నా గొప్పవాళ్లు అనేక మంది ఇక్కడ వున్నారు.
అయినా తెలంగాణ వైతాళికులను కావాలని పక్కన పెట్టారు.
ఈ సాంస్కృతిక దాడిలో కుట్ర ఏంటంటే ...
తెలంగాణ వైతాళికులను మరుగున పడేయటం ...

**- ప్రొ॥ జయశంకర్**

# విగ్రహ విధ్వంసంపై నిగ్రహంతో విచారిద్దాం

– కె. శ్రీనివాస్

ఎండాకాలం ఇంకా పూర్తిగా దిగబడకపోయినా, రోహిణీకార్తె రోజు వంటి ఆ మధ్నాహ్నాన్ని దాటి ఆ నాటికి ఉద్యమమూ ఉద్రిక్తతా ఉపశమించిన తరువాత, నగరం నెమ్మదిగా నిద్రలోకి జారుకుంటున్నప్పుడు అర్ధరాత్రి వేళ అందరిలాగానే నేనూ టాంక్‌బండ్ మీదుగా మార్చ్‌పాస్ట్ చేశాను.

కూలిన కొలువుకూటం, శిథిల పేరోలగం, క్షతగాత్ర నరస్తీరం.

గుర్తు తెలియని ఆగ్రహాలు, వాలిన, కూలిన, తెగిపోయిన విగ్రహాలు.

ఏ కాలపు వీరులు వీరు, ఏ యుగాల కవులు వీరు, ఎప్పటి వైతాళికులు వీరు? ఇప్పటి యుద్ధంలో ఎందుకు గాయపడ్డారు?

సన్నటి దుఃఖం, ఏదో అసౌకర్యం, ఒక చేదు. ఈ దృశ్యం అదృశ్యమైతే బాగుండును. ఈ సన్నివేశం ఒక భ్రమ అయితే బాగుండును. ఇదంతా జరగకుండా ఉండి ఉంటే బాగుండును.

విగ్రహాలలో నిక్షిప్తమైపోయినవి పురాస్మృతులు మాత్రమే కావు. వర్తమానంలో కూడా అవి అప్పుడప్పుడు వెలుగుతూ వచ్చినవే. ప్రతి ప్రతిమా ఎవరికో ఒకరికి సంకేత స్థలమే. ఎవరో ఒకరు పూలమాల వేసి పులకించిపోయినదే. ఆ బొమ్మకొలువులో అన్నీ కాకున్నా కొన్ని ఊరేగింపులకు ఆరంభ కేంద్రమైనవే. ఉపన్యాసాలకు వేదికలయినవే.

నడుస్తున్న చరిత్ర సృష్టిస్తున్న అనేకానేక సందిగ్ధ సందర్భాలలో ఇదీ ఒకటి.

ఒకే వాస్తవంలో ఇమడలేని అనేక సత్యాల, ఒకే వ్యక్తిత్వంలో ఒదగలేని అనేక అస్తిత్వాల ఘర్షణ ఇది. నా ఉద్వేగం నా వ్యక్తిగతమైనదిగా కనిపించవచ్చు. కానీ, నేననుభవించిన సంశయ వుద్వేగాన్నే అనుభవిస్తున్నవారు అనేకులు ఉంటారని నాకు తెలుసు. దీర్ఘకాలంగా ఉద్యమాల వేదికగా ఉన్న తెలంగాణలో ప్రగతివాదాన్ని, సామాజిక న్యాయాన్ని బోధించిన రచయితలను ప్రాంతాలకు అతీతంగా ఆదరించారు, అనుసరించారు. అటువంటి అనుయాయులు, అభిమానులు ఒక్క తెలంగాణలోనే కాదు, రాయలసీమలో, ఉత్తరాంధ్రలో, కోస్తాంధ్రలో అన్నిచోట్లా ఉంటారు. మన వివేకానికీ, చైతన్యానికీ, విచక్షణకీ దోహదాన్ని అందించిన అనేక పోషకాల్లో ఆ ప్రతిమా వ్యక్తుల రాతలూ చేతలూ ఉన్నాయని అన్ని ప్రాంతాలలో ఉన్న 'మాకు' తెలుసు. కానీ, సమాజంలో మాలాంటి వారే కాదు, ఇతరులూ ఉంటారు, ఉన్నారు. వారికి ఈ సందర్భం రాజకీయ ప్రయోజనాలకు అనువైన సందర్భం. జాషువా, గురజాడ, శ్రీశ్రీ, త్రిపురనేని రామస్వామి చౌదరి, వీరేశలింగం ఇంకా ఇంకా కూలిన విగ్రహ పురుషులందరూ ఏమి చెప్పారో ఏ విలువలకు నిలబడ్డారో వారికి అక్కరలేదు. ఆ విగ్రహాలకు హాని జరిగేదాకా వారెప్పుడైనా టాంక్‌బండ్‌మీద విగ్రహాలను దర్శించారో లేదో కూడా నమ్మకం లేదు. చారిత్రక వ్యక్తులకు అసందర్భంగా జరిగిన అమర్యాద గురించి వారి దగ్గర కన్నీటి చుక్కలేమీ లేవు. అవకాశం దొరికింది కాబట్టి అస్త్రాన్ని ఉపయోగించుకోవడం మాత్రమే వారికి తెలిసింది. వారి గగ్గోలుకన్నా, మా వంటి వారి వేదన ఎక్కువ విలువైనదీ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కానివ్వకుండా నిరోధించగలిగిందీ కూడా.

నాలాంటి వారికి ట్యాంక్‌బండ్ మీద జరిగిన దానికి బాధ కలుగుతోంది కానీ, చేసిన వారి మీద ఆగ్రహం రావడం లేదు. ఒక పరంపరలో జరుగుతున్న అంశాలను విడదీసి తీర్పులు నిర్ధారణలు చేయలేము కదా? ఈ ఒక్క అపశ్రుతిని అడ్డం పెట్టుకుని ఒక ప్రజా ఉద్యమాన్ని నిరాకరించడమో, ఒక ప్రజా సమూహాన్ని నిందించడమో చేయలేము కదా? కోపం రావలసింది పరిస్థితులను ఇంతగా దిగజార్చిన పాలకులపైనా ప్రభుత్వాలపైనా ఏ స్పందనా లేక చేష్టలు లేని విగ్రహనాయకుల వలె మారిపోయిన ఏలికలను కదిలించలేక, తమను తాము దగ్ధం చేసుకున్నా, మంచికే ప్రతీకలుగా ఉన్నవారి చిహ్నాలను అవగాహనా రాహిత్యంతో ధ్వంసం చేసినా, ప్రజలే మరింతగా బాధితులవుతున్నారు తప్ప, పరిస్థితి మరింత జఠిలం అవుతున్నది తప్ప, ఫలితం ఉడడం లేదు.

ఆత్మాహుతులకు స్పందించని నేతలు విగ్రహాల ధ్వంసానికి గగ్గోలు పెట్టడమేమిటని తెలంగాణ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉత్పన్నమయిన పరిస్థితి నుంచి అటువంటి వాదనలు పుట్టుకురావడం సహజమే. స్పందనల్లోని వివక్షనీ, వ్యత్యాసాన్నీ ప్రశ్నించవలసిందే. అస్తిత్వ ఉద్యమాలు తప్పనిసరిగా ఆ పని చేస్తాయి, చేస్తున్నాయి. చాలా కాలంగా ప్రాతినిధ్య వివక్ష గురించి ప్రశ్నలు వస్తున్నప్పుడు, ట్యాంక్‌బండ్ విగ్రహాల్లో తెలంగాణకు చెందిన వికాస మూర్తులకు లభించవలసిన స్థానం లభించలేదని ఆవేదన వ్యక్తం అవుతున్నప్పుడు ఆ అన్యాయాన్ని, అసమానతను సరిదిద్దాలని కోరనివారు, అందుకోసం ప్రయత్నించనివారు ఇప్పుడు ఎలుగెత్తి విలపించడంలోని నిజాయితీని ఎవరైనా శంకించవలసిందే.

అయితే, శ్రీకాంతాచారి, యాదయ్య వంటివారి బలిదానాలకు భోరున విలపించిన వారు సైతం విగ్రహాల ధ్వంసానికి బాధపడవచ్చునని తెలంగాణవాదులు గుర్తించాలి. సీమాంధ్రులకే కాదు, తెలంగాణవారికీ ఇటువంటి సంఘటనలు రుచించకపోవచ్చును. బామాటంగా పొరపాటును అంగీకరించడమా లేదా అన్నది రాజకీయమైన అంచనాలకు లోబడి నిర్ణయించుకున్నది కావచ్చును కానీ, ఆత్మవిమర్శ చేసుకోవడం ఉద్యమానికే మంచిది. ఏ ఉద్యమాలు తప్పులు చేయలేదని? విప్లవోద్యమం, అస్తిత్వ ఉద్యమాలు అన్నీ ఏదో ఒక దశలో చేతులు కాల్చుకున్నవే. అయినా, వాటి ప్రాసంగికత, ప్రజాదరణ తగ్గలేదే?

విగ్రహ విధ్వంసాన్ని ఒక విధానంగా చేపట్టి 1970లలో నక్సలైట్లు ఈశ్వర చంద్ర విద్యాసాగర్, గాంధీ, నెహ్రూ, బోస్‌వంటి వారి విగ్రహాలను పనిగట్టుకుని ధ్వంసం చేశారు. ఇక ఈ వర్ణాధిక్య దేశంలో ఏదో ఒక మూలన అంబేద్కర్ విగ్రహాలకు అపచారం జరగని రోజంటూ ఉండదు. విగ్రహాలను రక్షించలేక ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాల చుట్టూ ఇనుపకంచెలు కట్టి తాళాలు వేసిన దృశ్యాన్ని నేను ఔరంగాబాద్‌లో ప్రత్యక్షంగా చూశాను. కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలలో ఇప్పటికీ అప్పుడప్పుడు శివాజీ విగ్రహాలను పాడు చేయడం జరుగుతూనే వున్నది. రష్యాలో లెనిన్ విగ్రహాన్ని 1990లో కూల్చివేస్తున్నప్పుడు సామ్యవాద అభిమానులందరూ కన్నీరు మున్నీరయ్యారు. కానీ, అక్కడి ప్రజలు తాము కూలదోస్తున్న అన్యాయ వ్యవస్థకు ప్రతినిధిగానే లెనిన్‌ను చూశారు. ఇక పాత వైతాళికుల 'విగ్రహాలను' భౌతికంగా కాకపోయినా భాషారంగంలో దళిత, స్త్రీవాదాలు ఏనాడో కూల్చివేశాయి. ఎక్కడా జరగనిది ఒక్క హైదరాబాదులోనే జరిగిందని బాధపడేవారు కూడా పై వాస్తవాలు గుర్తించాలి. అలాగే, విగ్రహాలు కేవలం ప్రాణంలేని బొమ్మలయితే ఇవన్నీ జరగవని తెలంగాణవాదులు గమనించాలి. విగ్రహాలకు ఏ ప్రాధాన్యం లేకపోతే, కొమరం భీం విగ్రహం స్థాపించాలని కోరడం ఎందుకు? విగ్రహాల వెనుక జన మనోభావాలు ఉంటాయి. కూల్చివేసే వారి మనస్సులో అవి ప్రతికూల ప్రతీకలయితే, ప్రతిష్ఠించాలనుకునేవారి దృష్టిలో అవే సానుకూల చిహ్నాలు.

ఈ సందర్భంలో మిత్రుడు, కథకుడు, ప్రశంసార్హమైన భాషా సేవ చేస్తున్నవాడు అయిన సా.వెం. రమేష్ చెప్పిన ఒక ఉదంతం ప్రస్తావిస్తాను. తమిళనాడు కృష్ణగిరి జిల్లా హోసూరు ప్రాంతంలో తెలుగవారు అధికంగా నివసిస్తారు. అక్కడ తెలుగువారి విద్యా, సాంస్కృతిక హక్కుల కోసం పోరాటం జరుగుతోంది. హోసూరు ధర్మపురి జిల్లాలో ఉన్న కాలంలో 1969లో తమ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలపాలని పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది.

ఉద్యమ సందర్భంలో పెద్ద ఊరేగింపు తీసినప్పుడు కొందరు ఆందోళనకారులు అన్నాదొరై విగ్రహాన్ని కూల్చివేశారు. అన్నాదొరై తెలుగువాడు. ఇప్పటి తమిళనాడు నేతల్లా కాకుండా బాహాటంగా తన మాతృభాష తెలుగు అని ప్రకటించినవాడు. ఆంధ్రప్రదేశ్ ప్రజా ప్రతినిధులు అడగక ముందే, తెలుగును జాతీయ భాష చేయాలని పార్లమెంటులో డిమాండ్ చేసినవాడు. ఇక ద్రావిడ, శూద్ర ఉద్యమాలలో ఆయన పాత్ర తెలియనిదెవరికి? కానీ, ఆ రోజున ఆయన విగ్రహాన్ని కూల్చివేసినప్పుడు హోసూరు తెలుగువారి దృష్టిలో ఆయన అక్కడి ప్రభుత్వ ప్రతినిధి మాత్రమే. హోసూరు ఉదంతం నుంచి తెలంగాణ ఉద్యమం నేర్చుకోవాలని రమేశ్ అంటారు.

ఆనాడు అన్నాదొరై విగ్రహ విధ్వంసాన్ని సాకుగా తీసుకుని తమిళనాడు ప్రభుత్వం పెద్ద ఎత్తున బలగాలను దించి, అక్కడి తెలుగు ఉద్యమాన్ని అణచివేసింది. అక్కడి ఉద్యమంతో పోలిస్తే, తెలంగాణ ఉద్యమం బలమైనదీ, విశాలమైన ప్రాంతంలో విస్తరించినదీ అయినప్పటికీ పొరపాట్లు ఒక్కోసారి నష్టం కలిగిస్తాయని ఆయన హెచ్చరిస్తున్నారు. ఆ హెచ్చరిక పట్టించుకోవలసిందే!

**– కె. శ్రీనివాస్**

13.03.2011,
ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజి

ఎన్టీ ఆర్ అధికారంలోకి వచ్చేసరికి

ధాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు.

ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు.

ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు.

కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

**– ప్రొ॥ జయశంకర్**

# విధ్వంస సార్వభౌముడు

**- అల్లం నారాయణ**

మూడు దశాబ్దాల క్రింద గదా తెలుగుదేశం మిత్రులారా! ఎన్టీఆర్ ఈ నయా కార్పోరేట్ దోపడీగాళ్ల రూపురేఖలను పిండస్థ దశలో నిర్మాణం చేసింది. ఇంతకీ ఎన్టీఆర్ మనవాడా? పరాయివాడా? ఆవేశంగానో, నామామత్రంగానో ఉన్న ఆ ఒక్క ప్రాంతీయ మండలిని చెక్‌లు వద్దు, కౌంటర్ చెక్‌లు వద్దని పీకి పారేసిన ఘనత వహించిన తెలంగాణ అభివృద్ధి కాముకుడు, తెలుగు జాతి వల్లభూడు. అప్పటించి కదా! ధాతు, ఫిర్యాదు కూడా నమోదుకాని ఒక అరాచకం రాజ్యమేలింది.

'ఇబురాముడు' ఎవరో? తెలుసా? పోని ఇబ్రహీమ్‌కుతుబ్ షా తెలుసా? తెలియదు. నాకూ తిలియదు. కెప్టెన్ పాండురంగారెడ్డి చిన్న పుస్తకం చూసేదాకా 'ఇబురాముడు' అని తెలంగాణ ప్రజలు ఇబ్రహీమ్ కుతుబ్‌షాను పిలుచుకునే వారని కూడా తెలియదు. తెలంగాణలో ఆయన సురవరం ప్రతాప్‌రెడ్డి అన్నట్టు 'మనమూ చరిత్రకు ఎక్కలేదు. కనుక. ట్యాంక్‌బండ్ మీద మనది కాని మన చరిత్ర పీఠమేసుకొని కూచున్నది. కనుక. ఈ పీఠాలన్నీ వేసి మరీ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని, తెలుగు సంస్కృతిని ఎన్.టి. రామరావు నిలబెట్టారు. కనుక అవును ఇబురాముడును తెలియని తెలంగాణకు ఎన్టీఆర్ మాత్రమే ఎందుకు తెలిసినట్టు? మా కరీంనగర్‌కు వెళ్తున్నపుడు అలుగునూరు వంతెన దాటినాక తన వేలుతో దారి చూపుతూ ఎన్టీఆర్ ఎందుకు నిలబడినట్టు? అంతాదాకా అయితే ఎన్టీఆర్ సీఎం కానీ కరీంనగర్‌లో పుట్టిన పీవి ప్రధాని కదా? నాకేమీ ప్రేమ లేదు. కానీ జిల్లావాడు కదా! ఆయన ఏమైపోయినట్టు? ఊహాచిత్రాలు గానీ, రూప విశేషాలు గానీ లేని కవులెవరో సమూహం లాగా కొలువుదీరి ఉన్న ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల సంగతి సరే ఎన్టీఆర్ హైదరాబాద్ వడవాడనా ఎందుకున్నట్టు? ఎన్టీఆర్ పార్కు. ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ మార్గ్, ఎటుచూస్తే అటు ఎన్టీఆర్ ఎందుకు? పరివ్యాప్తమైనట్టు? ఉత్తగనే జరిగిందా? తెలుగు దేశం పరాధీన, బానిస నాయకత్వం మాట్లాడ్తున్నది. ఏం చేసిండు. ఎన్టీఆర్ ధవళేశ్వరం ఆనకట్ట ఇచ్చంపల్లి ప్రాజెక్టును ఎటుకాకుండా చేసిన సర్ ఆర్థర్ కాటన్ తెలంగాణకు వెలుగెందుకయ్యిండు? అయినా సరే, మన పాఖాల, మన రామప్ప మన ధర్మసాగరం, అద్భుతమైన తటాకాలు నిర్మించిన కేతమ నాయకుడు కనీసం ఎందుకు తెలయడు. ఎన్టీఆర్ ఏం మంత్రమేసి ఉంటారు? దేవేందర్‌గౌడ్! ఏం మాయ చేసి ఉంటారు. కడియం శ్రీహరి ఏం మత్తుచల్లి ఉంటారు ఎర్రబెల్లి దయాకర్‌రావు. తెలంగాణ గురించి మీకూ ఎందుకు తెలియకుండా పోయినట్టు? తెలుగు వైభవాన్ని పునరుద్ధరించిన ఎన్టీఆర్ భారీ విగ్రహాల క్రింద నలిగి నీలిగిన ఆత్మల ఘోష. అది తెలంగాణన చరిత్ర గోస.

ఎన్టీఆర్ వచ్చినంక కదా! తెలుగు జాతి మనది' వచ్చింది. తెలుగు జాతి మనది అనుకున్నంక కదా! ఇవ్వాళ్ల తెలంగాణ ఇల్లలికిన ఈగ అయింది. పరు తెల్వని ఊరు తెల్వని మైమరపు. చరిత్రను ఎవరు ధ్వంసం చేశారు. నిజాంసాగర్‌కు నిజాం ఫర్మానతో విచ్చేసిన పాత తరపు బెతు కాదు ఆంధ్ర వలసవాది అతనిప్పుడు ఒక వ్యవస్థీకృత ప్రపంచపెట్టుబడిదారు. లగడపాటి, రాజయపాటి, కావూరి, జీఎంఆర్ జీవీకే, రామోజీ, రామలింగరాజు, అంజిరెడ్డి, అరబిందోలు ఎక్కడివని? ఏ కంపెనీలు పోతే ఈ కంపెనీలు మొలిసినయని వీటి పుణ్యం మీ రెండు కళ్ల

చంద్రబాబు ఆయన మామ పూణ్యం కాదా? నిజాంసాగర్ ప్రాజెక్టు కింద పంటలు పండించుకోవడానికి వచ్చిన వాడు కాదు. చుట్టి రాజ్యమేలుతున్న వలసవాది. అమెరికాకు కన్నుగీట గలవాడు. జ్ఞానాన్ని అజ్ఞానాన్ని కలెగలిపి సరుకుగా అమ్ముకోగలిగినవాడు. ఢిల్లీని ఒక్క రోజులో తారుమారు చేసి ఆటడించి ఆడిన మాటను తప్పేలా చెయ్యగలడు. నిజాం అవసరాల కోసమో, హైదరాబాద్‌పై దండయాత్ర చేసిన యూనియన్ సైన్యాల ప్రతినిధి వెల్లోడి కోసమో వచ్చిన ఇంగ్లీషు ఆంధ్ర ఉద్యోగి కాదు ఇప్పటి వలసవాది. అతనిప్పుడు నడమంత్రపు సిరిలో, కన్నార్షియాలు, పర్పస్ వెహికిల్‌లూ రాచబాటలుగా, ఫోర్బ్స్ జాబితాలోకి  ఎక్కిన ధనమాదాంధ్ర దురహంకారి ఇదంతా కేవలం నాలుగు దశాబ్దాల చరిత్ర. మూడు దశబ్దాల క్రింద గదా తెలుగుదేశం మిత్రులారా! ఎన్టీఆర్ ఈ నయా కార్పొరేట్ దోపిడిగాళ్ల రూపురేఖలను పిండస్థ దశలో నిర్మాణం చేసింది. ఇంతకీ ఎన్టీఆర్ మనవాడా? పరాయివాడా? ఆవేశంగానో, నామమాత్రంగానో ఉన్న ఆ ఒక్క ప్రాంతీయ మండలిని చెక్‌లు వద్దు, కౌంటర్ చెక్‌లు వద్దని పీకి పారేసిన గనత వహించిన తెలంగాణ అభివృద్ధి కాముకుడు, తెలుగుజాతి వల్లభుడు. అప్పటినించి కాదా! ధాతు ఫిర్యాదు కూడా నమోదుకాని ఒక అరాచకం రాజ్యమేలింది. సర్వెకాస్‌లు సబ్బండవర్ణాల భూములు అప్పుడు కాదా? హైదరాబాద్ రియాల్ ఎస్టేట్ వెంచర్ అవడానికి బీజాలుపడింది.తెలంగాణ అభివృద్ధి నిధుల కోతలు, కోస్తాంధ్రకు నిధుల తరలింపులు అప్పుడు కదా! రాచనడకన తరలిపోయినయి! నో చెక్ నిజమే తెలుగు వారమందరమూ ఒక్కరమే కానీ ఒక్కటి చెప్పండి నా తెలంగాణ తెలుగుదేశం మిత్రులారా! కన్నొంకర, కాలొంకర, నల్లగొండ బతుకులే వంకర చేసిన ఫ్లోరైడ్ భూతం వెంటాడిన నల్లగొండ ఎడమ కాలువ ఎందుకు కునారిల్లింది. కుడి కాలువ ఎందుకు విశాలమై తెలుగుగంగ, హంద్రినీవా, గాలేరు, నగరి మున్నూటాయాభై టీఎంసీలు పారే జల ప్రవాహమైంది? ఎన్టీఆర్ అనే ఒక మహానుభావుడి వల్ల కదా! మిత్రులారా! అసలు ఎడమ కాలువ ఒకటి ఉందా? ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ ఎంత? ఎవరి వ్యూహం ఇది. ఎన్ని చెప్పమంటారు. ఎన్టీఆర్ పుణ్యాలు. నిజాం చక్కెర ఫ్యాక్టరీకి ఏమయింది. ఇప్పుడది చేతుల్లో ఉంది. తెలంగాణ 12 పాల శీతలీకరణ కేంద్రాలు, పాల ధార ఏమయింది. మామ మూసేసిండు అల్లుడు హెరిటేజ్ దుక్నం తెరిచిండు రియాల్ ఎస్టేట్, సంస్కరణలు, అన్ని గడపలకన్నా మా గడపమేలన్న సాంస్కృతిక పెత్తనపు మీడియా, సినీమాయ దరుహంకారం. బ్రహ్మానందరెడ్డి బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తానన్నారని సినిమా రంగం ఎన్టీఆర్ వచ్చినంక కదా! ఇక్కడ ఇక మనం రాజ్యమేలవచ్చునని దూసుకొచ్చింది. వాళ్లొచ్చినంక గదా! మనం నర్సింగ్‌లుగా, శకుంతలలుగా దిగజారింది. రౌడీలకూ, గూండాలకూ, అనాగరికులకూ అజ్ఞానులకూ ప్రతిరూపం అయింది. సంస్కృతమో, ఆంగ్లమో కలిసిన ఆంధ్రము విరాజిల్లి సొబగులద్దిన తెలంగాణ భాష తనను తాను దాచుకున్నది వచ్చినంకనే కదా! ఎన్ని చెప్పమంటారు? ఒపెన్ యూనివర్సిటీ నల్లగొండ నుంచి హైదరాబాద్ రాష్ట్ర విశ్వవిద్యాలయం అయి ఎందుకు వచ్చింది? హెల్త్ యూనివర్శిటి మాత్రం విజయవాడకు ఎందుకు తరలింది? పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతిలో ఎందుకుంది? జవాబు చెప్పగలరా? ఎన్టీఆర్ భక్తులారా! ఆరేసుకోబోయి, పారేసుకున్న ఆద్భుతనట శిఖామణి తెలుగు జాతి వైభవంలో మంట కలిసింది. కదా! తెలంగాణ ఏం మిగిలింది? తెలంగాణకు, మామ తెలంగాణను ఆక్రమిత ప్రాంతంగా చేసుకుని, కూలీ కుతుబ్ షా కట్టిచ్చిన హైదరాబాద్ అమ్మేసుకుని ట్యాంక్‌బండ్ కట్టను కట్టిన హుస్సేన్ షావలీ ఆత్మను మలినపరిచి ట్యాంక్ బండ్ మీద ఊరేగించిన అన్ని విగ్రహాల మతలబు తెలియదా? హఠాత్తుగా ఎన్టీఆర్ జాతి గౌరవం వల్ల కదా! ట్యాంక్‌బండ్ మీద పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగానికి తెలుగు జాతి నివాళులు ప్రారంభం అయింది. నవంబర్ 1 కదా! తెలంగాణకు విద్రోహ దినం నవంబర్ ఒకటి కదా! ఒక స్వతంత్ర రాష్ట్రాన్ని కుట్రలు కుహకాలతో ఆంధ్రప్రదేశ్ చేసింది. తెలంగాణ కు విద్రోహం అయిన నవంబర్ ఒకటిని ఎన్టీఆర్ పండుగ ఎందుకు చేసినట్టు? అంతా తేటతెల్లమే. ఎన్టీఆర్ అయితే, ఆయన అల్లుడు అసలు తెలంగాణ పదమే ఉచ్చరించనివ్వనిన నాయకుడు. ఎందుకు ఇంకా 'కొలువా.. కుమ్మరి పొయ్యా' స్వయంపాలన కోసం జరిగే పోరాటంలో బానిసలు పనికిరారు. బానిస జాతి బానిసత్వం మూలాలు తెలుసుకోకుండా విముక్తి కాలేదు. నా తెలంగాణ

తెలుగుదేశం మిత్రులారా! తేల్చుకోండి. ఇంతకీ రెండు కళ్ళ చంద్రబాబు. చిత్తూరు మనిషి తెలంగాణ తెచ్చుకున్నంక ఆయనే మీ ముఖ్యమంత్రా... అప్పుడు స్వీయ ఆస్తిత్వ రాజకీయం ఎక్కడ? ఎందుకు బాంచెనుతనం. ఇక చాలదా! ఎన్టీఆర్ ఆగమనమే ఒకప్పటి వలసాధిపత్యాన్ని పతాక స్థాయికి చేర్చే బాటలు వేసింది. తెలంగాణ చరిత్రను, భాషను, సంస్కృతిని ధ్వంసం చేసింది. విగ్రహ విధ్వంసం జరిగింది. ఇక చాలు. ఎటో ఒక దిక్కు న్యాయం ఉంటుంది. మనుషుల విధ్వంసం జరగక ముందే మేల్కోందాం.

26.06.2011
నమస్తే తెలంగాణ

**– అల్లం నారాయణ** *(ప్రాణహిత)*

# 'ధ్వంస రచన'

**– యూసుఫ్**

ప్రజా సౌధాన్ని కట్టాలనుకునేవాడే
రాజ సౌధాలను కూలుస్తాడు
కోటను కూల్చకుండా
కొత్త రాజ్యాన్ని ఎలా నిర్మిస్తాం?
గడీని మట్టు పెట్టకుండా
వడిగా ఎలా ముందుకెళ్తాం?
కట్టాలంటే ముందు కూల్చాల్సిందే
అది విగ్రహమో ... నిగ్రహమో ...
సౌధమో ... ఆయుధమో .. .. ఆయువో !
కలకు రూపమివ్వాలంటే
అక్కడ ఖాళీ ఏర్పర్చాలి ముందు
శిథిలాల గుట్టలు పేరుకొనేది కొన్నాళ్లే
వినిర్మించేవాడికి
శిథిలాలపై ప్రేమెందుకు
శిథిల మనసుల్ని
మనుషుల్ని ప్రేమించలేడు వాడు
దూసుకెళ్లే స్వభావమది
దూసిన ఖడ్గం వాడు ...
దూసుకెళ్లే బాణం ...
ఎత్తిన గడ్డపార!

గమ్యం తప్ప
ఏదీ కంటపడని గురి
పక్షి కన్ను తప్ప
చెత్తా చెదారమేదీ కనిపించదు
నిప్పును రాజెయ్యడమే తప్ప
నినాదమే ... నిర్మాణమే తప్ప
నాన్చివేతల్ జాన్తానై

వినిర్మాణానికి
ఏదో ఒక మూల నుంచి
కూల్చడం మొదలవ్వాల్సిందే
గడ్డపార వెయ్యకుండా మొక్కెలా నాటగలం?
పునాది తియ్యకుండా దేన్నైనా ఎలా కడతా?
ఎవరినీ నొప్పించకుండా
సత్యమెలా చెబుతాం?
అవును
ఇవ్వాళ కూల్చింది
రేపటి రూపును ఆవిష్కరించడానికే
జీవాలు కూలుతున్న ఆక్రమందనే
విగ్రహాలు కూల్చింది
ఇంకొకటి చెప్పనా!
మా మధ్య
కొన్ని దుష్ట విగ్రహాలు తిరుగుతున్నాయ్
వాటిని కూడా కూల్చేదాకా చూడొద్దు!

# విగ్రహాల విధ్వంసం.. గతం

– అల్లం నారాయణ

మట్నూరి కృష్ణారావు
మహా జర్నలిస్టు సరే ...
మరి షోయబుల్లాఖాన్ మాటేది?
భావ ప్రకటనా స్వేచ్ఛకోసం కాని కాలంలో
కాని భూప్రపంచం మీద, రాచరిపు
కత్తివేట్లకు బలైన షోయబుల్లాఖాన్‌ను
ఎందుకు మరిచిపోతారు? ఎలా సాధ్యం?
అల్లూరి సీతారామరాజు
అసమాన వీరయోధుడు సరే...
మరి నైజాం సేనలను ఎదిరించి
గోండుల మీద నైజాం పెత్తనాన్ని ఎదిరించిన
మొనగాడు, గోండుల దేవుడు
కొమురంభీమును ఎందుకని విస్మరిస్తారు?
ఎందుకలా!
బ్రిటన్ ప్రభువులను ఎదిరించిన
రాంజీగోండు అసమాన సాహసం
ఆచూకీ ఏదీ? అడుగుజాడ ఎలా
మరచిపోతాం? ఎందుకు ?
కోఠి మెడికల్ కాలేజీ పక్కన
తుర్రెబాజ్ ఖాన్ జ్ఞాపక చిహ్నమూ
పాడువడ్డదెందుకు?
సీఆర్‌రెడ్డి గొప్ప విద్యావేత్తసరే...కానీ
దేవులపల్లి రామానుజరావు... కాదా?
ఆయన విస్మృతిలో ఉన్నాడేమిటి?
కవిత్రయం కవితాశక్తులకు
జేజేలు పలుకుదాం... సరే...
మనం మల్లినాథ సూరన
మన పాల్కురికి సోమన ఎక్కడ?

గురజాడ తెలుగువారి
అడుగుజాడ సరే!
వట్టికోట, దాశరథిల ఆచూకీ ఎక్కడ?
వైతాళికుయిన వారొకరే ఎందుకు?
ఏ అవకాశాలూ లేని ప్రపంచం నుంచి
ఎదిగివచ్చిన వారూ విస్మృతిలోకి
ఎలా జారారు? ఎవరు సృష్టించారీ జారుడుబండ...కందుకూరి
సంఘ సంస్కరణలకు వేసిన దారిసరే
మాడపాటి హనుమాంతరావు ముచ్చటే లేదేమి?
గుర్రం జాఘువాను గౌరవిద్దాం సరే...
భాగ్యరెడ్డి వర్మ భాగ్యరేఖలెక్కడ?

మార్చి 10, మిలియన్ మార్చ్ కదం తొక్కుతున్నది. ఎండలు ముందరలేదు. ట్యాంక్‌బండ్ ఆకాశం మీద అప్పటికే పొగలు చిమ్ముతున్నవి. నినాదాలు, హూరుగాలి. చిరపరిచితమైన ఆ పాత రెయిల్సింగ్ పైన మబ్బుల్లోకి వ్యాపిస్తున్నది. ఉత్తేజం. ఒక ఉద్విగ్నత ఉద్రేకం చెమట కమ్మిన, శరీరాలు, గాల్లోలేస్తున్న పిడికిళ్లు ఒకే ఒక్క నినాదం జై తెలంగాణ. సాహసం నిలువెల్లా వ్యాపించిన మనుషులు అవును వాళ్లు దేన్నో పడదోసుకొని, తోసుకుంటూ తొక్కుకుంటూ వచ్చారు. పెద్ద వినాయకుని అడ్డా ఖైరతాబాద్ వచ్చేసరికే అక్కడొక బారికేడ్ ఇక కదల కూడదు. సరే? ఎవరో సలహా ఇచ్చారు. టూ వీలర్ మీద ఇమాక్స్ దగ్గర సందులు గొందుల్లో పడి తేలొచ్చు. అక్కడి నుంచి ట్యాంక్‌బండ్‌కు ... సులభమా! ఖైరతాబాద్‌లోనే వందలాది మంది గుంపు బ్యారికేడ్లు ఛేదించలేక, కదలక, మెదలక, అసహనంగా అటూ ఇటూ .. పరిచయమైన ముఖం తీసుకువెళ్తాడేమోనని చిన్నగుంపు మావంక ఆశగా చూస్తున్నది. కానీ, మాకే దిక్కుండేట్టు లేదు. మేమంతా పది మందిమి వృత్తి అనుభవించి పలవరిద్దామని.. మా కోరక తీరేట్టులేదు. ఐమాక్స్ మూలకు చేరేసరికి తలప్రాణం తోకకొచ్చింది. అక్కడ మళ్లీ బారికేడ్. ఈ సారి సీరియస్‌గా ఉంది పరిస్థితి. ఒక పోలీసు ఆపీసర్ రాక మా కార్డులు ముందర ప్రదర్శిస్తూ మీడియా వాళ్లం వెళ్లాల్సిందే అంటాం పోలీసు హజం నా మీదా చేయి పడింది. గొడవ... మా సారు మీద చెయ్యేస్తావా? ఎంత మంది జర్నలిస్టులు మూగారో! పోలీసులను ధిక్కరించారు. వెనక పెద్ద గుంపు ఈ గొడవలో బారికేడ్లు దాటోచ్చని ఆశ. వురుకులు. పరుగులు గొడవ... అరువులు కేకలు ఉక్రోశం పెరుగుతున్నది. ఆక్రోశం పెరుగుతున్నది. ఎవరినన్నా కొట్టాలని కూడా ఉన్నది. మర్యాదస్తులం కదా! పైగా జర్నలిస్టులం కదా! ఓపిక పట్టాలి ఎందుకు వెళ్లనివ్వరు. వెళ్లనివ్వం అంతే షిండే యూనోమి పర్సనల్లీ మధ్య మధ్య వాదనలు మిమ్మల్ని పంపుతాం. ఆపండి మళ్లీ అదే పద్ధతి తోసుకుంటూ తొక్కుకుంటూ ట్యాంక్‌బండ్ మీద ఊరేగిన మమ్మల్ని మా హైదరాబాద్‌లో మమ్మల్ని ... మా ఊర్లో మమ్మల్ని ... మా రాజధానిలో మమ్మల్ని కనీసం ఎందుకు కదలనియ్యరు. మిలియన్ మార్చ్ పోలీసుల మార్చ్‌లో ఉంది. పదఘట్టనల్లో ఉంది. ఊరి నుంచి రానివ్వరు, ఊళ్లో కదలనివ్వరు, ఇదేమి నిర్భంధం. ఇదెవరి ప్రభుత్వం. ఆగ్రహం కట్టలు తెంచుకొంటున్నది. కోపం.. ఎన్టీఆర్ పార్కు నిశ్చలంగా ఉంది. మూతబడి ఉంది. ఆసలీ ఎన్టీఆర్ ఎవరు? ఈ ట్యాంక్‌బండ్ మీద నెక్లెస్ రోడ్డు ఏమిటి? అటు ఎన్టీఆర్ పార్క్ ఇటు ఐమాక్స్ చిరాన్ పార్క్ దగ్గర మూడువందలా డెబ్బయి మంది ప్రాణాలను బలిగొన్న కాసు బ్రహ్మానందరెడ్డి ఎవరి చిహ్నం కాస్త అటుగా వెళ్తే ఎల్‌వి ప్రసాద్ మార్గ్ ... ఏమిటి చిహ్నాలు.. ఎవరి చిహ్నాలు? ఏ ప్రతీకలివి..? కోల్పోయిన ప్రతీకలేమిటి? హైదరాబాద్ ఎక్కడున్నది. హైదరాబాద్ రాజధాని నగరం ఏమైంది. ఇదెవరి అడ్డా..? ఎవరి సంస్కృతి స్థాపన జరిగిందిక్కడ ప్రశ్నలు కోకొల్లలు. పట్టరాని కోపం పక్కన కాలిపోతున్న వ్యాన్. పొగలు ఆకాశం అంటుతున్న దృశ్యం. కదలబారుతున్న జనం. ట్యాంక్‌బండ్ నిండింది. ఈ ట్యాంక్ బండ్ కట్టిచ్చినదెవరు?

హూసేన్‌సాగర్ నిండా జలాల్లో చేపలు నిండినట్టు, ఈ నగరం నిండా జనం నిండుకోవాలని కోరుకున్న

మీర్ ఉస్మాన్ అలీఖాన్ ట్యాంక్‌బండ్ నిండా పక్కన, వెనకన, ముందున ఎట చూస్తే అటు ఏ ఎన్నీఆరో నిండుతాడని ఊహించి వుంటాడా? విగ్రహాలు ఊలుతున్నప్పుడు శ్రీశ్రీని ముట్టుకోవద్దు. అల్లూరిది వద్దు.. శాలివాహనుడు మనోడే ఆగండాగండి... ఇట్లా వద్దు.. అడ్డుపడాలని ఉన్నా చూస్తూ అనేకులు ఉదాశీనతా కాదు లోపల కోపమేదో రగులుతున్నది. ఇంత నిర్భంధంలో ఇంత అణచివేతలో, ఒక సాహసం ట్యాంక్‌బండెక్కింది. ఆ సాహసం లోపల సుడులు తిరుగుతున్నది. బహుశా అదే అందరిలోపలా జర్నలిస్టులమందరం ఒకే చోట గుమికూడి చూస్తూ ఉన్నాం... ఆ విగ్రహాలు వద్దు అని చెబుతూనే ఉన్నాం. ఎందుకో వద్దనిపిస్తున్నదా? జనిమా? కానీ లోపలొక సాహసం కెరలుతున్నది. ద్వైదీభావమేమి లేదు. అవి విగ్రహాలా? మనుషులేనా? బహుశా ఆరువందలమంది పిల్లలు కళ్లలో కదులుతున్నారా? ఆరువందల మంది పిల్లల తల్లుల గర్భశోకాలు...

యాదయ్య! జీవితమంతా నాకోక పీడకల వదు నా మనసుఉ వీడను వాడిదొక విగ్రహం మాటల నాల్కల కొసలు చాపుతూ ఎగురుకుంటూ ఎగురుకుంటూ నిప్పులు చిమ్ముకుంటూ దుంకులాడిన యవ్వన సౌగంధపు త్యాగ పరిమళం. నా మనసును వాడి విగ్రహం ఆక్రమించుకుని ఉన్నందువల్ల కావచ్చు. విగ్రహాల మీద ఎగురుతున్న జెండాలు. రెండు పడిపోయినవి. మరో రెండు పడిపోనున్నవి! కూల్చుతున్న వాళ్లకు ముఖాల్లేవు. అదొకటే ముఖం ధిక్కారం మొఖం. తిరుగుబాటు, సాహసం, ఉక్రోశం ఆక్రోశం కోపంలోనూ వివశతలోనూ దగాపడ్డ ముఖం తండ్లాడిన ముఖం అది అచ్చ తెలంగాణ వాడి ముఖం బహుముఖాలు ఒక ముఖ్యమైన, ఆరుదైన జీవితంలో ఎన్నడూ చూడని సన్నివేశం. ఇంతకీ నాకేమీ కన్నీళ్లు రావడం లేదు. ఇంతకీ ఏదీ నాకు తప్పుగానో, విధ్వసంగానో తోచడమూ లేదు. ప్రశ్నలు ప్రశ్నలు ఎవరిదీ ట్యాంక్‌బండ్ ఎందుకీ ఆగ్రహం చహూశా నాకు అగ్రహకారణాలు తెలుస్తున్నాయి. అవగాహన అవుతున్నది. విధ్వసం మూలాలు అవగతమవుతున్నవి.

వర్తమానం తెల్లవారింది. సంస్కృతీ విధ్వంసం చారిత్రక విషాదం మండుతున్నది. ట్యాంక్ బండ్‌ను చూశాను నేను. మిలియన్ మార్చ్‌ను చూశాను నేను విధ్వంసమా? అది సంస్కృతి విధ్వంసమనా? అయితే ఎవరి సంస్కృతీ విధ్వంసం ఎప్పుడు ప్రారంభమైంది. 1956లో విలీనంతోనే ప్రారంభమైయింది. తెలంగాణ సంస్కృతి ఎక్కడ? అది అయిదున్నర దశాబ్దాలుగా ఆవిచ్చిన్నంగా సాగుతున్నవి. షోయబుల్లాఖాన్, అలీ యావర్‌జంగ్, తుర్రె బాజ్ ఖాన్  ఈ ట్యాంక్ బండ్ కట్టిచ్చినాడు. ఈ హైదరాబాద్ పొందిచ్చినవాడు ఎక్కడ? సీరియస్ ప్రశ్నలు. తెలంగాణకు ఒక విశిష్ట సంస్కృతి ఉండింది. అది ధ్వంసమయింది. అదీ నాకు చరిత్రకు విషాదం రెండు అసమ సమాజాల కలయిలో ఏర్పడిన ఘర్షణల సారం. ఒకటి అధిపత్యం సంస్కృతి మరొ సంస్కృతిని మింగిన ఫలితంగా కోల్పోయిన వాడి ఆత్మఘోషల విధ్వంసంగా నాకు తోస్తున్నది. రెండు అసమ వ్యవస్థలు, రెండు భిన్న చారిత్రక అనుభవాలు కలిగిన ఆంధ్రప్రదేశ్ మానసికంగా విడిపోయింది. కానీ వలసాధిపత్యం తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేస్తూ, ఈ విధ్వంసం పట్ల మౌనం వహిస్తూ ఇలెక్కి కూస్తున్న పత్రికల లక్షమేంటి? తమది మాత్రమే సంస్కృతి అని ఇంకెవరికీ పాలన అవశేషాలను, అలవాట్లను, ధోరణులను ఆకళింపు చేసుకున్న పెత్తందారీ పెద్దన్నయ్య, ఇరుగు పొరుగు సీమాంధ్ర ఏలిక కాదా? ఎన్టీరామారావు విగ్రహాలను కట్టించిదెన్నడు? ఆ విగ్రహాల్లో తెలుగు వెలుగులు కేవలం ఒక ప్రాంతానికే ఎందుకున్నాయి? మచ్చుకు కొందరు తప్ప అక్కడి సంస్కృతి, అభివృద్ధి నమూనా, జీవన విధానం, ఆర్థిక విధానం వేరయినప్పుడు వచ్చిన వైతాళికలు మాత్రమే తెలంగాణ వైతాళికులా? ఈ ప్రశ్నలకు సమాధానమేది? సాధారణంగా వలన వెళ్ళేవాళ్లు ఎక్కడికి వలన వెళ్తే అక్కడి సంస్కృతిన స్వీకరిస్తారు. కానీ బతుకుదెరువు కోసం పెట్టుబడుల విస్తరణ కోసం విస్తరించినవాళ్లు ఇక్కడి సంస్కృతిని కబళించారంటే వారిది సామ్రాజ్యవాదవ విస్తరణ కాంక్ష కాక మరేమిటి తెలంగాణ అంటే ఒక విశిష్ట సంస్కృతిక దృక్కోణం, సుదీర్ఘ చరిత్ర ఈ చరిత్ర అనవాళ్లెకెక్కడ? అవును అక్కడ రాచరిక పాలనలో కూడా దక్కన్ పీఠభూమి ఒంటరి సమాజం ఇతర సమాజాల సంస్కృతిని సంలీనం చేసుకున్నది. దేశానికే ఆదర్శప్రాయమైన సమభావనా సంస్కృతిలో జీవిస్తున్నది. వ్యవహారాల విజయాల కన్నా మానవ సంబంధాలే మిన్న అన్నది. దేశంలోని పలు సమాజాలకు భిన్నంగా దేశానికి తలమానికమైన కాస్మోపాలిటన్ భావనల్లో మెప్పు పొందింది. జీవన సంస్కృతి తీరిక సమయాలు, మర్యాదలు, దర్బార్ సంస్కృతి, పారిశ్రామిక, వలస సమాజాలకు భిన్నంగా ఎదిగిందీ హైదరాబాద్ అలాంటి హైదరాబాద్‌ను

చాపచుట్టింది ఎవరు?

అవును నిజాంసాగర్ కట్టినప్పుడు 1920లో మొదట నిజాం వాళ్లను అహ్వానించారు. వలసలు... వాళ్లు ఇక్కడి వ్యసాయాన్ని తూలనాడారు. మర్యాదగా, మప్పితంగా, మార్మికంగా ఇక్కడి పద్ధతులను మార్చారు. ఏమార్చారు. వెక్కిరించారు. లచ్చుమమ్మలను లక్ష్మమ్మలను చేశారు. అది ప్రారంభం. భాషను వెక్కిరించారు. బతుకుదెరువు కోసం వచ్చి బరువయ్యారు. 1940 లో ఈ గడ్డమీదా తెలంగాణ సాయుధ పోరాటం జరిగింది. ఆ జాలు పట్టుకుని వచ్చారు. నల్ల నల్ల రేగళ్ల పొంట వచ్చారు. నీటి వాలుతో వచ్చారు. అప్పటికే ఆధునిక వ్యవసాయం, రైలు రోడ్డు మార్గం, ఇంగ్లీషు చదువు,కాలువలు కాళ్లతొ మలుపుకున్న షోకు పిల్లకి పెట్టుబడుతున్నయి. అది క్రమక్రమంగా ఇక్కడొక పెద్దన్న అయింది. 1969లో 370 మంది ప్రాణాలు త్యాగం చేసిన ఉద్యమం అప్పటికే వారికి విచ్చిన్నకుల వుద్యమంలా కనపడింది. ఆ తర్వాత వైపల్యం. ఇక ఇక్కడ పాతుకుపోయింది. కాసు బ్రహ్మనందరెడ్డి కర్కోటకుడిగా భావించే ఊరి నడిబొడ్డున ఆక్రమించుకున్నది. విగ్రహం తెలుగుదేశం అమూర్త భావనల మీద తెలుగు జాతి ఆత్మగౌరవం మీద నిలబడింది. ఇక ప్రారంభం ఆ పదఘట్టనల కింద హైదరాబాద్ లేదు. అది మిగలలేదు. ట్యాంక్‌బండ్ మీద ముప్పది విగ్రహాల కింద నలిగి నీలిగిన అలీయవర్‌జంగ్ ఆత్మ. వనస్థలిపురం నుంచి కూకట్‌పల్లిదాకా ఏకుమేకయ్యింది. అది కంట్లో ముల్లై దిగబడింది.

కాలం కడుపుతో ఉంది. పద్నాలుగేళ్ల క్రితం మలి తెలంగాణ పోరాటాన్ని కన్నది. ప్రశ్నల కొడవళ్లు, సంస్కృతి ఏది? ఎవరు మింగారు? ఎవరు కారణం తెలుగు విభులు, వల్లభులు, వైతాళికులు సరే మా వాళ్లేరి? ఎక్కడ మా జాడ. చరిత్ర వక్రీకరణల క్రింద ఎక్కడ కోల్పోయాం? ఏమి కోల్పోయాం? తప్పిపోయినా వాడి అత్మఘోష బహుశా తొమ్మిది దశాబ్దాల ఆగ్రహం బహుశా కోల్పొయిన వాడి వుక్రోశం.

నాకెందుకో కన్నీళ్లు రావడం లేదు. కృతకంగా తెచ్చిపెట్టుకున్నా రావడం లేదు. అట్లని బాధా లేదు. జరగాల్సిందేదో? జరుగుతున్నట్లు సంస్కృతిని విధ్వంసం చేసిన వారు సంస్కృతి గురించి మాట్లాడుతున్నట్టు? చారిత్రక విషాదాలకు మూలపురుషులు గిల్లి ఏడుస్తున్నట్లు దొంగ ఏడ్పులు. జరగాల్సిందేదో జరుగుతున్నది.

జరగాల్సిందేదో జరిగింది. లెనిన్ విగ్రహం కూలుతున్నప్పుడు చూశాను, బాబ్రీ మసీదు కూలుతున్నప్పుడు చూశాను. ఏడ్చాను కావచ్చు ఇప్పుడు నాకు ఏడుపేలేదు. బహుశా నాలో ప్రతిష్టించి ఉన్న విగ్రహం వల్ల శ్రీకాంతాచారి విగ్రహం వల్ల కావచ్చు, ప్రతిష్టించి వున్న యాదయ్య మంటలు మండుతున్న విగ్రహం వల్ల కావచ్చు. ఏడవలేను మర్యాదలేని వాణ్ణే కావచ్చు. ఫర్వాలేదు. తాలిబన్‌ను కూడా అయినా ఫర్వాలేదు. అవును శ్రీశ్రీతో ఊరేగాను. నక్సల్బరీని మోశాను. కమ్యూనిజాన్ని ఊరేగాను. కానీ దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టు మీ, ఈ భూమి నాది. ఇది నాకు చెందిన భూమి తెలంగాణ. ఇదొక మంత్ర జపం, దగా పడంది. తల్లడిల్లింది. తెగబడింది. ఒక ధిక్కారభూమి విడిపోవడం ఒక చారిత్రక అవసరం. కలిసి వుండటం ఇప్పుడొక అసహజ పరిణామం.

ఒక మెసేజ్ ... ఇప్పుడు ఇగ్రహాలు కూడా కూలాయి. ఇది మొదటి ప్రమాద హెచ్చరిక. అవును ఇప్పుడు విగ్రహాలు కూలాయి. మనుషులు కూలక ముందు ... విడిపోదాం. శ్రీశ్రీ మీద ప్రేమను కాపాడుకుందాం. అల్లూరిని అలుముకుందాం. మా కొమురం భీమును, షోయబుల్లాఖాన్‌ను, చాకలి ఐలమ్మను, బందగీని దొడ్డికొమురయ్యను, మా భాగ్యరెడ్డి వర్మను, మా మాడపాటిని, మా పాల్కురికిని ప్రేమిద్దాం. ఈ నేలన వికసించిన వజ్రాలను విగ్రహాలుగా మలుద్దాం. కూల్చిన చోట కొత్త మొలకలై మొలుద్దాం. సమభావన సంస్కృతి అంటే అధిపత్యం కాదు. లొంగుబాటు కాదు. బలహీనత కాదు. ఆదొక ఆత్మగౌరవ పతాక. నేను తెలంగాణ వాణ్ణి ఇంత జరిగినాక నాది తెలంగాణ నా సంస్కృతి కోసం సంస్కృతి మూలాల ప్రతిష్ట కోసం అవసరమైతే విధ్వంసాన్ని చేతులు సాచి ఆహ్వానిస్తాను. విధ్వంసం జరిపిన వాళ్లకు, విషాదాలు సృష్టించిన వాళ్లకు, విడగొట్టిన వాళ్లకు, మనసులను కలపలేని వాళ్లకు, అధిపత్య అహంకారులకు అర్హతలేదు. మా కన్నీళ్లింకిపొయ్యాయి. ఇక మాటలు కరువయ్యాయి. విగ్రహం విధ్వంసం. గతం... భవిష్యత్ ... మాదే తెలంగాణ ఒక ధిక్కార భూమి. అంతిమ విజయం తెలంగాణదే.

విరుగుడు పుస్తకం నుంచి

**- అల్లం నారాయణ**

# మిలియన్ మార్చ్ ... విగ్రహాల కూల్చివేత

**– నలమాస కృష్ణ**

వినతిపత్రాలు, మౌన వ్రతాలు, నిరసన ప్రదర్శనలు, నిరాహార దీక్షల నుంచి ఆత్మబలిదానాల వరకు అన్ని రకాల పోరాట రూపాల ద్వార చట్టబద్ధంగా తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను వ్యక్తీకరిస్తున్నారు. ప్రజాస్వామ్యం గురించి చిలుక పలుకులు వల్లించే పాలకవర్గం తానెప్పుడూ కనీస ప్రజాస్వామ్య పద్ధతులు పాటించకుండా ప్రజలను మాత్రం అన్ని రకాలుగా వంచిస్తూ, అణచివేస్తూ, హింసిస్తూ తన పాలనను సాగిస్తుంది.

అరవై ఏండ్ల కోస్తాంధ్ర అంతర్గత వలస దోపిడీ పాలనను తుదముట్టించాలంటే ఇక అరబ్బు దేశాలలో వెల్లువెత్తుతున్న ప్రజా పోరాటాల స్థాయిలో ఇక్కడ కూడా పోరాడక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర దోపిడీ కోటలను బద్దలు కొట్టడం కోసం హైదరాబాద్‌ను దిగ్బంధించి తెలంగాణ పోరాట శక్తేమిటో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజెప్పాలనే కృతనిశ్చయంతో తెలంగాణ ప్రజలు ఉన్నారు.

ఫిబ్రవరి 21, 2011న విద్యార్థి జేఏసీ "ఛలో అసెంబ్లీ" కార్యక్రమానికి పిలుపునివ్వగా లాయర్ల జేఏసీ "ఛలో రాజ్‌భవన్"కు పిలుపునిచ్చింది. ఈ పోరాట కార్యక్రమాలకు తెలంగాణ ప్రజా ఫ్రంట్, వివిధ జేఏసీలు మినహా పొలిటికల్ జేఏసీ, టీఆర్ఎస్‌తో పాటు ఏ ఒక్క రాజకీయ పార్టీ కనీస మద్ధతు ప్రకటించలేదు. అయినప్పటికీ తెలంగాణ ప్రజల సంపూర్ణ సహాయ సహకారం భాగస్వామ్యంతో ఈ పోరాట కార్యక్రమాలు విజయవంతమై తెలంగాణ ఉద్యమానికి గొప్ప స్ఫూర్తినిచ్చాయి. సరిగ్గా ఈ సమయంలో హైదరాబాద్ మహా నగరాన్ని తెలంగాణ జాతర పేరుతో ఏప్రిల్ మొదటి వారంలో దిగ్బంధనం చేయాలని విద్యార్థి మరియు న్యాయవాదుల జేఏసీ నిర్ణయించినట్లు వార్తలొచ్చిన 24 గంటల్లోనే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చి 10న హైదరాబాద్ దిగ్బంధనానికి పిలుపునిచ్చారు. (వాస్తవంగా హైదరాబాద్ దిగ్భంధానికి మిలియన్ మార్చ్‌గా విద్యార్థి జేఏసీయే నామకరణం చేసింది).

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కీలకమైన, అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ దిగ్బంధ పోరాట రూపాన్ని ఏదో ఒక పార్టీ, ఏవో కొన్ని జేఏసీలు కలిసి పిలుపునిచ్చి నిర్వహించగలిగే స్థితిలేదు. అయినప్పటికీ ఏకపక్షంగా టీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాన్ని సంయమనంతో మొత్తం ఉద్యమ ప్రయోజనాల రీత్యా ప్రజాఫ్రంట్‌తో పాటు విద్యార్థి, లాయర్లు ఇతర అన్ని జేఏసీలు కూడా ఆమోదించాయి. చివరికి గంభీరమైన ప్రకటన ఉపన్యాసం యిచ్చిన కేసీఆర్ కాంగ్రెస్‌తో చేసుకున్న అంతర్గత కుట్రపూరిత ఒప్పందం ఫలితంగా మిలియన్ మార్చ్‌ను విరమింపజేయడం కోసం, చివరికి వాయిదా వేయడం కోసం విఫల ప్రయత్నాలు చేశాడు. తెలంగాణలోని అన్ని రకాల శక్తులు, వ్యక్తులు, సంస్థలు, జేఏసీలు ఒకే నినాదమై మిలియన్ మార్చ్ జరిపి తీరుతామని ప్రతినబూని విజయవంతం చేశాయి.

వాస్తవానికి మిలియన్ మార్చ్ తలపెట్టిన ప్రధాన ఉద్ధేశ్యం నెరవేరనప్పటికీ రాజకీయ పార్టీలన్నీ చేసిన సహాయ నిరాకరణ ద్రోహాన్ని అధిగమించి వివిధ జేఏసీల సహకారం పొందడం గొప్ప విషయం. పోలీసు నిర్బంధాలను, చెక్ పోస్టులను, రాజకీయ పార్టీల ఆంక్షలను లెక్క చేయకుండా స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొనడం తెలంగాణ ఉద్యమంపై రాజకీయ పార్టీలకు పట్టులేదని స్పష్టం చేసింది. వివిధ జేఏసీలు కనీస కార్యక్రమం ప్రాతిపదికన

ఐక్యమై ప్రజలతో కలిసి ఉద్యమిస్తే రాజకీయ పార్టీలను పక్కనబెట్టి పోరాటం నిర్వహించగలమనే వాస్తవాన్ని మిలియన్ మార్చ్ రుజువు చేసింది. ఇది మిలియన్ మార్చ్‌కు సంబంధించిన రాజకీయ నేపథ్యం. కాగా విగ్రహాల కూల్చివేత అనేది మిలియన్ మార్చ్‌కు మరో పార్శ్వం.

విగ్రహాల కూల్చివేత అప్రజాస్వామికమైనదిగా, తెలంగాణ ప్రజలను అసాంఘిక శక్తులు, ఉన్మాదులుగా చిత్రీకరిస్తున్న కుహనా మేధావులు అరవై సంవత్సరాలుగా తెలంగాణ ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. తెలంగాణ ప్రాంతంపై కోస్తాంధ్ర సాంస్కృతిక దాడి, అణచివేతపై వారి సమాధానమేంటో తెలకపల్లి రవి లాంటి సమైక్యాంధ్ర మేధావులు సెలవివ్వాలి.

అంతే కాదు ... అరవై ఏండ్లుగా కోస్తాంధ్ర పెట్టుబడిదారులు "పార్టీలు మేము పెడతాం, తెలంగాణ వారికి టికెట్స్ మేమే ఇస్తాం ... ఆంధ్ర చరిత్ర మేమే రాసుకుంటాం ... తెలంగాణ చరిత్ర మేమే రాస్తాం ... మా పంటలు మేమే తింటాం ... తెలంగాణవారు ఏ పంటలు తినాలో మేమే నిర్ణయిస్తాం ... మా సంస్కృతిని మేమే నిర్ణయిస్తాం ... తెలంగాణ సంస్కృతిని మేమే నిర్ణయిస్తాం ... తెలంగాణ సంస్కృతి ఎలా ఉండాలో మేమే నేర్పుతాము, సమస్తం మేమే నిర్దేశిస్తాం. ఆదేశిస్తాం. మా ఆంధ్రుల విగ్రహాలు మా తెలంగాణ ట్యాంకుబండ్ మీద ప్రతిష్టిస్తాం, వాటితో పాటు తెలంగాణకు చెందిన వారివి ఎవరివి పెట్టాలో మేమే నిర్ణయించి ప్రతిష్టిస్తాం" అని ప్రకటిస్తున్నారు.

ఎక్కడిదీ వలసాధిపత్య దురహంకార ధోరణి, అయ్యో అన్నమయ్య, అమ్మో ఎర్ర ప్రగడా అని జబ్బలు చరుచుకుంటూ దిక్కులు పిక్కటిల్లేటట్లు గావు కేకలు పెడుతున్న ఓ మహా మనుషులారా ... సెలవివ్వండి.

అరవై ఏండ్లు కోస్తాంధ్రుల వలస పాలనలోన ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా దోపిడీ, అణచివేతలకు గురై విసిగి వేసారిపోయిన ఓ నిరుద్యోగ తెలంగాణ యువకుడు "తెలంగాణ రాష్ట్రం నా జన్మహక్కు" అని చాటి చెప్పి "ఒరేయ్ వలస పాలకులారా మా తెలంగాణను వదిలివెళ్లండిరా" అని ప్రపంచానికి ఎలుగెత్తి చాటి మంటల్లో మాడిపోయిన వందలాది బిడ్డల ఆక్రందన విని ఓ నకిలీ పెద్ద మనుషుల్లారా ... మీ నోరు ఇప్పుడు పెగులుతుందా?

అరవై ఏండ్ల సమైక్యానికి మా తెలంగాణకు మీరు మిగిల్చింది సెజ్‌లు, ఓపెన్ కాస్టులు, బీడు భూములు, స్వీపర్ పోస్టులు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్లే కదా? బక్కచిక్కి శల్యమైన ఎముకల గూడును కూడా వదలరా? ఓ ఫాసిస్టు మేధావుల్లారా! తెలంగాణ కంట నీరు కారి కారి ఇక రావట్లేదురా!

రాజధాని నడిబొడ్డున ప్రపంచ ఖ్యాతిగాంచిన ఎందరో మహానాయకులకు జన్మనిచ్చిన ఉస్మానియా యూనివర్శిటీలో అర్ధరాత్రి పూట అమ్మాయిల హాస్టల్స్ పైకి కండకావరంతో ఎగబడ్డ పోలీసు దురాగతాలు మీ కంటికి కనిపించడం లేదా? అపుడెటుపోయింది మీ ప్రజాస్వామిక స్పృహ? ఏ నదిలో కలిసి పోయినయి మానవ హక్కులు? ఏ మూలన దాచి పెట్టుకున్నారో మీ తెలుగు ఆత్మగౌరవం? తెలంగాణ చరిత్రలో లేని వారు, తెలంగాణ బతుకులో లేని వారు రాత్రికి రాత్రే ఎక్కడ నుంచి ఊడిపడ్డారు. ఈ తెలుగు ఆత్మగౌరవ రక్షకులు, మహా పరుషులు ...! మా బతుకు చరిత్ర, మా పోరాట చరిత్ర లేని పాఠ్యపుస్తకాల గురించి ప్రస్తావించకుండా మీ కుటిల నీతితో మీరు రాసిన పుస్తకాలను మీరే తీసి చదువుకోండి.

నేలరాలిన విగ్రహాలను అప్రతిష్టపాల్జేసిన వారిని "దుష్ట శక్తులని" తిట్టుకుంటూ, శపిస్తూ వలస దురహంకార పురాణం వల్లెవేసిన ఓ మహా రాజకీయ నాయకులారా ... మీరు మా ట్యాంక్‌బండ్ మీద నడుస్తున్నంత సేపట్లో ఒక్కసారైనా కొంచెమైనా గుండె కలుక్కుమనట్లేదా? సీమాంధ్ర సాంస్కృతిక ఆధిపత్యానికి ప్రతీకగా ప్రతిష్టించిన విగ్రహాలు మాత్రమే కనబడుతున్నాయి. తెలంగాణ జాతి ప్రజలను వెక్కిరిస్తుంటే మాదీ తెలుగు జాతని మమ్ముల్ని ఇంకెంత కాలం మోసపొమ్మంటారు? 600 మంది చస్తే, ఆరు నిమిషాలు చర్చించని అసెంబ్లీ, ఆ విగ్రహాలు కూలిపోతే ఎందుకో మరి గగ్గోలు పెడుతుంది.

ఓ రాజకీయ నేతల్లారా! తెలుగు జాతి సమైక్య వారసులారా! ఆ మహానుభావుల శిలా విగ్రహాలు, వారు మహానాయకులో, మహా పురుషులో, పుణ్యపురుషులో ఎవరైనా కావచ్చు, కానీ వారి వారి జన్మ స్థానమందున

ప్రతిష్టిస్తే తెలుగు జాతి పునర్జీవనం చెంది ఉండేది కదా?

ఈ నేల, ఈ గాలి, ఈ నీరుతో కలిసి ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి ఈ ప్రజల కోసమే అవిశ్రాంతంగా పోరాడి రక్త తర్పన చేసి ఈ మట్టిలోనే కలిసి పోయిన మా పోరాట యోధులు దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, బందగీ, షోయబుల్లాఖాన్, కొమురం భీం, వట్టికోట అళ్వారుస్వామీ, సమ్మక్క సారక్క, కాళోజీ లాంటి వారికి మీ తెలుగు జాతి సమైక్యతకు ప్రతిరూపమైన విగ్రహ ప్రతిష్టాపనలో స్థానం ఉండదా?

అయ్యా పాలకులారా! ఆంధ్ర దోపిడీ దొరలారా! తెలుగు జాతి కీర్తిని నిలబెట్టాలంటే మీరు కోరుకునే విగ్రహాలు ప్రకాశం బ్యారేజీపైనే ప్రతిష్టించాక మా హైదరాబాద్ గుండెకాయ మీద కుంపటిలా ఎందుకు నిర్మించినట్టు?

మీరు పెట్టిన విగ్రహాలు కొలువు తీరడానికి నిర్మించిన హుస్సేన్ సాగర్ నిర్మాణానికి రాళ్లు ఎత్తిన బాంచన్‌గాండ్ల కోసం గుండెలు బలిచ్చిన మా కొమరం భీం, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షోయబుల్లాఖాన్ చరిత్రను ఎందుకు గుర్తించలేదని 60 ఏండ్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంటే అది మీకు చీకటి దినం అయితుందా...? మా బతుకుల్లో చీకటి నింపిన దినమేమో పండుగ దినం అయితుందా ...?

తెలంగాణ ప్రజలు ... చాకలి ఐలమ్మ విగ్రహాన్ని బెజవాడ కనకదుర్గ పక్కన పెట్టమని డిమాండ్ చేసిండ్రా ..? అందుకే మరోసారి చెప్పక తప్పదు. అరవై ఏండ్ల అణచివేతను ఆగ్రహంతోనే తెలంగాణ ప్రజలు భరిస్తూ వచ్చారు. వారిని, వారి ఆకాంక్షను, ఆత్మగౌరవ పోరాటాన్ని అవహేళన చేస్తే జరిగే పరిణామాలన్నింటికీ కోస్తాంధ్ర పెట్టుబడిదారులే బాధ్యత వహించాల్సి వుంటుంది. వారికి వత్తాసు పలుకుతున్న కాంగ్రెసు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే మూల్యం చెల్లించాల్సి వుంటుందన్న నగ్న సత్యం గుర్తుంచుకోవాలి.

ఇప్పటికైనా తెలుగు జాతి పరిరక్షకులారా! జాతి ఉద్ధారకుల్లారా! రాజకీయ నాయకుల్లారా!

తెలంగాణ చరిత్రను పునర్లిఖించడానికి, పునర్ ప్రతిష్టించడానికి ప్రజలు పూనుకున్నారు. చరిత్ర గమనాన్ని ఏశక్తి ఆపలేదు. నిజంగా నీతి నిజాయితీ వున్న ఎవరైనా చేతనైతే చేయి వేయాలి. లేక అడ్డు తొలగించాలే తప్ప మరో దారి లేదు. లేదంటే తెలంగాణ ప్రజలు క్షమించరన్న సంగతి తెలుసుకోవాలి.

**- నలమాస కృష్ణ**

తెలంగాణ గళం పత్రిక
మార్చ్, 2011

తెగించి కొట్లాడుదాం ...
తెలంగాణ తెచ్చుకుందాం ....
ఆత్మ బలిదానాలొద్దు ...

**- విజయ్**

# ట్యాంక్‌బండ్‌పై కూలినవి విగ్రహాలే ...
# తెలంగాణలో కూలతున్నవి జీవితాలు

**- శ్రీధరరావు దేశ్‌పాండే**

మార్చి 10న హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చ్‌లో తెలుగు (ఆంధ్ర) తేజోమూర్తుల విగ్రహాలు కూల్చివేతకు గురయినపుడు తెలుగు కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు, మేధావులు, సమైక్య రాష్ట్రాన్ని కోరుకుంటున్న రాజకీయ పార్టీల ప్రముఖులు తీవ్రంగానే స్పందించారు. సంస్కృతీ విధ్వంసం జరిగిపోయిందని, తెలుగు తేజోమూర్తులు తీవ్ర అవమానం పాలయ్యారని, విగ్రహాలను కూల్చిన వారిని తెలుగు తాలిబన్లుగా అభివర్ణిస్తూ ప్రకటనలు వెల్లువెత్తాయి. సీమాంధ్ర పెట్టుబడికి పుట్టిన విష పుత్రికలైన పత్రికలు, టీవీలు మిన్ను, మన్ను ఏకం చేస్తూ శబ్ద కాలుష్యాన్ని వ్యాపింపజేశాయి. నిజమే, విగ్రహాల విధ్వంసం హర్షించవలసిన విషయం కాదు, అయితే సంఘటనను అది జరగడానికి దారితీసిన నేపథ్యాన్నించి విడదీసి చూస్తే అదొక విధ్వంసంగానే కనబడుతుంది. అయితే సంఘటనకు ఒక కార్యాచరణ సంబంధం కలిగిన నేపథ్యం ఉంటుందన్న విషయం సీమాంధ్ర మేధావి వర్గానికి తెలియదని కాదు, అయినా కూడా వీరు అటువంటి శబ్ద కాలుష్యానికి ఒడిగట్టినారంటే వారికి తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల ఎంత తీవ్రమైన వ్యతిరేకత వుందో తెలిసి వస్తుంది.

విగ్రహాల కూల్చివేతకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అటువంటి తీవ్ర భావోద్వేగానికి ఉన్న చారిత్రిక నేపథ్యం ఏమిటి? ఈ అంశాలను ఆ సందర్భంలో సీమాంధ్ర శబ్దకాలుష్యకారులకు వివరించాల్సిన అవసరం వున్నది. మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని మార్చి 10న నిర్వహించబోతున్నామని తెలంగాణ జేఏసీ ఫిబ్రవరిలోనే ప్రకటించింది. శాంతియుతంగా ఆట-పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించింది. ఆ రోజు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్ష రాసే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయని భావించి మొదట ప్రభుత్వాన్ని పరీక్షని వాయిదా వేసుకోమని విజ్ఞప్తి చేసింది.

జేఏసీ ప్రతినిధి బృందం నగర పోలీసు కమీషనర్ శ్రీ ఏకే ఖాన్ గారిని అనుమతి కోరింది. భద్రతా కారణాల రీత్యా మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేనని ఆయన ప్రకటించారు. జేఏసీ ప్రతినిధి బృందం హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి గారిని కలిసి అనుమతి కోసం విజ్ఞప్తి చేసింది. ఆమె పరిశీలిస్తామని చెప్పారే తప్ప అనుమతి ఇప్పించలేకపోయారు. తెలంగాణ హోం మంత్రి నెత్తిన టోపీలు ఉంటాయి. లాఠీలు మాత్రం సీమాంధ్ర ముఖ్యంత్రి చేతుల్లో వుంటాయి. కాబట్టి హోం మంత్రిగారి నిస్సహాయతను తప్పుబట్టాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వలేదు, ఇంటర్ పరీక్షను దృష్టిలో వుంచుకొని జేఏసీ మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు వరకే జరపాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ మార్చి 10న మిలియన్ మార్చ్‌ని జరిపి తీరుతామని ప్రకటించింది. ప్రజలను తరలిరమ్మని పిలుపునిచ్చింది. జనవరి నుంచి జేఏసీ ఇచ్చిన ప్రతి ఉద్యమ కార్యక్రమాన్ని శాంతియుతంగా అపూర్వంగా విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలు మిలియన్ మార్చ్ కోసం హైదరాబాద్ తరలిరావడానికి సమాయత్తం కాసాగారు. ప్రభుత్వం మార్చి 8వ తేదీ నుంచే నిర్బంధాన్ని అమలు చేయడం ప్రారంభించింది. జిల్లా, మండల జేఏసీ నాయకులను అరెస్టు చేసింది. బైండోవర్ కేసులు పెట్టింది. ఆర్టీఏ అధికారుల ద్వారా జేఏసీ కోసం వాహనాలను

సమకూర్చరాదని వాహన యజమానులకు ఆదేశాలు జారీ చేయించింది. జిల్లా సరిహద్దులు, పట్టణ సరిహద్దుల వద్ద బారికేడ్లు నిర్మించి తనిఖీలు చేపట్టింది. అనుమానమున్న ప్రతి వ్యక్తిని నిర్బంధించింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రతీ ఒక్కరిని నిశితంగా పరిశీలించాకే బస్సులు బయలుదేరడానికి అనుమతించారు. మార్చి 9 రాత్రి నుంచే హైదరాబాద్ రావాల్సిన రైళ్లను నిలిపివేశారు. మార్చి 10న తెలంగాణ జిల్లాల నుంచి వచ్చే అన్ని ప్యాసింజర్ రైళ్లను సబర్బన్ రైళ్లను, ఎం.ఎం.టీ.సీ రైళ్లను రైల్వే శాఖ నిలిపివేసింది. ఉదయం 6 గంటల నుంచే ట్యాంక్ బండ్ వెళ్లే అన్ని రోడ్లను మూసివేసి ట్రాఫిక్‌ని మళ్లించారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులను కూడా పోలీసులు ఇబ్బందులకు గురిచేశారు. నగరమంతా 144 సెక్షన్ విధించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎన్నడూ లేని విధంగా పోలీసు క్యాంపులు ఏర్పాటు చేశారు. ముళ్ల కంచెలు పెట్టారు.

ట్యాంక్‌బండ్‌కు 5 కి.మీ.ల పరిధిలో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని పోలీసులు సృష్టించారు. ఇంతటి నిర్బంధంలో కూడా ప్రజలు ట్యాంక్‌బండ్ మీదికి చేరుకోవడానికి దారులు వెతుక్కున్నారు. పోలీసుల బారికేడ్లను, ముళ్లకంచెలను ఛేదించుకొని ఒంటిగంటకల్లా టాంక్‌బండ్ పైకి చేరారు. వేలాది మంది టాంక్‌బండ్ చేరుకునే ప్రయత్నంలో అరెస్టయ్యారు. అట్లా అరెస్టయిన వారిలో జేఏసీ ఛైర్మన్ ప్రొ॥ కోదండరాం సహా టీ.ఆర్.ఎస్., టీ.డీ.పీ., బీ.జే.పీ., సీ.పీ.ఐ, న్యూడెమోక్రసీ, వివిధ పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నారు. జలసౌధ నుంచి పోలీసుల కండ్లు గప్పి ట్యాంక్‌బండ్ బయలుదేరిన ఇంజనీర్ల జేఏసీ బృందం ఖైరతాబాద్, ప్రభుత్వ ముద్రణాలయం, మింట్ కంపౌండ్ వద్ద ఉన్న పోలీసు బారికేడ్లను తప్పించుకొని సెక్రటేరియట్ వద్ద దారిలేక, గత్యంతరం లేక అరెస్టు కావల్సివచ్చింది. ఎదురుగా ట్యాంక్‌బండ్‌పై వేలాది మంది ప్రజలు కనిపిస్తున్నారు. మేం మాత్రం పోలీసు వ్యాన్‌లో గోషామహల్ స్టేడియం తరలించబడినాము. అయినా కూడా వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ట్యాంక్‌బండ్ చేరుకోవడంలో సఫలం అయినారు. అయితే వారికి దిశా నిర్దేశం చేయడానికి, వారిని సంయమనంతో వ్యవహరింప చేయడానికి నాయకులు ఎవరూ లేరు. అందరూ పోలీసు కస్టడీలో ఉన్నారు. అష్టకష్టాలు పడి, పోలీసుల లాఠీ దెబ్బలు తిని, ముళ్ల కంచెలు దాటే క్రమంలో గాయాలపాలై ట్యాంక్‌బండ్ చేరిన వేలాది మంది ఉద్యమ కారులు తీవ్రమైన భావోద్వేగంలో వున్నారు.

ట్యాంక్‌బండ్ మీద నిలబడిన తెలుగు తేజో మూర్తులు సీమాంధ్రుల సాంస్కృతిక ఆధిపత్యానికి చిహ్నాలుగా కనిపిస్తున్నారు. 'ట్యాంక్‌బండ్ మీద విగ్రహాలు మీవి ... హుస్సేన్ సాగర్‌లో శవాలు మావి' అన్న తెలంగాణ కవుల పదాలు వారి మెదళ్లలో పోటెత్తుతున్నాయి. ఇక్కడ మా వైతాళికుల విగ్రహాలు ఏవీ అని వెతుక్కుంటున్నారు. అల్లూరి సీతారామరాజు పక్కన మా కొమురం భీం, మా రాంజీ గోండు ఏడీ? శ్రీశ్రీ పక్కన మా కాళోజి, దాశరథి ఏరీ? మా వట్టికోట అళ్వారుస్వామి ఎక్కడ? అంబేద్కర్ కంటే ముందే హైదరాబాద్ రాజ్యంలో దళిత ప్రజల ఉద్ధరణకు కృషి చేసిన మా భాగ్యరెడ్డి వర్మ ఏడీ? తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అనితర సాధ్యమైన పోరాటాలు చేసిన వీరులు, త్యాగధనులు దొడ్డి కొమురయ్యలు, చాకలి ఐలమ్మలు ఏరీ? డెల్టా భూములకు సాగు నీరందించి అన్నపూర్ణగా మార్చిన కాటన్‌దొర పక్కన మరి తెలంగాణకు సాగు నీటి పథకాలందించిన చిరస్మరణీయుడు నవాబ్ అలీ నవాబ్ జంగ్ ఎక్కడ? కృష్ణా పత్రిక సంపాదకులు మొట్నూరి కృష్ణారావు పక్కన పత్రికా స్వేచ్ఛకోసం ప్రాణాలర్పించిన మా షోయబుల్లాఖాన్ ఎక్కడ? మహానటుడు బళ్లారి రాఘవ పక్కన మా చిందు భాగోత కళాకారిణి చిందు ఎల్లమ్మ ఎక్కడ? బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి ప్రతీకగా ఉన్న బ్రిటీష్ రెసిడెన్సీ మీద దండెత్తిన యోధులు తుర్రేబాజ్‌ఖాన్, హౌల్వీ అల్లావుద్దీన్‌లు ఎక్కడ? ఇట్లా టాంక్‌బండ్ మీద ఉన్న వేలాది మంది ఉద్యమకారుల మెదళ్లను తొలుస్తున్న సందర్భం. కొమురం భీం విగ్రహాన్ని నెలకొల్పడానికి ప్రభుత్వం జీవో జారీ చేసి సంవత్సరం గడిచినా విగ్రహ ప్రతిష్ఠ ఇంకా జరగనేలేదు. వారి ధర్మాగ్రహం సహజంగా సీమాంధ్ర సాంస్కృతిక ఆధిపత్య చిహ్నాలుగా నిలబడి ఉన్న తెలుగు కాదు, ఆంధ్ర తేజో మూర్తుల మీద చూపించక తప్పలేదు. విగ్రహాల కూల్చివేతలోనూ వారి విచక్షణ ఎంతగా పని చేసిందో ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి.

మన్యం ఆదివాసీల హక్కుల కోసం ప్రాణాలొడ్డి పోరాడిన అల్లూరి సీతారామరాజు పాదాల చెంత పూలు పెట్టారు. జాతీయ జెండాను రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు వినమ్రంగా నమస్కరించారు. శ్రీశ్రీ విగ్రహం ఉన్న దిమ్మె శిలాఫలకం తొలించగానే అడ్డంపడి శ్రీశ్రీ అందరివాడు, పేదల పక్షపాతి దరికి రావద్దని ఒక ప్రొఫెసర్ ప్రాధేయపడితే తప్పు తెలుసుకొని శ్రీశ్రీ పాదాల చెంత పూలు పెట్టారు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే పద్యాలు రాసినకవి, తత్వవేత్త వేమన ఇంకా టాంక్‌బండ్‌పై కూర్చోనే వున్నాడు. కులీల అంతస్తులను తిరస్కరించిన శ్రామికుల తత్వవేత్త వీరబ్రహ్మం ట్యాంక్‌బండ్ మీద నిలబడే వున్నాడు. విగ్రహాల కూల్చివేత విచక్షణా రహితంగా జరిగింది కాదని పై సన్నివేశాలు నిరూపిస్తున్నాయి.

ఇక పదేండ్ల ఉద్యమ నేపథ్యాన్ని చెప్పుకోవాలి. 1996లో మొదలైన వర్తమాన తెలంగాణ ఉద్యమం, ఉద్యమానికి ఉన్న ప్రాతిపదికలను స్పష్టంగానే వివరిస్తూ వస్తున్నది. రెండువేల ఏండ్లుగా ఈ ప్రాంతం అనుభవించిన స్వతంత్ర రాజకీయ ప్రతిపత్తి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడంతో అంతరించింది. రాజ్యాధికారం కోల్పోవడంతో తెలంగాణ వనరులపై ఆధిపత్యాన్ని కోల్పోయింది. పాలనా యంత్రాంగంపై ఆధిపత్యం సాధించిన సీమాంధ్రులు తెలంగాణ నీళ్లు, నిధులు, ఉద్యోగాలు కొల్లగొట్టుకుపోయారు. తెలంగాణ ఆంధ్రకు వలసగా మారిపోయింది. తమ వలసాధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికి వలసవాదులు ఎక్కడైనా స్థానిక ప్రజల భాషా సంస్కృతులను పరాయీకరించారు. చరిత్రను కనుమరుగు చేశారు.

ఆంధ్రులు కూడా అదే చేశారు. వనరులపై సంపూర్ణమైన ఆధిపత్యం రావాలన్నా, వనరులని ఈ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి వినియోగించుకోవాలన్నా తెలంగాణ భాషా సంస్కృతుల పరిరక్షణ మరుగునపడిన తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకురావాలన్నా తెలంగాణకు స్వయం పాలన అవసరం. ఈ స్పృహతోనే తెలంగాణ ఉద్యమం ముందుకు సాగింది. ఈ మహా ప్రజా ఉద్యమంలో తెలంగాణ కవులు, రచయితలు, కళాకారులు నిర్మించిన సాంస్కృతికోద్యమం పోషించిన భూమిక విస్మరించలేనిది. పదేండ్లుగా తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం అన్ని వర్గాల ప్రజలలోకి చేరింది. వందలాది కవిత్వ సంకలనాలు ప్రచురితమైనాయి. బతుకమ్మ, బోనాలు, మొహర్రం, హోలీ తదితర తెలంగాణ పండుగలను సాంస్కృతిక రూపాలను తిరిగి రాష్ట్ర సాంస్కృతిక రంగం మీదికి తేగలిగారు. ధూంధాంలు, ఆట-పాటలు తెలంగాణను చుట్టుముట్టాయి. తెలంగాణ చరిత్ర పరిశోధన ముమ్మరమైంది. 1956కు ముందు తెలంగాణ లో కథలు లేవు. పత్రికలు లేవు అన్న వాళ్ళకి జవాబుగా కథల సంపుటాలు వచ్చాయి. సాహిత్య చరిత్రలు వెలువడినాయి. మీకు చరిత్రే లేదన్న వాళ్లతోనే సెప్టెంబర్ 17ను గుర్తించేలాగా చేయగలిగాము. తెలంగాణ వైతాళికులను, సంఘ సంస్కర్తలను విరివిగా ప్రచారంలోకి తీసుకురాగలిగాము. ఈ క్రమంలోనే ట్యాంక్‌బండ్‌పై మా వైతాళికులు ఏరీ? అని ప్రశ్నించాం.

హైదరాబాద్ నగర కూడళ్లలో ఏర్పాటయ్యే విగ్రహాలు ఎవరివి? పార్కులు, స్టేడియాలు, భవనాలు ఎవరి పేర్ల మీద ఉన్నాయి? సీమాంధ్ర నగరాలలో, పట్టణాలలో మా కవుల, కళాకారుల, సంఘ సంస్కర్తల విగ్రహాలు ఒకటైనా చూపించగలరా? అని ప్రశ్నించాం. ఇవాళ విగ్రహాలు కూలినందుకు గగ్గోలు పెడుతున్న ఏబీకేలు, జొన్నావిత్తులు, అవధానులు తదితర శబ్దకాలుష్యకారులు పదేండ్లుగా తెలంగాణ వేస్తున్న ప్రశ్నలను ఎందుకు పట్టించుకోలేదు? సమైక్య రాష్ట్రానికి అన్ని ప్రాతిపదికలను ధ్వంసం చేస్తూ 'కలిసి వుంటే కలదు సుఖం' అంటూ నీతులు చెబుతున్నారు. తెలంగాణ కవుల కవిత్వాన్ని, కళాకారుల పాటల్ని ఈ సమైక్యవాదులు ఏనాడైనా పట్టించుకున్నారా? 2006 మార్చి 15న ఉస్మానియా యూనివర్శిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు హోలీ కోలాటంపై సీమాంధ్ర పోలీసులు దాడి చేస్తే ఈ సమైక్యవాదులు గళాలు, కళాలు ఎందుకు మూసుకున్నారు? తెలంగాణ సాంస్కృతిక హక్కులపై అణచివేతకు పాల్పడుతూ, వివక్షకు గురిచేస్తూ ఉంటే ఉలుకూ పలుకూ లేని వీరు ఇవ్వాళ కూలిన విగ్రహాల దగ్గర కన్నీళ్లు కారుస్తున్నారు. అసలు మొత్తం సాంస్కృతిక జీవనమే విధ్వంసం అవుతుంటే పట్టించుకోని వీరు ఇవ్వాళ విగ్రహాల విధ్వంసం గురించి మాట్లాడటం కపటనాటకం కాదా? తెలంగాణ ఉద్యమం సీమాంధ్ర కవులను, రచయితలను,

మేధావులను ఎప్పుడూ ప్రశ్నిస్తూనే వున్నది – తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల పట్ల మీ వైఖరేమిటని? ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే ఈ ప్రజాస్వామిక వాదుల నుంచి జవాబు లేదు. సీమాంధ్ర దళిత, బీసీ కులాల కవులు స్పందించి 'కావడి కుండలు' పేరిట తెలంగాణ సంఘీభావ కవిత్వాన్ని ప్రచురించారు. అయితే తెలంగాణ ఉద్యమ నేపథ్యంలోంచి కవులుగా, మేధావులుగా ఎదిగిన వాళ్ళు ఇవాళ మౌనాన్నే పాటిస్తున్నారు.

1969లో 370 మంది విద్యార్థులను కాల్చి చంపిన కాసు బ్రహ్మానంద రెడ్డి ఇంకా కూలకుండా నిలబడి ఉన్నాడు. 1986లో ఏర్పాటైన ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు 2011 మార్చి 10 వరకు నిలబడినాయంటే అది తెలంగాణ ప్రజల సహృదయతకు, సహనానికి అందర్నీ ఆదరించే విలక్షణ సంస్కృతికి నిదర్శనం. అవి తెలంగాణలో ఇంకా ఉండేవి కాని పోలీసుల దురుసు ప్రవర్తన, ప్రభుత్వ మొండి వైఖరి కారణంగానే కూల్చివేతకి గురయ్యాయి. దీనికి పూర్తి బాధ్యత పోలీసులది, ప్రభుత్వానిది, అంతకు మించి తెలంగాణ సాంస్కృతికంగా అణచివేతకు, వివక్షకు గురవుతున్నా మౌనం వహించిన సీమాంధ్ర మేధావి వర్గమే బాధ్యత వహించాలి.

ఇప్పటికైనా ఈ కుహనా సంస్కృతీ పరిరక్షకులు శబ్ద కాలుష్యాన్ని ఆపివేసి టాంక్‌బండ్‌పై తెలంగాణ తేజోమూర్తుల విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. మొదట విజయవాడ కృష్ణా నది ఒడ్డున, రాజమండ్రి గోదావరి ఒడ్డున, విశాఖ తీరాలలో మీకు చేతనైతే, సహృదయత ఉంటే తెలంగాణ వైతాళికుల బొమ్మలు ప్రతిష్టించాలి. లేని పక్షంలో అక్కడ ఎవరి విగ్రహాలు ఉండాలో తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు నిర్ణయిస్తారు. కూలినవి విగ్రహాలే. జీవితాలు కావు. తెలంగాణలో జీవితాలు కూలుతున్నాయి. కూలుతున్న జీవితాలు కాకుండా మీరేమైనా చెయ్యగలరేమో ఆలోచించండి.

మిత్రులారా!

మనం రాష్ట్రాలుగా విడిపోదాం. కావడి బద్దలాగా కలిసి ఉందాం.

**– శ్రీధరరావు దేశ్‌పాండే**

విరుగుడు పుస్తకం నుంచి

ఆత్మాభిమానాన్ని
స్వయం నిర్ణయాధికారాన్ని
తెలంగాణ మా జన్మహక్కుని
నినదించే స్పేచ్ఛను
నిర్భందించినందుకు..
నిగ్రహం కోల్పోయినం వాళ్లు...
విగ్రహాల్ని కూల్చడం నేరమేం కాదు!

**– సహచరి**

# ట్యాంక్‌బండ్ విగ్రహారాధన

## కోస్తాంధ్ర నయా సంపన్న వర్గాలు అల్లిన కట్టుకథే "తెలుగు జాతి"

**– ప్రొ॥ కె. శ్రీనివాసులు**

రాజనీతి శాస్త్ర విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ క్రమంలో భాగంగా విద్యార్థులు, ఉద్యోగులు, లాయర్లు, కళాకారులు, ఇతర ప్రజా ఉద్యమాలు చేపట్టిన 'మిలియన్ మార్చ్' వేదిక. అరెస్టులు, అణచివేతలు, నిర్బంధాలు ఎదుర్కొని ఉద్యమకారులు ట్యాంక్‌బండ్ చేరుకున్నారు. డిసెంబర్ 2009న పార్లమెంటు ఉభయ సభల్లో తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసి ఏర్పాటుకు జాప్యం చేయడం వారి ఆగ్రహంలో ప్రతిఫలించింది.

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలను కలిపే చారిత్రక ట్యాంక్ బండ్‌ను హుస్సేన్ సాగర్‌పై 16వ శతాబ్దికి చెందిన కుతుబ్‌షాహీలు నిర్మించారు. ఏటా గణేష నిమజ్జనం ఇక్కడ జరుగుతుంది. కానీ ఈ సారి ఆగ్రహోదగ్రులైన తెలంగాణ వాదులు ట్యాంక్‌బండ్‌పై వున్న విగ్రహాలలోనే కొన్ని విధ్వంసం చేసి మూసీ జలాలలో విసిరి పారేశారు. అధిక సంఖ్యలో అక్కడ వున్న పోలీసులు ప్రేక్షకులయ్యారు.

### విగ్రహారాధన రాజకీయాలు

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రతిఫలించేందుకు తెలుగు సాంఘిక సంస్కర్తలు సాహితీ మూర్తులు, సాంస్కృతిక నాయకుల విగ్రహాలు ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని 1980వ దశకంలో రాజకీయ నాయకునిగా మారిన సినీ నటుడు ఎన్.టి. రామారావు నిర్ణయించారు. కేంద్రం, కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాల్లో భాగంగా తెలుగు దేశం పాలన 'తెలుగు జాతి ఆత్మగౌరవం' నినాదాన్ని పదే పదే వల్లెవేసింది. విగ్రహాల ఏర్పాటు ట్యాంక్‌బండ్‌కు ప్రమాదమన్న ఇంజనీర్ల మాట పెడచెవి పెట్టి రామారావు విగ్రహాలను అక్కడ మూర్తులను కలిపి తెలుగు సంస్కృతి ఆవిష్కరించారు. కొన్ని తెలంగాణ, రాయలసీమ ప్రముఖుల విగ్రహాలు వున్నప్పటికీ ఆ విగ్రహాల్లో అత్యధికం కోస్తాంధ్రవారివి కావడం యాధృచ్ఛికం కాదు.

కాలము, సంప్రదాయం, దృక్పథాల పరంగా వేర్వేరుగా వున్న అనేక సాంస్కృతిక, సాంఘిక మూర్తులను కలిపి తెలుగు సంస్కృతి అవిచ్ఛిన్నమైనది, ఏకీకృతమైనదనే భావన కల్పించేందుకు రామారావు పాలన ప్రయత్నించింది. ఉదాహరణకు కవిత్రయంగా పేరొందిన నన్నయ, తిక్కన, ఎర్రనలు 11-14 శతాబ్దాల కాలంలో భారతాన్ని సంస్కృతీకరించబడ్డ తెలుగులోకి అనువదించినవారు. ప్రజల భాషలో కుల వ్యతిరేక భావాలను ఆటవెలదిలో చెప్పిన యోగి వేమన. వీరి విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై వున్నాయి. అదే విధంగా బ్రిటీషు వలస ప్రభుత్వ వ్యవసాయ రెవెన్యూను ఆంధ్రలో పెంచేందుకు 19వ శతాబ్దంలో కృష్ణా, గోదావరి నదులపై ఆనకట్టలు కట్టిన ఆర్థర్ కాటన్, సంస్కరణ ఉద్యమాన్ని ఆధునిక సాంఘిక దృక్పథంతో నడిపిన వీరేశ లింగంలతో ఎపాటు, 20వ శతాబ్దానికి చెందిన దళిత, విప్లవ కవులు గుర్రం జాషువా, శ్రీశ్రీల విగ్రహాలూ ట్యాంక్‌బండ్‌పై వున్నాయి. ఇలా మధ్యయుగం నుంచీ 20వ శతాబ్దం వరకు వివిధ దృక్పథాలు, భావజాలాలు వున్న వ్యక్తుల విగ్రహాలు ఒకే చోట ప్రతిష్టించి తెలుగు సంస్కృతీ వికాసం అవిచ్ఛిన్నమైనదనే భావన కల్పించి తమ పాలనక ఒక సమర్థనాయత తెచ్చుకోవాలని ఆనాటి ప్రభుత్వ పాలనాకర్తలు భావించారు.

దాదాపు వెయ్యేళ్ల తెలుగు వైభవాన్ని కృత్రిమంగా సృష్టించినప్పటికీ 1983లో తెలుగుదేశం ఘన విజయం సాధించి అధికారంలోకి రావడంతో అప్పట్లో పెద్దగా ఎవరూ ప్రతి ఘటించలేదు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం రామారావును పోలినట్లే కొన్ని విగ్రహాల మూర్తులను తయారు చేశారని కూడా ఒక జోన్ ప్రచారంలో వుండేది.

తమ నాయకుని 'మహోన్నత కృషిని' ధ్వంసం చేశారని తెలుగు దేశం వారు ఆవేదన చెందడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే మీడియా లైట్లు, బైట్ల కోసం అనేకులు గుమికూడారు. తెలుగువారి ఆత్మగౌరవం దెబ్బతిందని వీరు వాదించారు. ఈ విగ్రహాల ఏర్పాటులో రాజకీయాలు లేవని ఇదొక సాంస్కృతిక కార్యక్రమమనీ వారు చెప్పారు. నిజానికి వలసవాద ఆధునికతతో భాగంగా కోస్తా ప్రాంతంలో పుట్టుకొచ్చిన నయాధనిక కులవర్గం తమ అధికారాన్ని స్థిరం చేసుకునేందుకు ఎన్టీయార్ పాలన ద్వారా తీవ్ర రాజకీయాలు కొనసాగించేందుకే ఈ ప్రయత్నం జరిగింది. తమ పరిపాలనకు సమర్థనీయత తెచ్చుకొనేందుకు ఈ వర్గం చారిత్రకంగా అన్ని చోట్లా జరిగినట్టే తమ ఆధిక్యతను కొనసాగించేందుకు సాంస్కృతిక జాతీయవాద భాషను తెగ వల్లెవేసింది. చారిత్రక ప్రసిద్ధి గాంచిన వ్యక్తులను వారి ప్రత్యేకతలు, భావజాలాల నుంచి విడదీసి విగ్రహీకరించి మ్యూజియంలో వుంచి ఆరాధనను సాగించడమే సాంస్కృతిక జాతీయవాద భాషను తెగ వల్లెవేసింది. చారిత్రక ప్రసిద్ధి గాంచిన వ్యక్తులను వారి ప్రత్యేకతలు, భావజాలాల నుంచి విడదీసి విగ్రహీకరించి మ్యూజియంలో వుంచి ఆరాధనను సాగించడమే సాంస్కృతిక జాతీయవాదం. ఎన్టీఆర్ ప్రభుత్వం ఇదే చేసింది. విభిన్న ప్రత్యేకతలు, పరస్పర విరుద్ధ మూర్తులన రిఉట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించి దానికి "తెలుగు వెలుగుల మూర్తి నిక్షిప్త కళా ప్రాంగణం" అని పేరు పెట్టి ఈ చర్యను "తెలుగు జాతి మహోన్నత గతానికి, ప్రస్తుత స్ఫూర్తికి, భవిష్యత్ గమనానికి ప్రతీక"గా అభివర్ణించింది. స్ఫూర్తినిచ్చే ఈ విగ్రహ మూర్తులు "మన ఆలోచనలు పరిశుద్ధం చేయడానికీ", "కుల, వర్గ, మత విభేదాలు లేని సమాజం" ఏర్పడేందుకు కృషి సలుపుతాయనీ ప్రకటించారు. ఇటువంటి ఆంధ్ర ఆధునిక జాతీయవాద దృక్పథాన్ని కొంత మంది నిరసించినప్పటికీ, రామారావు ఎన్నికల విజయంలో అవి వినబడలేదు. పైపెచ్చు కోస్తాంధ్ర ఏలుబడిలో వున్న మీడియా ఈ నిరసనలను పైకి పొక్కనివ్వలేదు.

## అల్లిన కట్టుకథ 'తెలుగు జాతి'

కోస్తాంధ్ర సాంస్కృతి, సాంఘిక చరిత్రను సాధారణీకరించి మొత్తం తెలుగు వారి చరిత్రగా, కోస్తాంధ్ర సాంస్కృతిక మూర్తులను మొత్తం తెలుగు సంస్కృతి ప్రతీకలుగా, ప్రతినిధులుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని అర్థం చేసుకోవాలి. తెలుగు నాగరికత పేరుతో ప్రజాకర్షక సాంస్కృతి రాజకీయాలను ముందుకు తీసుకువచ్చిన ఎన్టీఆర్ పాలనలో ఎంతో అనాగరికత కూడా వుంది. ఎందుకంటే ఉర్దూభాష, ఇస్లామిక్ సంస్కృతితో ప్రభావానికి గురైన తెలంగాణ ఏకీకృత సాంస్కృతిక నిర్మాణపు ప్రత్యేకతను ఎన్టీఆర్ సాంస్కృతిక రాజకీయాలు తుడిచి పెట్టాయి. అంతేగాక కోస్తాంధ్ర సమాజం చరిత్రలలోని అంతర్గత వైవిధ్యం, వైరుధ్యాలను కప్పిపెట్టి అతనికి కావలసిన నిజమైన రాజకీయుల ప్రయోజనాలు నెరవేర్చాయి. తెలుగుజాతి భావనను పదే పదే చెబుతూ ఇతర సంస్కృతులను తుడిచి పెట్టే లేదా ఇముడ్చుకునే వ్యూహాన్ని ఎన్టీఆర్ అమలు చేయగలిగారు. ఆ రకమైన సాంస్కృతిక రాజకీయాల తర్కబద్ధ పరిణామాలనే ఇపుడు మనం తెలంగాణ ఉద్యమంలో చూస్తున్నాం.

ఎన్టీఆర్ వచ్చిన తరువాత తెలంగాణ ఆర్థిక రాజకీయ రంగాలు ఆధునికత ప్రభావానికి బలైపోగా తెలంగాణ సాంస్కృతిక నిర్మాణం (అటు మౌఖిక జానపద రూపం, ఇటు లిఖిత పూర్వ రూపం) మాత్రం ఆ ఆధునికతను ఎంతగానో ప్రతిఘటించింది. తెలంగాణలో వ్యవసాయక సంక్షోభాన్ని గోరటి వెంకన్న "పల్లె కన్నీరు పెడుతుందో" పాట చిత్రీకరించింది. ఈ పాటలో చెప్పిన "కనిపించని కుట్ర" టీడీపీ పాలన రాజకీయాలే. మామ ప్రారంభించిన పనిని అల్లుడు పూర్తి చేశాడు.

ఈ నేపథ్యం నుంచే ట్యాంక్ బండ్ ఘటనను మనం విశ్లేషించాలి. నిజానికి ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్టించిన సాంస్కృతిక మూర్తులకు గౌరవం కలిగించే ఏ పనీ ఎన్టీఆర్ టీడీపీ కానీ చంద్రబాబు పాలనా రాజకీయాలు కానీ ఏ ఒక్కటీ చేయలేదు. నిజానికి 1970 నుంచి తెలుగు సినామాల్లో ఎన్టీఆర్ తెలుగు సంస్కృతి గురించి ఊదరకొడుతూనే వున్నాడు. కమ్మకుల పునాదిగా వున్న టీడీపీ హయాం పదిరికుప్పం, కారం చేడులలో దళితులపై దాడులు చేసిన సంఘటనలు ఇంకా మన స్మృతుల్లో సజీవంగానే వున్నాయి. అదే విధంగా పౌరహక్కులను క్రూరంగా అణచివేసిన ఆ పాలన ట్యాంకుబండ్ విగ్రహమూర్తులు జీవితాన్ని, రచనలను ఎంతగానో అవహేళన చేసింది.

ఇక చంద్రబాబు పాలన గూర్చి ఎంత తక్కువగా చెబితే అంత మంచిది. ఎన్.టి.ఆర్. పాలన ప్రారంభించిన కర్తవ్యాన్ని చంద్రబాబు పూర్తి చేశాడు. చంద్రబాబు తన రాజకీయాలు, విధానాల ద్వారా సాంఘిక, సాంస్కృతిక జీవనాలను డొల్ల చేయడమే గాక మున్నెన్నడూ లేని విధంగా గ్రామీణ సంక్షోభాన్ని సృష్టించాడు. నిజానికి చారిత్రక స్మృతులను, ప్రజల సామూఇక స్మృతి చిత్రాలను ధ్వంసం చేసిన చిరత్ర గురించి చెప్పదలచుకుంటే నాయుడు అనాగరిక పాలనే అందులో ముందుంటుంది. ట్యాంక్‌బండ్ విగ్రహ విధ్వంసం గురించి మొసలి కన్నీరు కార్చిన ఈ స్వయం ప్రకటిత మాజీ ఆంధ్రా సీఈఓ తన పాలనలో 'నక్సలైటు ఉద్యమం' బూచిగా చూపి ప్రజా హీరోల స్మృతి చిహ్నాలను ఒకపక్క తుడిచి పెట్టి, మరోవైపు హైదరాబాదును గ్లోబల్ సిటీగా చేసే పేరుతో ఇక్కడి సామూహిక చారిత్రక స్మృతులను నాశనం చేశాడు. నిశిత సామర్థ్యం కలిగిన దేన్నైనా నాశనం చేస్తూ టూరిజమే గొప్పని చెబుతూ చరిత్రను ధ్వంసించాడు. సామాజిక శాస్త్రాలు అనవసరమని, వ్యర్థమని చెప్పిన వ్యక్తీ ఇతడే.

చంద్రబాబు ఒకవైపు తన రాజకీయార్థిక విధానాల ద్వారా గ్రామీణ ప్రాంత వృత్తి జీవనాలను ధ్వంసం చేస్తూ మరోవైపు తన కలల పంట హైటెక్ సిటీ వద్ద శిల్పారామం పెట్టి అందులో చేతి వృత్తుల హస్త కళలను ప్రదర్శించి విసిగెత్తిన పట్టణ వాసులను ఉల్లాసపరచే ప్రయత్నం చేశాడు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ సాంఘిక జీవితాన్ని సర్వనాశనం చేసి రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల ఆకలి చావులకు ప్రత్యక్ష కారకుడయ్యాడు. ఇది రాష్ట్ర చరిత్రలో మున్నెన్నడూ లేని విధ్వంస చరిత్ర.

## మిలియన్ మార్చ్ – తెలంగాణ అస్తిత్వ స్పందన

ట్యాంక్‌బండ్ విగ్రహాలపై దాడి, కేవలం అవి కోస్తాంధ్ర ప్రపాంతం వారివనే చెప్పేందుకు వీలులేదు. అందుకు ఇంకా లోతైన కారణాలు వెతకాలి. తెలంగాణ గుండెగా చెప్పే హైదరాబాద్‌లో కొనసాగుతున్న తెలంగాణ సాంస్కృతిక చరిత్ర ప్రతినిధులు" తెలగాణ సాంస్కృతిక వలసీకరణ క్రమంలో భాగంగా అయిపోయారు. అందువల్ల ఈ విధ్వంసం కోస్తాంధ్రలోని ఉన్నత వర్గ కుల వలస వాద పాలనకు ప్రతిస్పందనగానే మనం గమనించాలి. విధ్వంసానికి గురైన విగ్రహ మహనీయుల పేర్లు తెలంగాణలో అత్యధికులకు అసలు తెలియనే తెలియదు.

స్మృతి చిహ్నాలు విజయానికి గుర్తులు. తన ఎన్నికల విజయం ఢిల్లీ దర్బారుపై తెలుగు ఆత్మగౌరవ విజయమని ఎన్.టి.ఆర్. భావించాడు. అందుకే ట్యాంక్ బండ్‌పై తెలుగుతేజం ఎన్.టి.ఆర్. రూపంలో విగ్రహాలయ్యాయి. ఆయా కవుల సంస్కర్తల భావ ప్రచారం కంటే ఎన్టీఆర్ రూపంలోని విగ్రహాలే శాశ్వతమవ్వాలని భావించాడు. తెలంగాణ సంస్కృతి, అస్తిత్వాన్ని తుడిచిపెట్టే ప్రయత్నాన్ని చరిత్రకారులు ఇంకా గ్రంథస్తం చేయవలసీ వుంది. ప్రస్తుత తెలంగాణ ఉద్యమంలో కవుల, కళాకారుల రచనలను సంకలనం చేస్తూ సాంస్కృతిక పరిరక్షణ చేసే క్రమం మొదలైంది.

హింస, విధ్వంసం ఎంతగా మనం కోరుకోకపోయినా అవీ రాజకీయాలే. అన్ని రకాల విధ్వంసాన్ని నేరంగా భావించడం అన్యాయం, అనైతికం, చరిత్రను వంచించడం అవుతుంది. మిలన్ కుందేరా మాటల్లో చెప్పాలంటే "నేరస్తుడు ఒక సంప్రదాయ వాది. అతను ప్రస్తుత వ్యవస్థకు లోబడి నేరం చేస్తాడు. కానీ ఒక తిరుగుబాటుదారుడు ప్రస్తుత వ్యవస్థను మార్చేందుకు పోరాడతాడు. అన్ని హింసా చర్యలూ నేరాలు కావు. అందుకు కారణమైన నేపథ్యం,

పరిస్థితులు, సారం, లక్ష్యం, రాజకీయాలు ... ఇవన్నీ ఆ చర్య స్వభావాన్ని వివరిస్తాయి. రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలు, సంస్కృతి ప్రవేశపెట్టిన కోస్తాంధ్ర నయా సంపన్న వర్గాల చేతులతో ప్రతిష్టించబడటం ట్యాంక్‌బండ్‌పైన వున్న విగ్రహమూర్తుల దురదృష్టం. అవినీతి ధనంలో కూరుకుపోయిన రాజకీయాలు, సెక్స్, వయొలెన్స్‌తో పుచ్చిపోయిన తెలుగు సినిమా, సెన్సేషన్‌కు రేటింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే మీడియా, రోజు రోజుకూ బయటపడుతున్న కుంభకోణాలు, రాజకీయాల అనైతిక ప్రవర్తన, సారంలేని ప్రజా చర్చలు ఇందుకు ఉదాహరణలు. అందువల్లే ఈ నయాధనిక వర్గం ప్రజల విశ్వాసాన్ని, వారి గౌరవాన్ని కోల్పోయింది. ఈ వర్గ వంచన, ద్వంద్వ ప్రమాణాల కారణంగా తెలంగాణ యువత నిరాశ చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

విగ్రహ విధ్వంసాన్ని ఎవరెలా చూసినా, అది టి.డి.పి., కాంగ్రెస్‌లు పెంచి పోషించిన అనైతిక రాజకీయాలు, సంవత్సర కాలం తెలంగాణ ఏర్పాటు తాత్సారం పట్ల తెలంగాణ ప్రజల నిరసన, తిరుగుబాటు చర్యగానే మనం పరిగణించాలి. ప్రస్తుత వ్యవస్థకు వ్యతిరేకంగా నూతన మార్పుకోసం ఈ చర్యను ప్రతీకగా గమనించాలి. అందుకే మొదట్లో తెలంగాణ సాంస్కృతిక, మేధో నాయకత్వం తటపటాయించినా తదుపరి ఈ చర్యను సమర్థించింది.

## ఏం చేయాలి?

నైతిక ఆక్రందన వెల్లువ ప్రతి స్పందనగా విగ్రహాల పునఃప్రతిష్టకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల్లో దీనికంత ప్రాధాన్యత లేదు. ఈ విగ్రహ మూర్తుల సాంస్కృతిక ప్రభావం తెలంగాణలో లేనేలేదు. విగ్రహ మూర్తుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నామన్న వారు ముసుగులో సాగించిన విధ్వంసాన్నే తెలంగాణవాదులు ముసుకు తొలగించి చూపించారు. బలవంతంగా మరలా విగ్రహ మూర్తులను ప్రతిష్టిస్తే అది ఆ మహనీయుల స్మృతికే అవమానకరం. ఒకవైపు అసెంబ్లీలో అందరూ విగ్రహాలను పునఃప్రతిష్టించాలని డిమాండ్ చేస్తుంటే విగ్రహాల ప్రతిష్టకు ముందున్న ట్యాంక్‌బండ్ కావాలని మజ్లిస్ శాసనసభా నాయకుడు కోరారు.

తెలంగాణ ప్రజల మనస్సుకయిన గాయాన్ని మాన్పడం ఇప్పటి తక్షణ కర్తవ్యం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను తిరిగి వెంటనే ప్రారంభించడమే ఇందుకు ఏకైక మార్గం. ఇప్పటికే ప్రజల సామూహిక ఆకాంక్షను రాజకీయ వర్గం కావాలనే వంచించింది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో కొంత మంది విజ్ఞులు చెప్పినట్టు మహనీయుల భావజాలాన్ని గౌరవించి ఆచరించడమే వారికి నిజమైన నివాళి. విగ్రహాల ఏర్పాటుకు కేటాయించిన ధనాన్ని వారి రచనల ప్రచురణకు, పంపిణీకి వినియోగించడం ఎంతైనా మంచిది. అదే వారి భావజాల వారసత్వాన్ని గౌరవించే చర్య.

విగ్రహాలు ఉద్వేగాలు పెంపొందించి విధ్వంసానికి దారి తీయగలవు. ఇందుకు భిన్నంగా భావాలు చక్కని ఆలోచనలు పెంపొందింపజేస్తాయి. అందుకే కాబోలు పాలకులు విగ్రహారాధనను ప్రోత్సహిస్తారు.

*తెలుగు అనువాదం :* **హర్ష**

బహుజన కెరటాలు
మే, 2011

# విగ్రహాల కూల్చివేతను ఎలా అర్థం చేసుకోవాలి?

**– లోకె రాజ్‌పవన్**

టాంక్ బండ్‌పై విగ్రహాల కూల్చివేత తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పెద్ద చర్చకే దారితీసింది. ఆ సంఘటనను ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియక అనేకమంది తమకు తోచిన విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అయితే ప్రతి సంఘటనను, సమస్యను అర్థం చేసుకోవడానికి ఒక శాస్త్రీయ అవగాహనా విధానం ఉన్నట్లుగానే, విగ్రహాల కూల్చివేత (సంపూర్ణంగా లేదా పాక్షికంగా)ను అర్థం చేసుకునేందుకు కూడా ఒక శాస్త్రీయ ఆలోచనావిధానం ఉంటుంది. విగ్రహాలపై సమైక్య రాష్ట్రంలోని మూడు ప్రధాన ప్రాంతాలలో తీవ్ర స్థాయి చర్చ జరుగుతున్న ఈ నేపథ్యంలో ఆ సంఘటనను శాస్త్రీయ నేపథ్యంలో విశ్లేషించుకోవలసిన అవసరముంది. మంచి చెడులను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగడం అవసరం.

విగ్రహాల ధ్వంసం గురించి జరిగే చర్చకు ప్రధాన ప్రాతిపదిక అంశం– అసలు విగ్రహాలు అవసరమా? లేదా? అనేది అవి ఏ విగ్రహాలైనాన కావచ్చు. దేవుళ్లవైనాన మనుషులవైనా... విగ్రహాల ప్రతిష్టాపన మొదలుకొని, వాటికి స్థలాల కేటాయింపు చేయడం, వాటిలో గొడవలు, రాజకీయాలు తదితరమైన నిత్య ప్రవాసనాలు జరుగుతున్న నేటి ఆధునిక సమాజాలలో ఈ ప్రశ్న బహుశ చాలామందికి నవ్వు తెల్పించేదిగా ఉంటుందేమో! కానీ లోతుల్లోకి ఆలోచిస్త ఈ ప్రశ్న తరతరాల సాంస్కృతిక వ్యవస్థలలోని మూడలాలను బట్టబయలు చేస్తుంది. ఏ వారసత్వాన్నైతే వేలాది సంవత్సరాలుగా కోట్లాది మంది కొనసాగించుకుంటూ వస్తున్నారో వాటి అసలు స్వరూపాన్ని బహిర్గతం చేస్తుంది. జ్ఞానానికి, ఆచార వ్యవహారాలకు ఉన్న విలోమ సంబంధాన్ని తెలియజేస్తుంది.

మొదటగా పై ప్రశ్నకు సమాధాం విగ్రహ వ్యవస్థ, విగ్రహారాధనలు పూర్తిగా తిరోగమన చర్యలు. మధ్యయుగాల, ప్రాచీనయుగాల నాటి అంధ విశ్వాసాలకు, మూఢ జ్ఞానానికి అవి ప్రతీకలైన విధానాలు. వ్యక్తిపూజకు ఉన్నతదశగా, వ్యక్తి భజనపరుల బానిసతత్వాలకు అవి పరాకాష్టగా ఆధునిక కాలంలోను విలసిల్లుతున్నాయి. ట్యాంక్‌బండ్‌పైన నల్లని రాతి విగ్రహాలైనా, ఆమెరికాలోని మంచు విగ్రహాలైనా.. అవి ఆయా సమాజాలలోని ప్రజల, పాలకుల అశాస్త్రీయ, మూఢభక్తికి చిహ్నాలు. అదిమ సమాజాలలో లేని ఈ విగ్రహారాధన ఎప్పుడు ప్రారంభమైందనే సమాచారం ఇదమిద్దంగా లేకపోయిననూ సింధూ నాగరికత కాలం నుండి కొనసాగుతూనే వస్తుంది. భక్తి, ఇష్టాలకు అత్యున్నత రూపంగా విగ్రహాల ఏర్పాటు, పూజలు జరిగేవి. మొదట దేవుళ్లకే పరిమితమైన ఈ విగ్రహాలను, తర్వాత కాలాల్లో దేవుళ్ళ అంగాలకు (ఉదా॥ శివలింగం), తర్వాత మరణించిన వారికి, తర్వాత జీవించి ఉన్న రాజులకు కూడా నెలకొల్పడం ప్రారంభించారు. దూరంగా ఉన్న బతికున్న రాజుల, గురువుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. అజ్ఞానంతో, శాస్త్రీయ జ్ఞానం వృద్ధి చెందిన ఆనాటి సమాజాలలో విగ్రహాల ఏర్పాటును అర్థం చేసుకోచవచ్చు. కానీ సైన్స్ వృద్ధి చెంది, సరైన చైతన్యాన్ని గూర్చి ప్రచారం జరుగుతున్నా కూడా విగ్రహారాధనను కొనసాగిస్తూ నేటి ఆధునిక శాస్త్రీయ సమాజంలో కూడా అలాగే ఉంటే అది మూఢత్వమే తప్ప మరొకటి కాదు. విగ్రహారాధనను వ్యతిరేకించిన భక్తి వుద్యమం వెలసిన మధ్యయుగాల నాటి చైతన్యం కూడా నేడు లేకపోవడమే బాధాకరం. విగ్రహాల ఏర్పాటుకు 'మహిమలు, శక్తులు కలిగి ఉండటం' అనేది ఏ కోశాన

సమర్థించుకోవడానికైనా పనికివస్తుందేమో గానీ కళ్ల ముందు చనిపోయన మనుషులకు విగ్రహాల ఏర్పాటు అనేది ఏ కోశాన సమర్థించుకోలేని చర్య, విగ్రహాలను చూడటం వల్ల వారి గొప్పతనాలు తెలుస్తాయని ఎవరైనా అంటే అది కూడా తప్పుడు వాదనే. గాంధీ విగ్రహాలు అరవై ఏళ్లలో దాదాపు ప్రతి ఊరిలో వెలిశాయి. మరి ఎందరు గాంధీ మార్గంలో వెళ్లారు? పోనీ ఎందరు గాంధీ సిద్ధాంతాలను చదివారు? గాంధీ చెప్పిన 'సాత్విక నిరోధ సిద్ధాంతం .... గురించి ఎందరికి చూసి కనీసం చదవనైనా చదవాలి కదా! కనుక విగ్రహాల స్థాపనకు, దానికి సంబంధం లేదు. కనుక విగ్రహాలు అవసరమా? లేదా? అనే ప్రశ్నకు విగ్రహాలు అవసరం అనేది సరైన సమాధానం విగ్రహారాధన అనేది ఒక అశాస్త్రీయమైన పని కనుక విగ్రహాలను ప్రతిష్టంచడం కూడ పూర్తిగా ఒక తప్పుడు పని అవుతుంది.

కానీ విగ్రహాలు అనవసరం అనే సరైన జ్ఞానం ఈనాడు చాలా మంది ప్రజలకు లేదు. అదిమ సమాజాల నుండి నేటి వరకు వివిధ చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాలను శాస్త్రీయంగా పరిశీలించకపోతే విగ్రహారాధన సరైనదిగానే కనబడుతుంది. కనుక శాస్త్రీయ జ్ఞానం కలిగే వరకు ప్రజలు విగ్రహాలు వుండాలనే కోరుకుంటారు. కనుక పై ప్రశ్నకు వారి నుంచి 'విగ్రహాలు అవసరమే' అనే సమాధానమే వస్తుంది.. ఇక ఈ కోణంలోనే సంఘటనను ఒకసారి పరిశీలిద్దాం. అంటే విగ్రహాలు అవసరమే అయినప్పుడు ట్యాంక్‌బండ్ పై విగ్రహాల కూల్చివేతను ఎలా అర్థం చేసుకోవాలి?

విగ్రహాలు ప్రతిష్టించడం సరైన చర్యే అనే అభిప్రాయం ఉన్నవారిలో కూడా మళ్ళీ రెండు రకాల వారుంటారు. మొదటి రకంవారు వీరి ప్రకారం విగ్రహాలు అనేవి అయా వ్యక్తులు సమాజానికి, ప్రజలకు అందించిన కంట్రిబ్యూషన్‌కు, వారి కృషికి, సేవలకు ప్రతీకలు. వైతాళికులుగా, చిరస్మరణీయులుగా వారి జీవితాలను సామాన్య ప్రజానీకానికి ఆదర్శంగా ఉంచేందుకు గాను వారి జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా చేయటం, వారి విగ్రహాలను ఏర్పాటు చేయటం లాంటివి చేయాలని వీరు భావిస్తారు. వీరి దృష్టిలో విగ్రహాలు అంటే కేవలం రాతి కట్టడాలు కాదు. ఆయా వ్యక్తుల ఆదర్శాలకు, త్యాగాలకు అవి చిహ్నాలు వీరు ప్రతీకవాదుల. వీరు దేవతల విగ్రహాలకు కూడా ఆయ వేవతల ఒకానొకా మొక్కులకు ప్రతీకలుగా చూస్తారు. ఇక రెండవ రకం వారు విగ్రహాల ఏర్పాటు అనేది ఒకానొక మొక్కుబడి చర్యగా వీరు భావిస్తారు. చనిపోయిన వారికి, గొప్పపనులు చసినవారికి విగ్రహాలు పెట్టడం అనేది సాధారణంగా జరిగేదే. కనుక వాటికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు. అయితే వాటిని సమాన ప్రాతిపదికన ఏర్పరచాలని వీరి భావన. వీరు యాంత్రిక వాదులు. ఈ రెండు కోణాల నుంచీ టాంక్‌బండ్ విగ్రహాల కూల్చివేతను పరిశీలించారు.

మొదటిరకం వారు కూల్చబడ్డ విగ్రహాలను ఆయా వ్యక్తులకు ప్రతీకలుగా చూస్తున్నారు. శ్రీశ్రీ విగ్రహాన్ని కూల్చడ మంటే శ్రామికప్రజల పక్షపాతి ఆదర్శాలను కూల్చడమేనని భావిస్తున్నారు. జాషువా విగ్రహాన్ని కూల్చడమంటే దళితుల అభ్యున్నతిని, గురజాడ విగ్రహాన్ని కూల్చడమంటే అభ్యుదయ వికాసాన్ని కూల్చడమేనని వీర అభిప్రాయం. అయితే ఈ వర్గం వారి ఆలోచనలలో ప్రాథమికంగానే పూర్తి లోపాలున్నాయి. అసలు శ్రీశ్రీ, జాషువా లాంటి కలవుల కృషిని త్యాగాలను కేవలం విగ్రహా స్థాయికి కుదించటం ఎంతవరకు సరైన చర్య? ఆ మహోన్నత వ్యక్తుల త్యాగాలకు ఒక రాతి బొమ్మ ప్రతీక కాగలదా? రాతి బొమ్మను కూల్చడం, ప్రతిష్టించడం అనే చర్యల మీదే వారి వ్యక్తిత్వాల, ఔన్నత్యాల అస్తిత్వం ఆధారపడి వుంటుందా? వారి సేవల మ్యూలాంకనం విగ్రహాల ప్రాతిపదికన జరగాలా? ఎంత సిగ్గుచేటైన విషయం? విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలాభిషేకాలు చేస్తేనే వారిని గౌరవించినట్లని భావిస్తే రోజూ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ విగ్రహాల మీద పక్షులు రెట్టలు వేస్తూ, నచ్చని వారి కోపాలకు చెప్పుల దండలు మెడలో పడుతూ, శరీరంలోని రాతి అవయవాలు విరిగిపోతూ ఉంటే ఆ ఆదర్శమూర్తులు నిరంతరం అవమానించబడుతున్నట్లు కూడా భావించాల్సి ఉంటుంది. కదా! ప్రతీకవాదులు ఎప్పుడైన ఈవిషయాన్ని ఆలోచించారా? శ్రీశ్రీ విగ్రహం పెట్టనంత మాత్రానో, కూల్చినంత మాత్రానో, "పొలాలనన్నీ, హలాలదున్నీ ఇలా

తలంలో హేమం పండగ, జగానికంతా సౌఖ్యం నిండగ, కర్షక వీరుల కాయం నిండా కాలువకట్టే ఘర్మ జలానికి కరీదు లేదోయ్" అంటూ శ్రామిక శ్రమను చాటిచెప్పిన ఆయన నిజాయితి తగ్గిపోతుందా? "వాని రెక్కల కష్టంబు నాపహరించి ఇనుపగజ్జెల తల్లి జీవనంబు చేయు కసరి బసకొట్టు నాతని గాలిసోక నాలుగు పడగల హైందవ నాగరాజు" అని జీవితమంతా దళిత చైతన్యానికి పాటుపడ్డ జాషువా కృషి కనుమరుగవుతందా? దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన గురజాడ ఆదర్శం తొలగిపొతుందా? విగ్రహాలే వారి కృషి కొలమానాలా? ఒక్కసారి ఆలోచించడి! శ్రీశ్రీగానీ, గురజాడ గానీ, జషువాగానీ తమ తర్వాత తమ భావజాలాలను అందిపుచ్చుకొని ఆచరించే వ్యక్తులు కావాలని, తమ మార్గంలో నడిచే జ్ఞానీక కావాలని కోరుకున్నారు. కానీ, ఏనాడైనా తాము విగ్రహాలుగా మారి పూలందుకోవాలని అనుకున్నారా? మత విగ్రహాలపై ఇంత రచ్చ అవుతుందని కొంచెం ఊహించి ఉన్నా తమ భవిష్యత్ విగ్రహాల స్థాపనను నిర్ద్వందంగా వ్యతిరేకించి ఉండేవారేమో కనుక విగ్రహాలు వ్యక్తిత్వాలకు ప్రతీకలు అనండంలోనే తప్పుడు అవగాహన ఉంది. అందులో వ్యక్తిత్వాల కుదింపు కుట్ర దాగి ఉంది ఆ చట్రంలో వారిని బందీనిన చేసి, విగ్రహాలను చూపంచి వారి వక్తిత్వాల విశ్లేషణ జరిపే సంకుచిత అవగాహనలు దాగి ఉన్నాయి. వాటిని వదులుకోని పక్షంలో అభిమానులు, తాము అభిమానిస్తున్నా వారి కృషిని తామే తగ్గించినట్లు అవుతుంది. వారిని, వారి ఔన్నత్యాన్ని నడిబజారు పాలు చేసినట్లవుతుంది.

నాయకులను నిజంగా అభిమానించే వారయితే ఏం చేయాల్సి ఉంటుంది.? వార జీవితాంతం ఏ విలువలకైతే పరిశ్రమించారో, ఏ ఉన్నత సిద్దాంతాల కొరకై తపించారో వాటిని నిజ జీవితంలో ఆచరించాలి. ఏ పనులను వారు ఖండించారో, అసహ్యించుకున్నారో వాటిని జీవితాంతం దూరముంచాలి. ఏ మార్గంలో తాము ప్రయాణిస్తూ ప్రజలను మార్గదర్శనం చేశారో ఆ మార్గాన్ని తు.చ. తప్పకుండా పాటించి ఆదిశగా ప్రజలను జాగృతం చేయడమే వారి తర్వాత వారికి ఇవ్వగలిగే కానుక అవుతుంది కానీ, విగ్రహాలు పెట్టడం, పోటోలు పెట్టి పూజలు చేయడం, వారికి నివాళులు అర్పించడం, మౌనాలు పాటించడం, దండాలు పెట్టడం లాంటివి కాదు. ఇవన్నీ పూర్తిగా పూజ కిందకే వస్తాయి. తర్వాత తరాలకు బానిసత్వాన్ని ప్రేరేపించి పనులు పూర్తి చేస్తున్నారు. సోకల్ట్ అనేది ఏ స్థాయిలో ఉన్ననూ అది ఆయా నాయకులకు హాని చేస్తుందే తప్ప ఏనాటికీ మేలు చేయదు. అలాంటి పనులు చేయడం ఆ నాయకులను అవమానించడమే అవుతుంది.

ఈ రకం వారు దేవుళ్ళ విగ్రహాలను, నాయకుల విగ్రహాలను ఒకేరకంగా గొప్పగా చూస్తారు. ఏ విగ్రహాలను ధ్వంసం చేసినా, వాటికేం జరిగినా ఆయా దేవుళ్ళు, నాయకుల మూర్తిమత్వాలు ధ్వంసమైనట్లుగానే భావిస్తారు. అంతేకాదు. విగ్రహాల ఏర్పాటును ఏవిధంగా చూస్తారో విగ్రహాలు పాడవటం, కూల్చివేయబడటాన్ని కూడా అదే విధంగా చూస్తారు. దేవతల విగ్రహాలు ఏవైనా పాడైనప్పుడు గొప్ప ఆర్భాటాలతో పునఃప్రతిష్టించడం ఈ కోవలోనిదిగానే తరచూ చూస్తూనే ఉన్నాం. అలాగే ట్యాంక్‌బండ్ విగ్రహాల కూల్చివేతను కూడా ప్రతీకవాదులు చాలా తీవ్రంగా పరిగణిస్తున్నారు. అందుకే దేవతల విగ్రహాలను ఏవిధంగా పునఃప్రతిష్టిస్తామో, ట్యాంక్‌బండ్‌పై కూల్చబడ్డ విగ్రహాలను కూడా ఆదేవిధంగా తిరిగి ఏర్పాటు చేయాలనే ప్రధానమైన డిమాండ్‌ను వారు ముందుకు తెస్తున్నారు. వీరికి పూర్తిగా విరుద్దంగా తెలంగాణ ప్రాంతంలోని ప్రతీకవాదులు విగ్రహాల కూల్చివేతను ఆంధ్ర వ్యక్తుల వ్యక్తిత్వాల కూల్చివేతగా చూస్తూ ఆయా స్థానాలలో తెలంగాణ ప్రాంతం వారి విగ్రహాస్థాపన జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రతీకవాదం కోణం నుంచే పూర్తిగానో, పాక్షికంగానో కూల్చివేయబడ్డ విగ్రహాలలో శ్రీశ్రీ, గురజాడ, జాషువాలు మినహా మిగతా వారెవ్వరూ తెలంగాణ, కోస్తాంధ్ర, సీమ ప్రాంతాలలో ప్రాంతాల వారీగా గానీ, కుల, మత, వర్గ ప్రాతిపాదికలుగా గానీ అభ్యున్నతికి తోడ్పడ్డవారు కాదు. పైగా శ్రీకృష్ణ దేవరాయల వంటివారు. దక్షిణ భారతదేశంలోని గిరిజన, నిత్య వ్యవహార మాండలిక భాషలను దెబ్బకొట్టిన ద్రోహులు. అలాంటివారు ఏ తరహా సంస్కృతికి ప్రతీకలు? ఏ సచ్చీల ఆదర్శాలకూ వారు ప్రతినిధులు కాబోరు. కనుక వారి విగ్రహాల కూల్చివేతను వ్యతిరేకించడం కాదు, సమర్థించాలి. కానీ ప్రతీకవాదులు శ్రీశ్రీ, గురజాడ, జాషువాలతో సమానంగా

శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య తదితరులను చూస్తే ఏకబిగిన "ఏ విగ్రహాల కూల్చివేత అయినా తప్పే" అనే జనరల్ సూత్రికరణకు దిగుతున్నారు. ఇది వారు ఎంచుకున్న ప్రతీకవాదానికే పూర్తి వ్యతిరేకమయిన ప్రకటన. ప్రతీకవాదం ప్రకారం విగ్రహాన్ని స్థాపించాలంటే ఆ వ్యక్తికి ఒక గొప్పదనం, ఔన్నత్యం ఉండాలి కదా! ఉదాహరణకు శ్రీశ్రీలో ఔన్నత్యం చూపిన వారెవరికైనా కృష్ణదేవరాయల వ్యక్తిత్వంలో తప్పులు కనబడతాయి. వారిద్దరూ వేర్వేరు సంస్కృతులకు, ఆదర్శాలకు ప్రతినిధులు. అలాంటప్పుడు ఎవరిది సరైన ఆదర్శాలకు ప్రతినిధులు. అలాంటప్పుడు ఎవరిది సరైన ఆదర్శమో వారి విగ్రహమే స్థాపించమని కోరాలి. గానీ, ఆదర్శాలతో, ప్రతీకారాలతో సంబంధం ప్రాథమిక సూత్రానికే విరుద్ధం అవుతుంది. కనుక ప్రతీకవాదాన్నీ ఎత్తుకొని విగ్రహాల కూల్చివేతను వ్యతిరేకిస్తున్న వారంతా తమ ప్రతీకవాదానికి తామే కట్టుబడలేదనేది వారి మాటల్లోనే బహిర్గతమవుతున్న సత్యం.

ఇక రెండవరకం వారు విగ్రహాల ఏర్పాటును యాంత్రిక కోణంలో చూస్తున్నవారు. ఈ రకం వారికి విగ్రహాల ఏర్పాటు సర్వసాధారణ చర్య. కనుక వాటిని ఏర్పాటు చేయడంలో అభ్యంతరమేమే లేదు. అయితే వాటిని కుల, మత, ప్రాంతాల వారీగా సమాన ప్రాతిపదికన ఏర్పాటు చేయాలనేది వీరి భావన ఆయా వ్యక్తుల కంట్రిబ్యూషన్, కృషివంటి వారికి  వీరి దృష్టిలో పెద్దగా ప్రాధాన్యత ఉండదు. వీరికి రాయలైనా ఒకటే గురజాడైనా ఒకటే. మార్క్సిస్టులైనా ఒకటే, కేపిటలిస్టులైనా ఒకటే పెద్దగా తేడా ఏమీ ఉండదు.  ఈరకం ఆలోచనల్లో భాగంగానే కొందరు ట్యాంక్‌బండ్ పై ప్రముఖుల సమైక్య ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారు కనుక వారి విగ్రహాల కూల్చివేత తప్పని వాదిస్తుండంగా, మరికొందరు వారు తెలంగాణ ప్రాంతం వారు కాకపోవడం వల్లనే కూల్చివేత సరైన చర్య అని వాదిస్తున్నారు. అంటే విగ్రహాలను సంబంధిత వ్యక్తుల పనుల, నడవడికల ఆధారంగా కాకుండా ప్రాంతీయత ఆధారంగా చూస్తున్నారు. ఆ ఇరుపక్షాలు యాంత్రిక వాదానికి కట్టుబడ్డాయి. కనుక యాంత్రిక కోణం పరిధిలోనే చూస్తే ఈ వాదనలలో ఒక్క శాతమూ తప్పులేదు. అయితే కూల్చివేతను సమర్థించే యాంత్రిక వాదులలో కొందరు శ్రీశ్రీ, జాషువా గురజాడ విగ్రహాల కూల్చివేత చాలా మంది ప్రజల దృష్టిలో తప్పుడు చర్యగా ముద్ర పడుతుందేమోనన్న భావనతో, ఆ చర్యను సమర్థించుకునేందుకు రిలవెన్స్‌ల చర్చకు తెరలెపుతున్నారు. వారికి రిలవెన్స్ లేనేలేదనే అపవాదును సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ రిలవెన్స్ కుట్రలో ఆ అపవాదులను ఎక్కువగా మోస్తున్నది. శ్రీశ్రీ. తెలంగాణకు సంబంధించి శ్రీశ్రీ ప్రధానంగా రెండు ఆరోపణలున్నాయి. మొదటిది– రష్యా విప్లవాన్ని కీర్తించిన శ్రీశ్రీ, మహత్తరమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం గురించి రాయలేదు. కనుక ఆయన తెలంగాణ వ్యతిరేకి అనేది. రెండవది– 1969 తెలంగాణ ఉద్యమాన్ని  గురించి రాయలేదు. కనుక తెలంగాణ వ్యతిరేకి అనేది. వీటిలో మొదటి సంపూర్ణ అసత్యం అయితే రెండవది పాక్షిక అసత్యం. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన సమయంలో ఆ పోరాటాన్ని సమర్థించి, దానికొక దిశానిర్థేశం చేసిన అభ్యుదయ రచయితల సంఘానికి (అవసం) శ్రీశ్రీ అధ్యక్షుడు. ఆయన ఆధ్వర్యంలోని ఆరసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై చాలా సాహిత్యాన్ని ప్రజలకు అందించింది. మహత్తరమైన ఆ పోరాటనికి భూమికి ప్రజలకు, ఉద్యమాకారులకు ఊతకర్రగా అందించబడిన సాహిత్య రూపకల్పన శ్రీశ్రీ నేతృత్వంలోనే జరిగింది. ఆరుద్ర 'త్వమవాహం'కు శ్రీశ్రీ 'లఘుటిప్పణి' పేరుతో రాసిన ముందుమాటలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు. భారతదేశం అంతట్లోకి రాజకీయంగా ఎక్కువ చైతన్య చూపిస్తున్న ప్రదేశం ఆంధ్రభూమి అన్న విషయన్ని తెలంగాణ విప్లవం రుజువు చేస్తున్నదని రాశాడు. అలాగే త్వమేవాహం రచనకు నేపథ్యంలో తెలంగాణ విప్లవంగా చెప్తు "నిస్సందేహంగా రేపు ఏర్పడబోతున్న సామ్యవాద వ్యవస్థకు తత్వమే పునాది. మన ఆలోచనా విధానాలను అది సామ్యవాదానికి అనుకులంగా మారుస్తుంది" అన్నాడు. అంటే ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాలు కలలుగంటున్న సామ్యవాద వ్యవస్థ ఏర్పాటు తెలంగాణలో జరగడానికి తెలంగాణ విప్లవం, దాని పేరు మీద రాసిన త్వమేవాహం రచనలు ప్రధాన ప్రాతిపదికలవుతాయని ఊహించినవాడు ఎక్కువగా సమర్థింపు వ్యాఖ్యానాలు చేసినవారు మరొకరు లేరేమో! ఆ పోరాటన్ని సామ్యవాదాన్ని ఏర్పరిచే మహత్తర పోరాటంగా అర్థం చేసుకున్న వ్యక్తి

శ్రీశ్రీ. కనుక తెలంగాణ సాయుధ పోరాటానికి శ్రీశ్రీ వ్యతిరేకి అనడం సంపూర్ణ అసత్యమే అవుతుంది.

ఇక 1969 ప్రత్యేక తెలంగాణ పోరాటాన్ని గురించి రాయలేదు. కనుక తెలంగాణ వ్యతిరేకి అనే మరోముద్రను శ్రీశ్రీపై వేస్తున్నారు. రాయనంత మాత్రాన ద్రోహులైతే ఈ ప్రపంచంలో ప్రతి కవీ, ప్రతి రచయితా ద్రోహులే చరిత్ర తెలిసినవారికి 1969లో తెలంగాణ ఉద్యమం జరిగిన కాలం దేశవ్యాప్తంగా, రాష్ట్ర వ్యాప్తంగా ఎంతటి కీలకమైన, ప్రాధాన్యత కాలమానం యొక్క కొనసాగింపో అర్థమవుతుంది. శ్రీశ్రీ విషయంలో 1967 నుంచి 1977 వరకు పదేళ్ళు బహుళ అతని జీవితంలో అత్యంత విలువైన కాలమే కాదు, నిమిషం తీరికలేని కాలం అని కూడా చెప్పవచ్చు. 1967 లో పశ్చిమబెంగాల్‌లో సాయుధ ఉద్యమ ప్రారంభం నుంచి 1969లో మొదటి ఎంఎల్ పార్టీ ఏర్పాటు చేసేదాక ఏ మార్గం అనుసరించాలనే విషయంలో శ్రీశ్రీ తీవ్రంగా అంతర్ ఘర్షణ పడిన సమయం. మరోవైపు 1965లో ప్రారంభమై రెండు కవితా సంకలనాలను వెలువరించిన దిగంబర కవులను నిశితంగా పరిశీలించి, వారి సాహిత్య ప్రక్రియపై శ్రీశ్రీ ఒక నిశ్చితాభిప్రాయానికి రావడానికి కూడా ప్రయత్నిస్తున్నకాలమది. 1970లో శ్రీశ్రీ షష్టిపూర్తి సభలో విరసం అవిర్భవించడం, దానికి శ్రీశ్రీ అధ్యక్షుడవడం, దానికి పథ నిర్థేశం చేసే పనిలో తలమునకలవడం ఇవన్నీ అతనికి మరింత తీరిక సమయం లేకుండా చేశాయి. 'మహాప్రస్థానం' నుంచి తెలుగు సాహితాన్ని 'మరోప్రస్థానం దారుల్లోకి మార్చే పనిలో చాలా బిజీగా ఉన్నకాలం. తర్వాత 1975 ఎమర్జెన్సీ, 1976లో విరసం నుంచి శ్రీశ్రీని సస్పెండ్ చేయడం. ఇలా 1967 నుంచి 1977 వరకు పదేళ్ళ కాలంలో శ్రీశ్రీకి 69 ఉద్యమాన్ని కవిత్వీకరించేంత సమయం లేని బిజీకాలం. ఒక్క కవితనైనా రాయలేదా, పదేళ్ళ కాలంలో? అని ప్రశ్నించే వారికి శ్రీశ్రీ కూడా మనిషే కనుక ఆ సమయంలో ఆయనకు ఏర్పడ్డ పరిమితి వారికి ఎంత మాత్రమూ అర్థం కాదు. కనుక ఈ వాదన సాక్షిక అసత్యం అవుతుంది.

శ్రీశ్రీ గిరిజనులపై, దళితులపై ముస్లింలపై ఇంకా వేర్వేరు కులాలు, మతాల వారిపై రాయలేదని కూడా మరికొందరు అతన్ని డిస్‌క్వాలిపై చయడానికి ప్రయత్నిస్తున్నారు. విగ్రహాల కూల్చివేత సందర్భంగా ఆ చర్యను తీవ్రతర చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. కాని శ్రీశ్రీ ఎప్పుడు విభాగాలుగా ... కవిత్వం రాయలేదు. సమాజంలో పీడితులందర్ని ఒకే సమూహంగా తీసుకొని రాశాడు. పీడితులందరికీ వర్తించే సాహిత్యాని సృష్టించాడు. కనుక ఎవరికి వారు సరైంది కాదు. శ్రీశ్రీ వలెనె తప్పుపట్టే పనికి దిగడం కూడా రిలవెన్స్ లేదనే వారికి ఒక్కటే సమాధానం ! దళితుల కోసం అంకితమైన రచనలు సాగించిన జాషువా, దురాచారాలను తెగనాడిన, వ్యవహారిక భాషలో రాసి సాహిత్యంలో ఎతుకుపోయిన తుప్పును వదిలించిన గురజాడలకు ఇప్పుడే కాదు, ఇంకెన్ని సంవత్సరాలైనా వారి ప్రాధాన్యత చెక్కు చెదరకుండా అలాగే ఉంటుంది.

అయినా ఒకవ్యక్తి ఏం రాశాడో దాని ఆధారంగా ఆ వ్యక్తి నిబద్ధతను బేరీజు వేయాలిగానీ, రాయని దాని ఆధారంగా బేరీజు వేస్తామా? ఇదేం పద్ధతి? శ్రీశ్రీ మొదట్లో సమైక్యతను కోరుకున్ననూ తర్వాత కాలంలో చాలా బలంగా ప్రత్యేక రాష్ట్ర వాదాన్ని సమర్థించాడు. అది ఆయన మారిన వైఖరికి సాక్ష్యం. ఒక వ్యక్తిని అంచనా వేయాలంటే అతని మారని వైఖరినా? అది మరిచిపోయి శ్రీశ్రీ రాయలేదు. కనుక అతను నిందార్హుడు అంటే ఎలా? తెలంగాణపై కాదు. గానీ ఇతరత్రా కొన్నింటి మీద శ్రీశ్రీ రాయలేదు. 1960లలో అప్పుడు ఉస్మానియాలో చదువుతున్న చేకూరి రామారావు (చేరా) లేఖ రాసినప్పుడు పేరు తెలియదు గానీ వరంగల్ కాలేజిలో చదువుతున్న ఒక విద్యార్థి "అన్నీ శ్రీశ్రీనే రాయాలా? మనం రాయలేమా?" అంటూ రాశారు. ఇప్పుడు శ్రీశ్రీని నిందిస్తున్న వారికి ఆ జవాబు సరిగ్గా వర్తిస్తుంది. ఒక కవి అన్ని అంశాల మీద రాయాల్సిందేనా? ఏ ఒక్క అంశం మీద రాయకపోయినా, అతనికి నిజాయితీ లేనట్లేనా? గొప్పకవి, యుగకవి, యుగకర్త, మహాకవి లాంటి ఇమేజ్‌లకు శ్రీశ్రీ వ్యతిరేకి, శ్రీశ్రీకి అలాంటి ఇమేజ్‌లనేర్పరచి ఇమేజ్ సంకెళ్లతో బందీని చేసి, ఇప్పుడు అది రాయలేదు, ఇది రాయలేదు. అని అతని కృషిని శంకించే చర్యలకు దిగడం పూర్తిగా తప్పుడు పని. ప్రతి కవీ అన్నింటి మీద రాయడు. ఒకరు కులం మీద రాస్తారు. ఒకరు మతం మీద, ఇంకొకరు స్త్రీల మీద ఇలా ఎవరిని ప్రభావితం చేసిన

అంశాలపై వారు రాస్తారు. అలాంటప్పుడు రాయని సెక్షన్‌ల వారంతా తమ గురించి రాయని కవిని, రచయితను నిందిస్తూ పోవడమేనా? కనుక ఒక కవిని విశ్లేషించేటప్పుడు అతను దేని గురించి రాశాడో దానిపై ఆధారపడి ఒక అభిప్రాయానికి రావాలి గానీ రాయని దానిపై ఆధారపడి కాదు. కనుక విగ్రహాల కూల్చివేత సందర్భంగా రిలవెన్స్‌ల చర్చ పూర్తిగా అర్థం లేని చర్చ.

విగ్రహాల కూల్చివేతను ప్రతీకవాదుల యాంత్రికవాదుల కోణాల నుంచి చూశాక, వాస్తవంగా తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో, తెలంగాణ  వాదులుగా మనం ఆ సంఘటనను ఎలా చూడాలి? నిజాం బానిస పెనంలోంచి, సమైక్య పాలకుల పొయ్యిలో పడి అత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని కోల్పోయి. వనరులు, సంపదలు, భాష, సంస్కృతి, దేవుళ్ళు... ఒకటేమిటి, సర్వం కోల్పోయి నిస్తేజమైన జాతిగా మిగిలిన మన జీవితాలలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే కొంతవరకు తేజస్సు నింపుతుందని భావిస్తున్న నేపథ్యంలో విగ్రహాల కూల్చివేతపై ఒక అనవసరమైన అసందర్భమైన, అక్కరకురాని, అప్రస్తుత చర్చ. భావోద్వేగాల సమతుల్యత జరగని ఒకానొక అవేశపూరిత చర్యగా అనుకొని, దాన్ని మర్చిపోయి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు డిమాండ్ నుంచి వేరుపడకుండా, సమష్టితనాన్ని కోల్పోకుండా ముందుకు సాగిపోవాలి. ట్యాంక్‌బండ్‌పై అవే విగ్రహాలు కట్టించాలా? మనవాళ్ళ విగ్రహాలు కట్టించాలా? అనే ప్రశ్నను పక్కన పెట్టి అసలు ఆ ప్రాంతంలో ఉన్నమొత్తం విగ్రహాల బదులు సమష్టి గృహాలు కట్టించమని డిమాండ్ చేద్దాం ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలలోనే వేలాదిమంది తెలంగాణ ప్రాంత కార్మికులు, శ్రామికుల తలదాచుకోవాడానికి ఇల్లులేక, జాగలేక అవే విగ్రహాల కింద పడుకుంటూ చెట్లకింద, సేవ్‌మెంట్‌ల మీద కాలం వెళ్ళదీస్తున్నారు. పొట్టకూటి కోసం పట్టణానికి వచ్చిన అలాంటి తెలంగాణ వాళ్ళ కోసం ఉచిత వసతులను కల్పించమని అడుగుదాం. ట్యాంక్‌బండ్ ప్రాంతాన్ని సీమాంధ్రవారు విగ్రహాల ప్రాంతంగా చూస్తే మనం పేదల నిరాశ్రయ ప్రాంతంగా చూద్దాం. విగ్రహాలుగా, రాతిబొమ్మలుగా మన కవులు, కళాకారులు నిలబడే కంటే వారి పేరు మీద మన ప్రాంతం వారికే ఆశ్రయం కల్పిస్తే అదెంత గొప్ప చర్య అవుతుందో ఆలోచిద్దాం. మరణించిన వారి మీద కంటే, బతికున్న వారిపైకి మన ఆలోచలను బదలాయిద్దాం. అందువల్ల కొంచమైనా ఊరట పొందేది. మన ప్రాంత పేదవారే మరణించిన వారి పేరిట మాత్రం భవనాలు, విగ్రహాలు, పార్కులు, ఎకరాల కొద్దీ భూములు ఉండటం చూస్తున్నాం. అలాంటి పనిని వ్యతిరేకించి, పేదలకు మేలు జరిపే పనిలో విజయవంతమై దేశం మొత్తానికి తెలంగాణ ప్రాంత సహృదయత, దయార్ద్ర హృదయత చాటి చెప్పుద్దాం.

ఇక చివరగా ఒక మాట! రెండేళ్ళలో కన్న ముందు 600 మంది విద్యార్థులు, ప్రజలు తెలంగాణ కోసం ప్రాణాలర్పించారు. వారి మరణాలపై కనీస సానుభూతి ప్రకటించని ఈ ప్రాంత మహాకవులు కొందరు రాతిబొమ్మల కూల్చివేతపై మాత్రం గొంతులు చించుకుంటున్నారు. అలాంటి వారికి 'నీచులు' అనేది చాలా చిన్న పేరవుతుంది. అది వారి సంస్కారానికే. విజ్ఞతకే వదిలేద్దాం. అలాంటి వారిని ఎలా హీనపరచాలో చరిత్రకు బాగానే తెలుసు. ఇక విగ్రహాల చర్చను వదిలేద్దాం. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై ప్రయత్నాల దిశగా మరింత బలంగా ముందడుగు వేద్దాం.

**– లోకె రాజ్‌పవన్**

తెలంగాణ గళం పత్రిక
మార్చ్, 2011

# 'మిలియన్ మార్చ్'ను ఎత్తిపట్టండి

**– ప్రతాప్**

ప్రత్యేక తెలంగాణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహించి, తెలంగాణ ఏర్పాటును ఎలాగైనా అటకెక్కించాలని ప్రయత్నిస్తున్నది. తెలంగాణ సమస్యకు పరిష్కారాల కోసం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ, దాని నివేదిక అంతా బూటకమని తేటతెల్లమైంది. దేశంలో ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం ముందెన్నడూ లేని స్థాయిలో ఉద్యమం జరుగుతూ, నాలుగుకోట్ల తెలంగాణ ప్రజానీకం ముక్త కంఠంతో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును డిమాండ్ చేస్తున్నప్పటికీ, తెలంగాణ సమస్య – సున్నితం, జటిలమైనది. ఏకాభిప్రాయ సాధన అవసరం అంటూ ప్రధాన మంత్రి మన్మోహన్ రాగాలు తీస్తున్నాడు. దీనర్థం తెలంగాణ సమస్యను ఇంకా నాన్చి, ఉద్యమాన్ని నీరుగార్చాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనేది స్పష్టం. కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వ మోసపూరిత కుట్రలను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రజలు తెలంగాణ సాధనకు పోరాటమే ఏకైక మార్గంగా ఎంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమం నానాటికీ తీవ్ర రూపం దాల్చుతుంది.

ఈ క్రమంలో 'రచ్చబండ' కార్యక్రమంలో గ్రామ గ్రామాన తెలంగాణ ప్రజలు ప్రభుత్వ నిర్లక్ష్య, మోసపూరిత వైఖరిని తమ ఆగ్రహావేశాలతో రచ్చకీడ్చారు. ఆ తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను స్తంభింపచేయడానికి ఉద్యమం 'సహాయ నిరాకరణ' రూపం తీసుకుంది. సహాయ నిరాకరణలో యావత్తు తెలంగాణ ప్రజానీకం, అన్ని ప్రభుత్వ సంస్థలకు చెందిన లక్షలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి కాలుచేయి ఆడకుండా చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు అన్నింటిలో పనులు స్తంభించాయి. ప్రభుత్వం రెవెన్యూ, పన్నులు, విద్యుత్, ఆర్టీసీ ఛార్జీల రూపంలో వచ్చే కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయింది. తెలంగాణ వ్యాప్తంగా ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, సినిమాహాళ్ళు బంద్ చేసి నిర్వాహకులు స్వచ్ఛందంగా సహాయ నిరాకరణలో పాలుపంచుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాల కార్యకలాపాలను ఏ విధంగా స్తంభింప చేయలరనేది తెలంగాణ ప్రజలు రుజువు చేసి చూపించారు. ఇప్పటివరకు ఇన్ని రూపాల్లో ప్రజలు శాంతియుతంగా నిరసనలు తెలుపుతూ, తెలంగాణ ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తున్నప్పటికీ దోపిడీ, దళారీ వర్గాల కొమ్ముకాసే యు.పి.ఎ. ప్రభుత్వం దీన్ని ఎలా నీరుగార్చాలా అని కుట్రలు చేస్తున్నది.

అంతేగాక, ఉద్యమ అణచివేతకు పథకాలు వేస్తున్నది. మార్చి 10న లక్షలాది ప్రజలు శాంతియుతంగా నిర్వహించతలపెట్టిన 'మిలియన్ మార్చ్'ను నిర్బంధంతో అడ్డుకోవాలని ప్రభుత్వం చివరిదాకా విఫల ప్రయత్నాలు అనేకం చేసింది. మిలియన్ మార్చ్‌కు అనుమతినీయకుండా, మార్చ్‌కు పిట్టను కూడా రానివ్వబోమంటూ యావత్తు తెలంగాణపై వేయికళ్ళతో నిఘా వేసింది. మిలియన్ మార్చ్‌కు వస్తున్న లక్షకు పైగా ప్రజలను అరెస్టులు చేసి, వాహనాలను అడ్డుకొని, లాఠీచార్జీలు జరిపి భగ్నం చేయాలని చూసింది. ఇటువంటి దుర్మార్గమైన నిర్బంధ పథకాలను రూపొందించి, ఉద్యమ అణచివేతకు ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్, గవర్నర్ నరసింహన్, డి.జి.పి. అరవిందరావుల దుష్టత్రయం నాయకత్వం వహిస్తున్నది. ప్రజల ఆగ్రహావేశాల్లో ఇలాంటి ఫాసిస్టులు నల్లుల్లా మాడిపోకతప్పదు.

ఎన్ని అడ్డంకులు కల్పించి, ఎంత నిర్బంధం ప్రయోగించినా ఉవ్వెత్తున పొంగిన ఉద్యమ ఆకాంక్షల ముందు

ఆంక్షలు ఆవిరయ్యాయి. వీటన్నింటిని చేధించుకొని తెలంగాణ ఉద్యమ ఊరేగింపు జనసాగరమై హుస్సేన్‌సాగర్ ఒడ్డుకు చేరింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకునే తీరుతామని ప్రతిన బూనింది. నిర్బంధాలతో, అణచివేతలతో ఏ శక్తీ తెలంగాణ గొంతును నొక్కలేదని ప్రజలు నిరూపించారు. మార్చి 10న హైదరాబాద్‌లో 'మిలియన్ మార్చ్'ను విజయవంతం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గపు విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజల ఆగ్రహావేశాలు హద్దులు దాటి ట్యాంకు బండ్‌పై మహనీయుల విగ్రహాల విధ్వంసానికి, మీడియాపై దాడికి దారితీయటం దురదృష్టకరం. ఇందుకు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత. నిర్బంధాలతో తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకోలేరనేది చరిత్రలో ఇప్పటికే ఎన్నోసార్లు రుజువయింది. అయినా సీమాంధ్ర పెట్టుబడిదారుల, దోపిడీ దారుల కొమ్ముగాసే ప్రభుత్వం తన శుష్క ప్రయత్నాలు మానుకోవటం లేదు. శాంతియుతంగా జరిగే ఊరేగింపుకు అనుమతినిచ్చి వుంటే ఈ దురదృష్టకరం పరిణామం జరిగి వుండేది కాదు. తెలంగాణ పట్ల సీమాంధ్ర పాలకుల వివక్ష, దోపిడీ, అణచివేతలు ప్రజల అసహనానికి, ఆగ్రహానికి కారణం. ట్యాంకుబండ్‌పై విగ్రహాల స్థాపనలో కూడా పాలకుల వివక్ష స్పష్టంగానే కన్పిస్తున్నది. పోరాటాల, రక్తతర్పణల చరిత్రతో ప్రపంచంలో పేరెన్నికగన్న తెలంగాణ గడ్డన ట్యాంక్‌బండ్‌పై స్థానం పొందగల మహనీయులే లేరా? ఇది వివక్షకాక మరేమిటి? ప్రభుత్వ దుర్మార్గపూరిత విధానాలే ఉద్యమాన్ని విధ్వంసం వైపు నెడుతున్నాయి. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, వాటికి వ్యతిరేకంగా ప్రజల పోరాటాలను ఏదో మేరకు ప్రపంచానికి చాటిచెప్పే మీడియాపైన దాడి కూడా సరైంది కాదు. ప్రజాస్వామిక ఆకాంక్షను ప్రతిబింబించే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పత్రికా ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. తెలంగాణ పేరు చెప్పుకొని బతికే ఏ రాజకీయ పార్టీలను, దొంగ నాయకులను ప్రజలు నమ్మే స్థితిలేదు. ఇప్పుడు ఉద్యమం ప్రజల చేతుల్లో వుంది. ఇటువంటి ఉద్యమాల్లోకి రాజ్యం విధ్వంసకర శక్తులను చొప్పించి విచ్ఛిన్నానికి కుట్రలు పన్నే అవకాశాలున్నాయి. ఇటువంటి చర్యలను సాకుగా చూపించి ప్రభుత్వం అణచివేతకు సాధికారత కల్పించుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ కుట్రల పట్ల ప్రజలు, ఉద్యమకారులు సదా అప్రమత్తంగా ఉండాలి. ఏమైనప్పటికీ నాలుగుకోట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే ఉద్యమంలో ఇటువంటి అపశృతులు దొర్లటం ఉద్యమానికి మంచిది కాదు. అన్ని ప్రాంతాల ప్రజల విశ్వాసాలను చూరగొన్న గొప్ప వ్యక్తుల విగ్రహాల విధ్వంసం ప్రజల్లో విభేదాలు, విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులకు అవకాశాన్నిస్తుంది. ప్రజల విశ్వాసాలను దెబ్బతీస్తుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు పట్ల సుముఖతతో వున్న ఇతర ప్రాంతాల ప్రజలతో ఐక్యతను దెబ్బతీసే ఎటువంటి పొరపాట్లను కూడా ముందు ముందు జరగకుండా ఉద్యమ నాయకత్వం, తెలంగాణ ప్రజలు జాగ్రత్త వహించాల్సి వుంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా విచ్ఛిన్నకర శక్తులకు అవకాశం ఇవ్వకూడదు.

తమ అధికారాన్ని కాపాడుకోవడానికి ప్రత్యేక తెలంగాణను అడ్డుకోవాలని చూస్తున్న సీమాంధ్ర పాలకులను, పెట్టుబడిదారులను, తెలంగాణ వ్యతిరేక శక్తులను ఓడించాలి. తెలంగాణ ఉద్యమం కీలకదశకు చేరుకున్న తరుణంలో అన్ని ప్రాంతాల ప్రజల మద్ధతును కూడగట్టుకొని ముందుకు కదలాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉస్మానియా విద్యార్థుల, న్యాయవాదుల, సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్ వంటి మిలిటెంట్ పోరాటాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలి. ఇందుకు తెలంగాణలోని అన్ని సెక్షన్ల ప్రజలు మరింత సంఘటితంగా తెలంగాణ ప్రజాశక్తిని నిరూపించాలి. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ కోసం ఇదే ఐక్యతతో యావత్తు తెలంగాణ ప్రజానీకం పోరాడాలి.

**- ప్రతాప్**

తెలంగాణ గళం పత్రిక
మార్చ్, 2011

# ప్రజా ఉద్యమానికి పగ్గం

## – జూకంటి జగన్నాథం, పెద్దింటి అశోక్‌కుమార్

ఉద్యమాలు నాయకుల చేతుల్లోంచి ప్రజల చేతుల్లోకి వచ్చి ప్రజా ఉద్యమాలుగా మారే తరుణంలో తలెత్తే సవాళ్లు ఎలా వుంటాయో మిలియన్ మార్చ్ తేటతెల్లం చేసింది. మిలియన్ మార్చ్‌లో ముఖ్యంగా మనం చూడాల్సిన అంశాలు నాలుగు. ఒకటి మీడియాపై దాడి. రెండోది కాంగ్రెస్ ఎంపీలపై దాడి. మూడవది విగ్రహాల ధ్వంసం. నాలుగవది పోలీసుల బీభత్సం. ఈ నాలుగింటిలో చివరిది అఘ్రానమై పోవడం గమనార్హం. మిలియన్ మార్చ్ తర్వాత ట్యాంక్‌బండ్ మీద బాష్పవాయు ప్రయోగం, పోలీసుల వీరవిహారం. తెలంగాణవాదులను తరిమి కొట్టడం వల్లే వుద్యమం హింసాయుతంగా మారింది. మీడియాలో మొదటి మూడింటి మీదనే చర్చ కేంద్రీకృతం కావడం వల్ల, తర్వాత విరిగిన లాఠీలకు కారిన కన్నీళ్లకు సానుభూతి లేకుండా పోయింది.

శాంతియుతంగా జరగాల్సిన మిలియన్ మార్చ్‌క్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. నాయకులను ఎక్కడి వారిని అక్కడే అరెస్టు చేసి పోలీసులను దించి బారికేడ్లను నిర్మించి ఆంక్షలు విధించి తెలంగాణ ప్రజలను కించపరిచింది. ఉద్యమం కేవలం నాయకులదే అయితే, ఈ చర్యలతో చల్లారిపోయేది ఉద్యమం ప్రజలది. కాబట్టి పట్టుదల పెరిగింది. ఆవేశం పెరిగింది. స్థానిక ప్రజలు వందలాదిగా ట్యాంక్‌బండ్ పైకి దూసుకు వచ్చారు. వారు నిఖార్సయిన తెలంగాణవాదులు. ఇన్ని నిర్బంధాల మధ్య వారు ట్యాంకు బండ్‌పై కాలు మోపారు. దాని వెనుక వున్న మానసిక ఘర్షణను విజ్ఞతతో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఇది అరవై ఏళ్ల పోరాటం, రెండుసార్లు దెబ్బతిని మళ్లీ లేచిన ఉద్యమం. పదేండ్ల నుంచి శాంతియుతంగా జరుగుతున్నది. ఏడాది కింద కేంద్రమే రాష్ట్రం ఏర్పాటును ప్రకటించింది. అగ్గిలో ఆజ్యం పోస్తూ వెనక్కి తీసుకుంది. తర్వాత ఏం జరిగిందీ ఎవరికీ పట్టదా ...? వందల మంది యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. వేల కేసులను ఎదుర్కొన్నారు. ఏడాదిగా దీక్షలు చేస్తున్నారు. సబ్బండ వర్ణాలు రోడ్డు మీదికి వచ్చాయి. పార్లమెంటు స్తంభించింది. అసెంబ్లీ చీలిపోయింది. ఉద్యోగులు నిరసన చేశారు. ఏండ్లకేండ్లుగా తమని తాము నిలువునా కాల్చుకుని నిరసనలు తెలిపినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోవడంతో పెల్లుబుకిని ప్రజాగ్రహమే అది.

మీడియాపై దాడిని ఎవరూ హర్షించరు. అది సమర్థనీయం కాదు. కానీ గత కొన్ని రోజులుగా జరుగుతున్నది ఏమిటి? నిన్నటికి నిన్న ఒకటి రెండు ఛానళ్లు మిలియన్ మార్చ్‌ను అభివర్ణించిన తీరు ఎంత పాక్షికంగా ఉందో తెలిసిందే. నిజామాబాద్ ఎన్నికల్లో ఆత్మాహుతిని ఆత్మహత్యగా అభివర్ణించడం మొదలు, కొన్ని ఛానల్లు చేస్తున్నదేమిటో అందరూ అవగాహన చేసుకోవాలి. ఏ కడుపుమంటా లేకపోతే మొన్నటికి మొన్న రెండు రోజులు ప్రసారాలను నిలిపివేస్తారా తెలంగాణ ప్రజలు. ఏ ఒక్క ఛానల్ అయినా ఎవరి నీడా లేకుండా, ఎవరి ముద్రా లేకుండా ప్రజల పక్షాన నిలిచిందా? అన్నది ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలి.

2009 డిసెంబర్ నాటి ప్రకటన అనంతరం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హీరోలయ్యారు. సోనియా గాంధీ దేవతయ్యారు. ఆమె పుట్టిన రోజు నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజలకు పవిత్ర దినమై పోయింది. రెండు వారాలు గడవక ముందే, ఏమైందో కొత్తగా చెప్పనవసరం లేదు. అరవై ఏండ్ల పోరాట ఫలితం, 600 బలిదానాల

ఫలితం ఒక్కసారి మసక బారిపోయింది. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు అడిగినప్పుడల్లా ఓట్లు వేశారు. ర్యాలీలు చేశారు. ఉపవాసాలున్నారు. కొడుకులను కాల్చుకున్నారు. ఇంతటి ఉద్వేగ భరితమైన సన్నివేశంలో ఓ స్వీటు ముక్క ఇచ్చి తిరిగి వెనక్కి తీసుకున్నంత తేలికగా వ్యవహరించడంతో ప్రజలు కాంగ్రెస్‌పై కన్నెర్ర చేశారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను రాజీనామా చేయమన్నారు. వివిధ రూపాల్లో నిరసన ప్రకటించారు. కె. కేశవరావు, మధుయాష్కీలపై జరిగిన దాడిని ఈ నేపథ్యంలో చూడాల్సి వుంటుంది. రాజ్య సభలో కె.కె., లోక్‌సభలో యాష్కీ తెలంగాణ కోసం గళమెత్తిన ప్రతిసారీ ప్రజలు వారికి మనసులో మొక్కారు. మరి వారిపై దాడి ఎందుకు జరిగినట్టు? కోపం వారిపై కాదు. ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకున్న కాంగ్రెస్‌పైన. ఇంకా పార్టీని పట్టుకుని వేలాడుతూ పదవులను విడవని వారి బలహీనత మీద.

ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ స్థాపించిన విగ్రహాల మీద ఇప్పటికే ఎన్నోమార్లు విమర్శలు వెల్లువెత్తాయి. కొమరం భీం విగ్రహం లేనందుకు, ఆదివాసుల నుంచే కాక, ఇతర సామాజిక వర్గాల నుంచి సైతం విమర్శలు వచ్చాయి. బడి పిల్లలను విహార యాత్రకు తీసుకెళ్లినప్పుడు వారు మన మహామహుల బొమ్మలెందుకు లేవని అడుగుతుంటే తెల్లముఖం పెట్టిన పంతుళ్లు ఎందరో ఉన్నారు. శ్రీశ్రీ నుంచి సినారె దాకా కవులను మీరెటు వైపు అని ప్రజలు ఏనాటి నుంచో నిలదీస్తున్నారు. ఆవేశంతో, ఆక్రందనతో ఉనికి కోసం పోరాడుతూ, దగాపడి, గాయపడిన తెలంగాణ సగటు జీవులకు ట్యాంకుబండ్‌పైకి ఎక్కినప్పుడు తొలుత వారికి కనిపించేవి ఆ విగ్రహాలే. విగ్రహాల విధ్వంసం ఖచ్చితంగా ఖండించాల్సిన అంశమే. కానీ, సంస్కృతి మంట కలసిందని, భాష అవహేళనకు గురైందని, జీవనం విచ్ఛిన్నమైందని బాధతో రగులుతున్న వాడు కడుపు మంటను తీర్చుకోవడానికి ఏం చేస్తారో ఆలోచించవలసిందిగా కోరుతున్నాం.

ఆకలితో చస్తున్న వారు అహింసా బోధనలు చెవిన పెట్టరన్నది ఒక కరకు వాస్తవం. దీనంతటికీ మూలకారణం ప్రభుత్వ కుట్రపూరిత వైఖరి. శాంతియుతంగా సాగుతున్న ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చి అణచివేసేందుకు పన్నిన ఎత్తుగడ. ఒక వ్యక్తిని హతమార్చడానికి తీవ్రవాది అని ముద్ర వేసినట్లే తెలంగాణ ఉద్యమాన్ని పరిహసించడానికి ప్రభుత్వం హింసను ప్రేరేపిస్తున్నది. ప్రభుత్వ పన్నాగాన్ని బట్టబయలు చేయాల్సిన పెద్దలే స్వయంగా అదే గూడులో చిక్కుకుని వాస్తవాలను నిశితంగా పరిశీలించకుండా ఆధిపత్య స్థానంలో ఉన్నవారికి అనుకూలంగా ప్రకటనలు చేస్తున్నారు.

హింస, దాడి ఎక్కడ జరిగినా, ఎప్పుడు జరిగినా అది గర్హనీయమైనది. తెలంగాణ ఉద్యమం లాంటి సుదీర్ఘ పోరాటంలో ఈ రెంటికీ అసలు తావే ఉండకూడదు. అవి తాత్కాలికంగా కడుపు మంటను చల్లార్చినా ఉద్యమ సాంద్రతను తగ్గిస్తాయి. ప్రభుత్వం పథకం ప్రకారం 'హింస రచన'కు సావకాశం కల్పించినా, ఆవేశకావేశాలకు దూరంగా అహింసా మార్గంలో ఉద్యమించడం ప్రజలకు శ్రేయోదాయకం.

తెలంగాణ మీద పుట్టిన వారిగా కాంగ్రెసు, టిడిపి నాయకులు ప్రజల్లోకి వచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించి, నాయకత్వం వహించడం ఇప్పుడు రాజకీయ పరమైన పరిమితులను ఛేదించుకుని పూర్తిగా ప్రజల చేతుల్లోకి వచ్చింది. దాన్ని సరిగ్గా నడపలేకపోతే ఇటువంటి ఘర్షణ పూరిత వివాదాలే మళ్లీ మళ్లీ తలెత్తే ప్రమాదం వుంది. అందుకు పూర్తి బాధ్యులు అప్పుడు తెలంగాణ రాజకీయ నాయకులే అవుతారు.

**– జూకంటి జగన్నాథం** *(తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు)*

**– పెద్దింటి అశోక్‌కుమార్** *(తెలంగాణ రచయితల వేదిక నాయకులు)*

12.03.2011, సాక్షి దినపత్రిక, ఎడిట్ పేజి

# మాగడ్డపై మాజ్ఞాపకాలు ఉండాలి...

**- బోనకుర్తి సోమేశ్వర్**

మూడు తరల పోరటం, నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ఎంతో మంది అమరత్వం, ఆమరణ దీక్షలు, పోరాటలు, లాఠీ దెబ్బలు, తూపాకి తూటలు, బూట్ల చప్పళ్లు, ముళ్ళ కంచెలు బారీకేడ్లు, బెదిరింపులు, డైడ్‌లైన్‌లు, బలిదానాలు ఇలా ... ఒకటా .... రెండా ... వందలు ... వేలు ... ఎన్నో చూసింది. తెలంగాణ మట్టి కొత్త తరానికి అక్షరీకరణ చేసింది. ఉద్యమ పాఠాలు నేర్పింది. గుణపాఠాలుగా మలుచుకొని పోరాడమంది.

ఎందుకి పోరాటం, ఎవరి అస్తినీ అడగలేనిదీ పోరాటం, ప్రక్కరాజ్యంపై దండయాత్ర కాదు ఈ పోరాటం. తెలంగాణ ప్రజలు అడుగుతున్నది అభివృద్ధి మాత్రమే కాదు, తెలంగాణ ప్రజలు తమ ఆత్మగౌరం, తమ చరిత్రను తాము చదువుకోవాలని, తమ గురించి, తమ బ్రతుకు గురించి పోరాడిన వాళ్ళ స్మృతులను చూడలనుకుంటుంది తెలంగాణ పౌర సమాజం. తమ భూమి, తమ బ్రతుకు, తమ ఉద్యోగాలు తమకే కావాలని నినాదిస్తున్నది. ఆ నినాదములో భాగమే మిలియన్ మార్చ్.

ఎవరిపైనా దాడికిపూనుకోవాలనే లక్ష్యం లేదు. అలా అనుకోనూలేదు. ఏ సెక్రట్రేరియట్, అసెంబ్లీ సౌధాలను కూల్చడానికి కదలలేదు. మిలియన్ మార్చ్ రోజు ప్రజలు తమ బాధలు పంచుకోని కొద్దిసేపు అందరము కలిసి నడుద్దాం అనీ, ఎవరికి ఇబ్బంది కలకుండా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం అది. విద్యార్థుల పరీక్షల దృష్ట్యా మధ్యాహ్నం సమయం నుంచైనా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు తెలంగాణ ప్రజలు పాలకులను కోరారు. అయినా ప్రభుత్వ అధినేతలు తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రపూరితంగా వ్యహరిస్తూనే వస్తున్నారు. దీనిలో భాగంగానే ఆ రోజు జరగాల్సిన కార్యక్రమాన్ని జరగకుండా చేసేందుకు రెండు మూడు రోజుల ముందు నుంచే తెలంగాణ ప్రాంత నాయకులను అదుపులోకి తీసుకుని అరెస్టులు చేశారు. బారీకేడ్లు పెట్టారు. జిల్లాల నుండి విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు, ప్రజలు స్వచ్ఛందంగా బయలు దేరినవారిని ఎక్కడికక్కడ కట్టడి చేసారు పోలీసులు. అయిన ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజలు తమ భుజస్కంధాలపై వేసుకుని ముందుకు నడిచిన ఉద్యమ రూపమది.

కాని ఎదో యుద్ధానికి వెళ్తున్నట్లు, ఎదో విధ్వంసానికి వెళ్ళినట్లు, ముదస్తు అరెస్టులు. పోలీసుల పహారాలు, అడుగడుగున పోలీసులతో రోడ్డు దిగ్భందనం (అసలు మిలియన్ మార్చ్ పోలీసులు పిలుపు ఇచ్చినట్లు అనిపించింది) అడుగు తీసి అడుగు పెట్టకుండ ముళ్ల కంచెలు, అయిన ప్రజలు వెనకడుగు వేయలేదు. ఒక్క అడుగుతో మొదలయితేనే సాధ్యం. అదే స్ఫూర్తి. అమరులు, ప్రాణాలు, బలిదానాలు ఆ రోజు ఇంట్లో కూర్చునవాళ్ళను ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది. అందుకే తెలంగాణ ఉద్యమంలోని కర్యకర్తలంతా అరెస్టులై స్టేషన్‌లలో ఉంటే, సామన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ముఖ్యంగా మహిళలు రోడ్లపై కవాతు చేశారు. ఎన్ని ఇబ్బందులను అయినా ఎదుర్కొని నడిచారు. కాని నిర్భంధాన్ని వాళ్ళు జీర్ణించుకోలేకపోయారు. ఉస్మానియా లాఠీ చార్జీలనుంచి, రబ్బరు బులెట్ల నుంచి, బాష్ప వాయువు ప్రయోగాలు, నిర్భంధాలను ఎదుర్కొని వచ్చినవారు. గ్రామల నుంచి బస్సులను చెక్ చేసి దింపితే 50, 60 కి.లో నడిచినవారు, పరీక్షలకు వెళ్ళకుండా విద్యార్థిలు హాల్ టికెట్లు చింపి పరీక్ష కేందాల నుంచి పరిగెత్తుకొచారు.

అంత ఒక్కరొక్కరుగా ముందుకొస్తూనే వున్నారు. ఎన్ని అడ్డంకులు వేసిన మేం ముందుకెళ్తాం అనే స్ఫూర్తి. ఇలాగే తెలంగాణ తెచ్చుకోగలమని ప్రగాఢ వాంఛ. ఒక్క సారిగా భారీకేడ్లను బద్దలు చేసి, ఆ యాత్ర కదులుతుంది.

మా నేలపై మేం నడవాలంటే మా ట్యాంక్ బండ్ మేం ఎక్కలంటే, ఇదేం నిర్భందం? అనే ఆవేశం, ఎవరిని బాధ్యుడిని చేయ్యాలి? ఎవరిని కొట్టాలి? ఎవరిని ప్రశ్నించాలి? ఇదే ఆక్రోశం అక్కడికి చేరిన ప్రతి మనిషిలోను ఉన్నది. అదే మూడు తరాల ఆవేదన, ఆక్రందన, గోస, బాధ ... అన్నింటి మంత్రమే ఆ యాత్ర. అయితే ట్యాంక్ బండ్ మీద గుమిగూడిన జనం, ఆవేశం చాల్లరలేదు.

తెలంగాణ తెస్తాం అన్నవాడ్ని, ఇచ్చేది తేచ్చేది మేమే అన్నవాడ్ని, అది కేశవరావు కావచ్చు మాధుయాష్కి కావచ్చు కేసిఆర్ కావచ్చు అందర్ని ప్రశ్నించింది. కొందరిని తరిమికొట్టింది. మరికొందరిని మందిలించింది. అందరు వచ్చారు. ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమాలు ముగిస్తున్న సమయంలో ఇంకా మిగిలిన అవేశం ... మరింత పెరిగింది.

ట్యాంకుబండ్‌పై ఎటు చూసినా సీమాంధ్ర ప్రతిబింబలే. వాళ్ళ ప్రతిరూపలే, మా చరిత్ర ఏది? అని ఎవరికివారే ప్రశ్నించుకున్నారు. నా నగరం, నా గడ్డ, నా ట్యాంక్‌బండ్ ... ఇక్కడ నేను లేను అని ప్రతివారు ఎవరికి వారుగా ప్రశ్నించుకున్నారు. దారి పొడుగు ఎటు చూసినా మా బందగీలేడు ... మా చాకలి ఐలమ్మ లేదు ... మా కోమరం భీం ... తుర్రెబాజ్‌ఖాన్, షోమాబుల్లాఖాన్, దేవులపల్లి రామానుజరావు మా ముట్నూరి సోమన, వట్టికోట, దాశరధి, భాగ్యరెడ్డి వర్మ, కాళోజీ, 1969 అమరవీరలు ఎవ్వరూ కన్పించలేదు, అందుకే నా భూమిపై నేను లేను అని అనుకున్న ప్రతివాడు, అటువైపు కదలిండు, ఎవరు తమ సహనాన్ని ఆపుకోలేకపోయారు. సీమాంధ్రుల దురాక్రమణ ఆగడాలు పెరిగి పెట్రేగి పోవడాన్ని వారు అంగీకరించలేకపోయారు. దానితో వారి ఆందోళన పతాక స్థాయికి చేరుకుంది. నీళ్ళు, ఉద్యోగాలు, భూములు కాజేసి దోపిడీ దారులుగా తమ వలసాధిపత్యాన్ని తెలంగాణ ప్రజలపై కొనసాగించడాన్ని సహించలేకపోయారు. అంతే... అక్కడ తెలంగాణ ప్రజల మనోవేదన వెల్లడైంది, నిగ్రహం తప్పింది, విగ్రహం కూలింది. రోడ్డుపై పడింది. ఇంకా కోపం చల్లారలేదు. హుస్సేన్‌సాగర్‌లో పడేసేదాక కాని ఆ ఆవేశం జాషువ పైన, శ్రీశ్రీ పైన, వేమన పైన లేదా అల్లూరి పైన కాదు. మాకు కావల్సింది. మా చరిత్ర. మా సంస్కృతి, మా గడ్డపైన మా స్మృతులు ఉండాలనే ఆకాంక్ష. శ్రీశ్రీ కవితలు మా నాలుకలపై నాట్యమాడుతాయి. కావున మేం శ్రీశ్రీని అవమానించాలని తలచలేదు. ఆ ఆలోచన లేదనేది స్పష్టం. కాని మా కోసం పుటకో మాట మాట్లాడే వాళ్ళపైన, రెండు కండ్ల సిద్దాంతపైన .... మళ్ళొచ్చే దసరా ..... దీపావళి .... బతుకమ్మ, .... ఉగాధి..... మన తెలంగాణ రాష్ట్రంలోనే అని సంవత్సరాలు గడుపుతున్న వాళ్ళపైనా ... ఇప్పుడు తెలంగాణ ప్రజలకు విశ్వాసం లేదు. కూలింది విగ్రహాలే మళ్ళీ వాటిని పునర్నిర్మించడానికి ఈ మధ్యే ప్రకటనలు మొదలయినాయి. ఎన్ని జీవోలు తేచ్చిన, తెలంగాణ స్మృతులు (నేటి జయశంకర్ నుంచి, నాటి బందగి వరకు) ప్రతి స్మృతి మా గడ్డ మీద కన్పించాలి ... సహనానికి కూడా సహనం కోల్పోయిన రోజు ఆకాంక్ష ఎంత బలమైందో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు. తెగించి పోరాడే మా తెలంగాణ బిడ్డలు మునుముందుకే సాగుతున్నరు. వలసాంధ్రులను, వారి దోపిడీ పెట్టుబడులను తరమికొట్టేంత వరకు నిద్రపోరు. అందుకే మా మాట, మా బాట, మా బతుకు, మా పని అన్ని జై తెలంగాణ! జై జై తెలంగాణ !!

**- బోనకుర్తి సోమేశ్వర్**
సోషియాలజి లెక్చరర్,
ఉస్మానియా యూనివర్సిటీ
హమారా హైదరాబాద్ పుస్తక సంపాదకులు

# విగ్రహాల కూల్చివేత – నిరసన రూపం

**– అనిశెట్టి రజిత**

ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల్ని పట్టించుకోవాల్సిన ప్రథమ బాధ్యత ప్రజా ప్రభుత్వాలది. ప్రాంతాల నడుమ సమస్యలు తలెత్తినప్పుడు న్యాయబద్ధంగా పరిష్కరించడం కూడా సంక్షేమ ప్రభుత్వపు బాధ్యతే.

మరి తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష గత 33 ఏళ్లుగా నీరుగార్చబడుతున్నది. ఎందుకు? వందలాది మంది ప్రాణాలు ప్రత్యక్షంగా వేలాది మంది ప్రాణాలు పరోక్షంగా అర్ధాంతరంగా, బలవంతంగా ముగిసిపోతుంటే పట్టనట్టు అమానుషంగా ప్రవర్తిస్తూ అమానవీయంగా చెలగాటం ఆడుతున్నారు ఎందుకు?

ఒక వైపు వనరుల దోపిడీ, భూ దురాక్రమణలు, అక్రమ పెట్టుబడులు, ఉద్యోగ–ఉపాధుల దొంగిలింపులు, భాషా సాంస్కృతిక జీవనంపై ఆధిపత్యపు ఉక్కుపాదాలు అన్ని రకాల అణిచివేతలు, దగాలు, మోసం, నయవంచనలు తెలంగాణను డొల్లగా మార్చివేస్తుంటే ఎవ్వరికీ పట్టలేదు.

విశాలాంధ్ర, అన్నదమ్ములు, ఒకే భాష – ఒకే తల్లి, ఒకే రాష్ట్రంగా కలిసి వుండటం ఇవన్నీ వికృత ముఖానికి తొడుక్కున్న మోసపు తొడుగులై వికారంగా చిరుగులుపట్టి వేళ్ళాడుతున్నాయి. అయినా ఏం సఖ్యత? ఎంత అందం అని ఒగలు పోతున్నారు.

ఇప్పుడు సమైక్యాంధ్ర అంటేనే తప్పుడు మాటలా తెలంగాణ ప్రజలు ఏవగించుకుంటున్నారు. సమైక్యాంధ్ర చేదు ఫలాలూ విష ఫలాలతో ఇక్కడి ప్రజలు క్షీణించి పోయి విసిగి పోయారు. నిప్పు అనేది అంటుకున్న తరువాత లేదా అంటించబడిన తరువాత అది క్రమంగా రాజుకొని రాజుకొని రగుల్కొని మంటలుగా ఎగిసిపడక మానదు. పరిసరాలను దహించకుండా ఉండదు. అలాంటిదే నాలుగుకోట్ల మంది తెలంగాణ ప్రజల గుండెల్లో రాజుకున్న ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదం.

ఇది అచ్చమైన వేర్పాటు ధోరణి. అవును వేర్పాటు వాదం కూడా. అందులో తప్పేముంది? ఐక్యత – సమైక్యత అన్ని కాలాలకూ అన్ని సమస్యలకూ వర్తించే మంత్రాక్షరాలు కాదు. ఐక్యతతో సమానత్వం సమైక్యతలో చిత్తశుద్ధీ లోపిస్తే ఒక ప్రాంతం ప్రజల హక్కుల పట్ల ఉల్లంఘన అదే పనిగా జరిగితే ఆ పదాలకు భావనలకు అర్థం లేదు. కలిసి ఉంటూ కలహించుకుంటూ, నిందించుకుంటూ, ద్వేషించుకుంటూ ఉండటంలో ఏ నైతికతా లేదు. విడిపోయి ఎవరికి వారు స్వతంత్రంగా ఆత్మగౌరవంగా ఉండటం మేలు. మానవ గౌరవానికి స్వతంత్ర అనేది అనివార్యమైన అవసరం. రాష్ట్రాన్ని రెండుగా చేయడానికి అందరి ఏకాభిప్రాయం కావాలనడం ఒక అవకాశవాదం.

నిచ్చెనమెట్ల వ్యవస్థలో నిచ్చెన లెక్కడం పీడితులకు కష్టతరమైన పని. కానీ శ్రమించి కష్టించి ఎంతో కాలం వెచ్చించి నిచ్చెన ఎక్కగానే క్షణాల్లో పాము మింగి కిందికి జార్చేస్తుంది. అదీ హృదయ విచారకరమంటే. పనిగట్టుకొని రాతి గుళ్ళను రాతి విగ్రహాలనూ కూల్చడం. చారిత్రక కట్టడాలను సాంస్కృతిక చిహ్నాలను పడగొట్టడం నాగరికమైన చర్య కాదు. సమయాల్నీ, సందర్భాల్నీ బట్టి నాగరికత నిర్వచనాలు మారుతుండటం జరగదా? ప్రజలు చారిత్రక తప్పిదాలు చేస్తే దుయ్యబట్టే పాలకవర్గాలూ వారి దళారీ ఏజెంట్‌లూ, ప్రభుత్వమే ప్రజల ప్రజాస్వామిక న్యాయబద్ధమైన ఆకాంక్షల పట్ల నిర్లక్ష్యంగా వుంటూ పరిష్కార జాప్యం చేయడం కాదా? చారిత్రక తప్పిదం కాదా? ఆ అనర్థదాయకమైన

జాప్యతవల్ల వందలాది ప్రాణాలు ఉసురు పోతుంటే అదేం గొప్పదనం?

సమస్యను ఏదో సాకుతో నాన్చుతూ అపరిష్కృతంగా వొదిలేసి దశాబ్దాలుగా ఉద్యమిస్తున్న ప్రజల సహనాన్నీ శాంతి స్వభావాల్ని గాయపరిస్తే పోరాట రూపాలు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో మారుతుంటాయి.

ప్రజలు! అతి మామూలు ప్రజలు! సామాన్య ప్రజలు. తప్పిదాలు చేసేదాకా చూసి ... తప్పుబడుతూ సమస్యను పక్కకు లాగడం ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల పని. తన తాబేదార్ల, నమ్మిన బంట్ల యాజమాన్య హక్కుల్నీ, రాజకీయ నియంత్రణాధికారాన్నీ యధావిధంగా కొనసాగించనివ్వడం కోసం కోట్లాది మంది ప్రజల అభీష్టానికి చిల్లులు పొడవడం ప్రభుత్వ కుటిల బుద్ధికి నిదర్శనం. క్రూర దృక్పథానికి తార్కాణం.

ధ్వంసం అనేది ఒక క్రీడ కాదు. విధ్వంసం ఉద్యమకారులకు ఆటకోఉల వ్యవహారం కాదు. తమ బాధను వ్యక్తం చేయడానికి సమస్య తక్షణ పరిష్కారం కోసం దృష్టిని ఆకర్షించడానికి సంచలన ప్రతిక్రియగా ప్రజలు ధ్వంస రచనకు పూనుకుంటారు. యుద్ధం ఎందుకు చేస్తున్నారో ఎవరి మీద చేస్తున్నారో తెలియక కాదు. తెలిసీ కొన్ని పడగొట్టే పనులు చేస్తారు. ఆ పరిస్థితిని జడపదార్థంలా గడ్డకట్టుకపోయిన ప్రభుత్వమే కల్పిస్తుంది. కానీ యుద్ధానంతరం ప్రజలు మళ్ళీ చరిత్రనూ సంస్కృతినీ కొత్తగా నిర్మిస్తారు. అది తెలుసుకోవడం మంచిది.

ట్యాంకుబండ్‌పై విగ్రహాలను పడగొట్టిన ప్రజల్ని విధ్వంసకారులనీ ఆ చర్యను విధ్వంసం అనడంలో ఎందుకు కుట్ర ఉన్నది? కూల్చివేతల్ని విధ్వంసం అనడంలో అది ఎంతో పెద్ద నేరంగా కనిపించాలనే ... ఒక ప్రాంత ప్రజల సాంస్కృతిక అవగాహనకు ఆ ప్రజల్ని దూరం చేసిన పాలకవర్గ సాంస్కృతిక అణచివేతను ముందు తెలుసుకొని ప్రశ్నించాలి. నిజంగా విధ్వంసం ఎవరు చేస్తున్నారో విధ్వంసం వల్ల ఎంత లాభపడుతున్నారో సూక్ష్మంగా ఆలోచించి నిష్పక్షపాతంగా నిగ్గుతేల్చాలి.

ఈ పడగొట్టడాలపై రెండు మౌలిక అంశాల్ని ఉద్దేశ పూర్వకంగా ఎందుకు విస్మరిస్తున్నారో ఆలోచించాలి. ఒకవైపు ఆధిపత్య సంస్కృతీ చిహ్నాలను పడగొట్టాం అని ప్రజలు చెబుతున్నారు. విగ్రహాలుగా ప్రతిష్ఠింపబడిన ఆయా మహానుభావులపై ఎలాంటి విద్వేషం లేకపోగా గౌరవాభిమానాలే ఉన్నాయి. ఇష్టమైన వాటిని పోగొట్టుకోవడం, వందలాది యువకుల ఆత్మాహుతులన్నీ అల్లాటప్పా విషయాలు కాదు. విషాదాలు విస్ఫోటించే అంశాలు. ఆ కూల్చివేతలకన్నా వందలాది యువతరం ప్రాణాలే మాకు మిన్న అని ప్రజలు కొత్త నినాదం చేస్తున్నారు.

ప్రాంతీ విభేదాలు, ద్వేషాలూ, అస్తిత్వ విధ్వంసాలూ, వనరుల దోపిడీ, అన్ని రంగాల్లో అణిచివేతలూ, అవహేళనలూ చేసిన వారే ఇప్పుడు ప్రాంతీయ పరిమితులూ, విశాలత్వం గురించీ – సాహిత్యం, కళలకు బేధభావాలూ ఎల్లలూ లేవని దీర్ఘాలు తీస్తూ మాట్లాడుతున్నారు. అవన్నీ ఎవరికి తెలియవు గనుక? సుద్దులు చెప్పే ముందు బుద్ధుల్ని సరిచేసుకోవడం మంచిది. లోకంలోని ఐడెంటిటీ ఉద్యమాలన్నీ సంకుచితమైనవే అయితే తెలంగాణ అస్తిత్వ ఉద్యమం కూడా సంకుచితమైనదే. నిజంగా  మాకు సంకుచితత్వం అనేది ఉన్నదో లేదో ప్రపంచానికి తెలుసు. కానీ అసలు ఐడెంటిటీ అనేది దుమ్ములో కలిసి పోతుంటే దాన్ని కాపాడుకొని జీవింప చేసుకోవాలనుకోవడంలో జాతి పౌరుషం ప్రధాన ప్రేరకంగా వుంటుంది. ఈ విషయంలో ఎవరి నేర్పరితనాలనూ మేము కోరుకోవడం లేదు. ఒక ఘటనను నెపంగా చేసుకొని మొత్తం ఉద్యమాన్నే దోషిగా చేయడమే సంకుచితత్వం. అవగాహనా లోపం. ఒక కల్చర్ మీద దాడి అనేది ఎప్పుడూ బాధాకరమే. అయితే దశాబ్దాలుగా తెలంగాణ కల్చర్‌ను నామ రూపాలు లేకుండా మింగేస్తున్న ప్రాంతీయ ఆధిపత్య తిమింగళం చేస్తున్న దాడి గురించి ముందు మాట్లాడితే బాగుంటుంది. కొంతమంది పెద్దలకు మేధావులకూ మానవతావాదులకు విగ్రహాలు ముఖ్యమా? ప్రాణాలు ముఖ్యమా అనేది ఇప్పుడు తేలిపోతుంది.

విగ్రహ విధ్వంసం అనేది ఒక ఉద్యమాగ్రహానికి సంకేతం. ఒక ఆందోళనా రూపం. రాజకీయ చేతగానితనం పట్ల కట్టలు తెంచుకున్న అసహనం. అది అవసరమా? అనవసరమా? అనేది దానికి అర్థం లేదు. విగ్రహాలు సరే, పోయిన ప్రాణాలు తిరిగొస్తాయా అనే ఆలోచన ఆవేదన కొంచెమైనా లేదెందుకు? సమస్యను మురగబెడ్తున్న

వారిని ప్రశ్నించాలి? సమస్య తెగకుండా అడ్డుపడ్తున్న వారిని నిలదీయాలి. సంయమనం ... విజ్ఞతలకు కాలపరిమితి అంటూ ఉండదా? కడుపులు మాడ్చుకుంటూ కదం తొక్కుతున్న వారి ఆకాంక్షకు విలువ లేదా?

వివక్షతను ఎంతకాలం భరిస్తారు ఎవరైనా? తమ ప్రాంత వైతాళికులకు దక్కనివ్వని చోటునూ, జరిగిన అవమానాన్నీ ఇంకా ఎందుకని ఎంతకాలమని సహిస్తారు. రాజకీయ వైఫల్యాన్ని దుయ్యబట్టాల్సిన వారు కాలం చెల్లిన నీతుల్ని ఇంకా మల్లిస్తున్నారు. కండ్లకు కనిపిస్తున్నది కానరానట్లు నటిస్తున్నారు. ఆత్మగౌరవం ఒక ప్రాంత, వర్గ ప్రజలకు సంబంధించిన బ్రహ్మ పదార్థంగా ప్రవర్తిస్తున్నారు?

ఒక జాతి ప్రజల భాషా సంస్కృతుల్ని ఆదరించలేని వారు ఒక జాతి ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించలేని వారు ఏమైనా మాట్లాడే అర్హతను కోల్పోతారు. ఇంకా చిలుంపట్టిన వాదులు ఎవరికి వినిపిస్తారు?

తెలుగు ప్రజల మహనీయుల్ని గుర్తించడంలో ఒంటికన్ను రాకాసి తత్వాన్ని ప్రదర్శించి జబర్‌దస్తీగా నెత్తినెక్కి కూర్చున్నవాళ్ళు ఇకనైనా గుణపాఠం నేర్చుకున్నారా లేదా అనేది మా ప్రశ్న. నిర్మాణాలు జరుగుతాయి! సగౌరవంగా ప్రేమ పూర్వకంగా ... ఓపిక పట్టండి. అన్ని ప్రాంతాల వైతాళికులూ కొలువుతీరుతారు. జాతికి స్ఫూర్తిగా ... రాష్ట్రం చీలిపోయి రెండు తెలుగు రాష్ట్రాలు మొదట ఏర్పడనీయండి. ప్రజాకాంక్ష, ప్రజాగ్రహం ధర్మబద్ధమైనదయినప్పుడు దాన్ని సహృదయంతో అర్థం చేసుకొని గౌరవించడమే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి. ప్రజా కళలూ, సాహిత్యం, సంస్కృతీ ఉద్యమాలూ వర్ధిల్లాలి! తెలుగు జన వైతాళికులకు జోహార్లు!

***– అనిశెట్టి రజిత,***
'తెరవే' ఉపాధ్యక్షురాలు

విరుగుడు పుస్తకం నుంచి

## కాచుకో...!

ఆరువందల అమరులు
సజీవ దహనం చేసుకున్నప్పుడు
రాని కన్నీరు
నిర్జీవ విగ్రహాలను కూల్చితే వచ్చిందా?
విగ్రహాలు కూల్చడం అయిపోయింది
ఇగ కూల్చవలసింది
తెలంగాణ వ్యతిరేకుల్నే
ఖబర్దార్ ఆంధ్రుడా..!
కాచుకోరా తెలంగాణ దెబ్బ

***– తగుళ్ళ గోపాల్***

దిమ్మిస వినిర్మాణ కవిత్వం

# మిలియన్ మార్చ్ ... మీకెందుకు భయం

**– పోటు నారాయణ**

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు మొదలై అరబ్ ప్రపంచంలో ప్రకంపనలు పుట్టిస్తున్న విషయం అందరికీ విధితమే. అక్కడి ప్రజలు ఎన్నో ఏండ్లు అనుభవిస్తున్న దోపిడీ, పీడనల నుంచి విముక్తి కోరుకుంటున్నారు. 23 ఏళ్ల యువకుడి ఆత్మార్పణలో ట్యునీషియాలో మొదలైన ప్రజా విప్లవం ప్రపంచ నిరంకుశ ప్రభుత్వాలను కుదిపేస్తోంది. మొన్న ట్యునీషియాలో బెన్ అలీ, నిన్న ఈజిప్టులో ముబారక్, నేడు లిబియా గడాఫీలను గద్దె దింపేస్తున్నాయి. సాధారణంగా ప్రజా ఉద్యమాలు ఒక ప్రాంతంలోనో, కొన్ని ప్రాంతాల్లోనో జరుగుతాయి. కానీ అరబ్బు దేశాలలో అన్ని ప్రాంతాల ప్రజలు ఒకే దగ్గర ఉద్యమం చేసి విజయం సాధించారు.

మిలియన్ మార్చ్ అంటే ఆయా వర్గాలకు చెందిన ప్రజలు ఒక దగ్గరికి చేరి తమ ఆకాంక్షను తెలియపరిచి మొండి ప్రభుత్వాలకు తమ సత్తాను చూపించడమే. అందుకే కైరోలో 20 లక్షల మందితో 'మిలియన్ మెన్ మార్చ్' నిర్వహించిన మూడు రోజులలో తమకు స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛని కావాలని నిరంకుశ పాలకులకు డెడ్‌లైన్ విధించి, విజయం సాధించారు.

ఎన్నో ఏళ్లుగా అమాయకంగా బతుకుతూ ఆకలి, అవమానాలను భరిస్తూ, కాలయాపన కమిటీల మీద ఆశలు చంపుకొని, కల్లబొల్లి కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయిన తెలంగాణ ప్రజానీకం శాంతియుత పంథాలో సమరానికి సిద్ధమైంది. అంతర్జాతీయ సమాజానికి యుద్ధ పాఠాలు నేర్పిన తెలంగాణ అమరవీరుల స్వప్నాలను నిజం చేద్దామని మిలియన్ మార్చ్ సిద్ధమైంది. ప్రశాంతంగా పది జిల్లాల ప్రజలు హైదరాబాదు నడిబొడ్డున పది లక్షల మందితో తమ ఆకాంక్షలను 'జై తెలంగాణ' నినాదంతో కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వాలకు తెలియజేయాలని అనుకున్నారు. అంతలోనే సీమాంధ్ర పాలకవర్గాల గుండెల్లో గుబులు పుట్టి అలజడి మొదలైంది. ఎలాగైనా మిలియన్ మార్చ్‌ని అడ్డుకోవాలని అంతటా నిషేధాజ్ఞలు విధించారు. నిజంగా గత 46 సంవత్సరాలుగా సీమాంధ్ర పెట్టుబడిదారులు, పాలకవర్గాలు తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి, దక్కాల్సిన వాటాలను ఇస్తే అంత భయం ఉండకపోవచ్చు. కానీ ఏలిన వారంతా చేసిన అభివృద్ధే సీమాంధ్ర పెట్టుబడిదారుల స్వంత ఆస్తులను పెంచి కార్పొరేటీకరణ చేయడమే. అందుకే వారికి మిలియన్ మార్చ్ అంటే భయం.

శాంతియుత ప్రదర్శనకు అనుమతి నిరాకరించి అడుగడుగునా అడ్డంకులు సృష్టించి తన నిరంకుశత్వాన్ని బయట పెట్టుకుంది కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం. ప్రజలందరూ హైదరాబాద్ వస్తే తెలంగాణ ఆకాంక్ష మరోసారి పెద్ద ఎత్తున బాహ్య ప్రపంచానికి తెలుస్తుందని ఇక్కడి ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. దారులన్నీ ప్రభుత్వ సాయుధ బలగాలతో దిగ్బంధించారు. తెలంగాణ ప్రజలు తెగింపుకు ఏనాడు వెనకడుగు వేయలేదు. చావోరేవో తేల్చుకొని భవిష్యత్తుకు వెలుగు బాటలు వేయాలని అనుకుంటారు. అందుకే మార్చి 10న తెలంగాణలోని పది జిల్లాల ప్రజలు హైదరాబాద్‌కు వస్తూ అక్రమ అరెస్టులకు, గృహ నిర్బంధాలకు గురయ్యారు. ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం అంటూ ఇంటింటా ఇందిరా ఫాసిజాన్ని అమలు చేసింది. ఇంటర్ విద్యార్థుల వార్షిక పరీక్షల కారణంగా ప్రజలు కాస్త ఆలస్యంగా ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న ప్రజానీకాన్ని పోలీస్ బలగాలతో

చెదరగొట్టడం ఆరంభించింది కిరణ్ ప్రభుత్వం.

ప్రభుత్వ సాయుధ మూకలు ప్రజలను అక్కడి నుంచి తరిమే ప్రయత్నం చేశాయి. అనేక అడ్డంకుల్ని ఛేదించుకొని తమ ఆకాంక్షను వ్యక్తపరిచేందుకు వచ్చిన ప్రజలపై పోలీసులు ప్రతాపం చూపించారు. దీనితో ఆగ్రహానికి లోనైన ప్రజలు అక్కడి విగ్రహాలను కూల్చడం మొదలు పెట్టారు. వాస్తవానికి ఇది సరైనది కాదు, కానీ దీని వెనక ఎంతో ఆవేదన, ఆకలి ఉన్నదని గుర్తించకుండా ఉద్యమకారులను ఉద్రిక్తులను చేసి ఉగ్రవాదులనడం సరైంది కాదు. మిలియన్ మార్చ్‌కి అనుమతి ఇవ్వని ప్రభుత్వం మరుసటి రోజు కోస్తాంధ్రులకు హైదరాబాద్‌లో ప్రదర్శనకు అనుమతి ఇచ్చింది. వారు తెలంగాణ వాదులపైన చేస్తున్న విమర్శలకు ప్రభుత్వం వంతపాడటం మొదలు పెట్టి తెలంగాణ ప్రజలపైన వివక్షతను మరోసారి వెల్లగక్కింది. విగ్రహాల విధ్వంసం తెలంగాణ ప్రజల సంస్కృతి కాదు అని ప్రపంచానికి తెలుసు కానీ మిలియన్ మార్చ్‌కి అనుమతి ఇచ్చి వుంటే ఇంత వరకు వచ్చేది కాదు కదా. మంది సొమ్ముతో మేడలు కట్టుకున్న సీమాంధ్ర పాలకవర్గాలకు తమ గుట్టు రట్టవుతుందనే భయంతో మిలియన్ మార్చ్‌కు అనుమతి నిరాకరించారు. అంతిమంగా తెలంగాణ ప్రజలు ఎక్కడికక్కడ జమగూడి అరాచక ఆంధ్రపాలకులకు తమ ఆకాంక్షను తెలియపరిచారు.

తెలంగాణ గళం పత్రిక
మార్చ్, 2011

**– పోటు నారాయణ**
సెంట్రల్ యూనివర్శిటీ

## రాళ్లవాన

ఊరు ఊరంతా ఒక్కటైంది
ఒక్కటైన ఊరు ఒక్క బాటయ్యింది
బాటంటె గొంతెత్తిన ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష
పిడికిలెత్తిన నిప్పు కణికల వెల్లువ
ఉప్పెనై ఉప్పొంగిన నెత్తుటి సలసల
సీమాంధ్ర పెత్తనాన్ని నిలదీసిన సుడిగాలి
చౌరస్తాను దిగ్బంధం చేసిన పద్మవ్యూహం
నాయకులను ఉద్యమ శిబిరాల వైపు
ఉరికిస్తున్న ఉక్రోషం ధర్మాగ్రహం
మానుకోట మట్టిని పిడికిట పట్టి
సీమాంధ్ర కాలనీలపై – అగ్గిపుల్ల
షాపింగ్ మాల్‌లపై – రాళ్లవాన

క్విట్ తెలంగాణ

**– ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్**

# ఆ రోజు ఏం జరిగిందంటే..!

**– పల్లె రవికుమార్**

ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న ఆధునిక రాచరిక వ్యవస్థను, దాన్ని నడిపే రారాజులను కదిలించేందుకు ఇలాంటిదొక శక్తివంతమైన ఉద్యమ రూపంగా అప్పటికప్పుడు ప్రదర్శించిన ధర్మాగ్రహమే. తెలంగాణకు మందు పాతరలు పేల్చడమూ వచ్చు. తమ ఆత్మగౌరవం కోసం మందుపాతరై పేలే తెగింపూ ఉంది. పోరాటం, త్యాగం, తెగువ ఈ మట్టి సహజ లక్షణం. తెలంగాణ ప్రజల ధర్మాగ్రహంలోని ధర్మసూక్ష్మాన్ని గ్రహించకపోతే వారు సెలవిచ్చినట్లుగా ఏ పరిణామమైనా జరగొచ్చు. దానికి వారిదే బాధ్యత. తెలంగాణ ప్రజల న్యాయమైన, ధర్మమైన పోరాటం ఎప్పటికైనా జయించి తీరుతుంది. అది ఒక వాస్తవం ... ఒక చరిత్ర ...

మార్చి 10 ... మిలియన్ మార్చ్ సమయంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఉన్న పలువురు తెలుగు ప్రముఖుల విగ్రహాల కూల్చివేతపై చాలా మంది వారికి తోచినట్లుగా మాట్లాడుతున్నారు. కొందరైతే ఇదే అదనుగా ఇష్టానుసారంగా ... ఆ రోజు అక్కడ ఏం జరిగిందో తెలియకుండా బాధ్యతారాహిత్య విమర్శలతో తెలంగాణవాదులను మరింత రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ఆ సంఘటనకు పురిగొల్పిన చారిత్రక, రాజకీయ పరిస్థితుల (ప్రత్యేకించి మిలియన్ మార్చ్ పట్ల ప్రభుత్వం అనుసరించిన నిర్బంధ విధానం) పట్ల ఏ మాత్రం పట్టింపులేకుండా తెలుగుజాతి చారిత్రిక, సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని ధ్వంసం చేయడం కోసమే మిలియన్ మార్చ్ నిర్వహించినట్లుగా విషం గక్కడం చూస్తుంటే వారిలో తెలంగాణ ప్రజల ఆకాంక్షల పట్ల ఉన్న వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. సీమాంధ్ర ప్రజల పట్ల జీవితాల పట్ల బాధ్యత కంటే తమ వాణిజ్య, వ్యాపార లావాదేవీలే పరమావధిగా పనిచేసే అక్కడి సీమాంధ్ర (సోకాల్డ్ సమైక్యాంధ్ర వాదులు) ప్రజా ప్రతినిధులు ఈ విధంగా మాట్లాడటం విడ్డూరం కాదు. కానీ ... విజ్ఞులైన ఆ ప్రాంత విద్యావంతులు, మేధావులు కూడా అదే విధంగా మాట్లాడటం ఇక్కడ గమనించాల్సిన విషయం. మీరు (తెలంగాణవారు), మేం (సీమాంధ్రులం) అన్న వేరుకోణంలో చూసినట్లుగానే ఉంది తప్ప తెలంగాణ ప్రజల కష్టాలు – కన్నీళ్లు, ఆరు దశాబ్దాలుగా అన్ని రంగాల్లో అనుభవించిన వివక్ష, దోపిడీ, నిర్బంధం, అణచివేతలతో రగులుతున్న గుండెల ఆర్ద్రతను అర్థం చేసుకున్న విజ్ఞతను వారు ప్రదర్శించలేదు. ఐదున్నర దశాబ్దాలుగా తెలంగాణ పట్ల రాజకీయ, సాహితీ, సాంస్కృతిక, చారిత్రక కుట్రల నేపథ్యంలో గూడు కట్టుకుని ఉన్న ఆవేదన, ఆక్రందన, ఉక్రోశం, ఆవేశం ఆ రూపంలో వ్యక్తమైందేతప్ప రాజకీయ పండితులు, సోకాల్డ్ సమైక్యాంధ్ర వాదులు విశ్లేషణలు చేస్తున్నట్లుగా విగ్రహాల కూల్చివేతకు ఎలాంటి వ్యూహాలు, ప్రణాళికలు లేవన్నది ముమ్మాటికీ అంగీకరించాల్సిన వాస్తవం. అది అర్థం చేసుకోవడానికి ఆ రోజు ఏం జరిగిందన్నది నిష్పాక్షికంగా ఆలోచించగలిగే మనసుండాలి మరి.

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులం మేం ఆ రోజు ట్యాంక్‌బండ్ సమీపంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవడానికి దాదాపు రెండు గంటలు పైగానే పట్టింది. ఎన్నో అవాంతరాలు, చెకింగ్‌ల మధ్య ఏదో ఒక విధంగా మధ్యాహ్నం 12.30 గంటలకు అక్కడికి చేరుకోగలిగాం. అప్పటికే అక్కడకు చేరుకుంటున్న తెలంగాణవాదులు, ఉద్యమకారులను యుద్ధ ప్రాతిపదికన

అరెస్టులు చేస్తూ పోలీసు స్టేషన్లకు తరలించడం నిరంతరంగా జరుగుతూనే వుంది. ఒక్కసారిగా ఎక్కువ సంఖ్యలో జర్నలిస్టులు అక్కడికి రావడాన్ని గమనించిన డి.ఐ.జీ శ్రీనివాస్‌రెడ్డి అక్కడి నుంచి మమ్ములను కూడా వెళ్లి పోవాలని, లేనిపక్షంలో జర్నలిస్టులను కూడా అదుపులోకి తీసుకుంటామని మైక్‌లో పదే పదే హెచ్చరికలు చేస్తున్నాడు. అది సరైంది కాదని జర్నలిస్టు మిత్రులు ఆయనతో వాదనకు దిగినప్పటికీ ఫలితం లేదు. దానితో ఆగ్రహించిన జర్నలిస్టు మిత్రులు ట్యాంక్‌బండ్ వైపునకు దూసుకుపోయాం. ఇదే సమయంలో అప్పటికే ఆగ్రహంతో రగిలిపోతున్న తెలంగాణ ఉద్యమకారులు జి.హెచ్.ఎం.సీ మెయిన్‌గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను ఇరగ్గొట్టుకుని వందలాదిగా దూసుకువచ్చారు. దానితో ట్యాంక్‌బండ్ చుట్టూ ప్రభుత్వం వేసిన ఇనుపముళ్ల కంచె, ఇనుప గోడలను బద్ధలుకొట్టి సరిగ్గా మధ్యాహ్నం ఒంటి గంట (నిర్దేశిత సమయం)కు ఐదు నిమిషాల ముందే ట్యాంక్ బండ్‌పైకి వందలాదిగా చేరుకున్నాం. ఆ క్షణాల్లో ప్రతి ఒక్కరి ముఖాల్లో కనిపించిన ఉత్సాహం, ఆనందం (2009 డిసెంబర్ 9వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలు పెడుతున్నట్లు కేంద్ర హోం మంత్రి సి. చిదంబరం ప్రకటన చేసినపుడు వెల్లడైనట్లుగా) తెలంగాణ రాష్ట్రమే సాధించుకున్నట్లుగా ఉంది. అంటే ప్రజాస్వామ్యయుతంగా ఒక నిరసనను తెలియజేయడానికి ఉద్దేశించిన మిలియన్ మార్చ్ పట్ల ప్రభుత్వం ప్రదర్శించిన నిర్భందం, అణచివేత ఒక కల్లోలిత, యుద్ధ ప్రాంతాన్ని మించిపోయింది. అప్పటికే గడచిన దశాబ్దానికి పైగా శాంతియుతంగా సాగుతున్న మలిదశ తెలంగాణ పోరాటంలో ఎన్నడూ హింసాత్మక సంఘటనలు జరగలేదు. 1969 ఉద్యమ అనుభవంతో తెలంగాణ ఉద్యమకారులెవరూ ఆ విధంగా జరగొద్దని భావిస్తున్నారు. ప్రభుత్వం ముసుగులో ఉన్న సీమాంధ్ర పెట్టుబడిదారులు, వారి తాబేదార్లే హింస జరగాలని కోరుకుంటున్నారన్నది నిష్ఠుర సత్యం. ఎప్పటి మాదిరిగానే తెలంగాణ ఆకాంక్షను రాజకీయాలకు అతీతంగా మరోసారి శక్తివంతంగా తెలియజేయడానికి ఎంచుకున్న రూపమే 'మిలియన్ మార్చ్'. కారణాలేమైనా రాజకీయ పక్షాలు చివరి క్షణాల్లో ఒక అడుగువేస్తే ... తెలంగాణ ప్రజలు తెగించి స్వచ్ఛందంగా పాల్గొనడానికి ముందుకు వచ్చారు. కానీ పాలకులు దాన్ని ఒక యుద్ధ నివారణ చర్యగా భావించి, ఎన్ని రూపాల్లో అడ్డుకోవచ్చో అన్ని ప్రయత్నాలు చేసింది. వేటికీ ప్రజలు జంకలేదు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వాన్ని రెండు మూడు రోజుల ముందే అరెస్టులు, బైండోవర్లు చేసింది. తెలంగాణ అంతటా వేలాది సంఖ్యలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. అయినా ప్రజలు అన్నింటినీ ఛేదించుకుని ట్యాంక్‌బండ్‌కు చేరుకోగలిగారు. ప్రభుత్వ రక్షణ వలయాలను ఛేదించుకుని ఏ మాత్రం చిన్న ద్వారం దొరికినా దాంట్లో నుంచి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చారు. నిచ్చెనలు, తాళ్లతో ట్యాంక్‌బండ్‌పైకి ఎగబాకారు. కొద్ది నిమిషాల్లోనే అక్కడికి వేలాది సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు చేరుకోగలిగారు.

ఒక ప్రజాస్వామ్య దేశంలో, సొంత ప్రాంతంలో శాంతియుతంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేయడానికి ఇంత నిర్భంధమేంటి? తెలంగాణ పట్ల ఎందుకింత అణచివేత? ఈ పరిస్థితి ఇంకెంతకాలం? అన్న కసి, ఆవేశం, ఉక్రోశం, ఆవేదనతో అక్కడికి చేరుకున్నవారు ఊగిపోవడం కనిపించింది. దీన్ని ఏదో ఒక విధంగా వ్యక్తం చేయాలన్న వాంఛ మొదలైంది. అది అప్పటికే తెలుగు వెలుగుల పేరుతో ట్యాంక్‌బండ్‌పై ఉన్న సాహితీ, సాంస్కృతిక, రాజకీయ ప్రముఖుల్లో తమవారికి సముచిత స్థానం లేకపోగా సంబంధంలేని వారిని తమపై రుద్దారన్న భావన తెలంగాణ ప్రజల్లో బలంగా ఉన్నమాట వాస్తవం. అనేక సందర్భాల్లో ఆ విషయాన్ని బహిర్గత పరిచినప్పటికీ నిర్లక్ష్యం చేసింది నిజం కాదా? తెలంగాణ ప్రాంత సాహితీ, సాంస్కృతిక, చారిత్రిక విశిష్టతను అణచివేసి సీమాంధ్ర వైభవాన్ని ఈ ప్రాంతంపై రుద్దే ప్రయత్నం ఐదున్నర దశాబ్దాలుగా జరుగుతున్నదన్నది తెలిసిందే కదా. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వాల లక్షణమా? ఈ విషయంలో తెలంగాణేతర ప్రముఖులెవరూ ఎపుడూ ఎందుకు ప్రశ్నించలేదు? ... అన్న భావన బలంగా ఉన్న నేపథ్యంలో మిలియన్ మార్చ్ పట్ల సీమాంధ్ర పాలకులు అనుసరించిన వైఖరి అక్కడికి చేరుకున్న తెలంగాణవాదుల ఆగ్రహానికి తోడయింది. మనది కాని చరిత్ర, మనది కాని సంస్కృతి మనకు అక్కర్లేదన్న ఉద్దేశంతో వారి దృష్టి విగ్రహాలపై పడింది. ఆ విషయాన్ని మాతో ప్రస్తావిస్తే వద్దని నివారించాం. ఊరుకున్నారు. ఆ తర్వాత

మధ్యాహ్నం మూడు గంటలకల్లా ట్యాంకుబండ్ జనప్రవాహమైంది. అప్పటికే చాలా మందిలో ఏ ప్రతిమలనైతే అడ్డం పెట్టుకుని అన్ని రంగాల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారో వాటిని కూల్చివేయడం ద్వారా సీమాంధ్ర పాలకులకు హెచ్చరికలు చేయాలన్న ఉద్దేశంతో మొదలైంది. అది ఎవరు మొదలు పెట్టారన్నది చెప్పలేం .... కానీ ... జరిగిన దానిపట్ల అక్కడకు వచ్చిన మెజారిటీవారిలో వ్యతిరేకత మాత్రం వ్యక్తం కాలేదు. ఆ విధంగా విగ్రహాల కూల్చివేత అప్పటికప్పుడు మొదలైందే తప్ప దాని వెనకా ముందూ ఎలాంటి వ్యూహం లేదన్నది అక్షర సత్యం. దానికోసం ఉపయోగించిన పరికరాలు అక్కడ విరగ్గొట్టిన బారికేడ్లు, తాళ్లు, ఇనుప చువ్వలే తప్ప బయటి నుంచి తెచ్చిన పారలు, గడ్డపారలు కావు. పైగా కూల్చని కొందరి పేర్లనూ కూడా కూల్చినట్లుగా చెబుతూ ఆ వర్గాల్లో తెలంగాణ ఉద్యమం పట్ల వ్యతిరేకత భావన కల్పించాలన్న కుట్ర మాత్రం స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత మాట్లాడిన వారు తాలిబాన్లు, విధ్వంసకారులు ... ఇలా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. తన విముక్తి కోసం, స్వేచ్ఛా వాయువుల కోసం, స్వయంపాలన కోసం తెలంగాణ ప్రజలు తరతరాలుగా అనేక రూపాల్లో పోరాటాలు చేశారు. చేస్తూనే వున్నారు. ఆ మహత్తర పోరాటంలో ఈ అనేక రూపాల్లో ఇక్కడ రక్తతర్పణ, ప్రాణత్యాగాలు, ఆత్మార్పణలు జరుగుతూనే వున్నాయి. ఆ త్యాగాల లక్ష్యం నెరవేర్చకపోగా వాటిని తక్కువ చేసి మాట్లాడటం తెలంగాణ సగటు ప్రజల్లో కసిని రేకెత్తిస్తున్నది. నిరంతరం విశ్వాస ఘాతుకానికి గురవుతున్నామన్న ఆగ్రహంతో ఉన్నారు తెలంగాణ ప్రజలు. దానికి ముగింపు పలకాలన్న కార్యదీక్షతతో ప్రజాస్వామ్యం ముసుగులో ఉన్న ఆధునిక రాచరిక వ్యవస్థను, దాన్ని నడిపే రారాజులను కదిలించేందుకు ఇలాంటిదొక శక్తివంతమైన ఉద్యమ రూపంగా అప్పటికపుడు ప్రదర్శించిన ధర్మాగ్రహమే. తెలంగాణకు మందుపాతరలు పేల్చడమూ వచ్చు. తమ ఆత్మగౌరవం కోసం మందుపాతరై పేలే తెగింపూ ఉంది. పోరాటం, త్యాగం, తెగువ ఈ మట్టి సహజ లక్షణం. తెలంగాణ ప్రజల ధర్మాగ్రహంలోని ధర్మసూక్ష్మాన్ని గ్రహించకపోతే వారు సెలవిచ్చినట్లుగా ఏ పరిణామమైనా జరగొచ్చు. దానికి వారిదే బాధ్యత. తెలంగాణ ప్రజల న్యాయమైన, ధర్మమైన పోరాటం ఎప్పటికైనా జయించి తీరుతుంది. అది ఒక వాస్తవం ... ఒక చరిత్ర ...

**- పల్లె రవికుమార్**

జనపత్రిక
15 మార్చి, 2011

## త్రిలింగపాంచభౌతికం

ఎవడి నెత్తురు ఈ నీరు?
ఎవడి దేహం ఈ భూమి?
ఎవడి శ్వాస ఈ గాలి?
ఎవడి బతుకు ఈ ఆకాశం?
ఎవడి దుఃఖం ఈ అగ్ని?

**- దెంచనాల శ్రీనివాస్**

క్విట్ తెలంగాణ

# థింక్ బండ్

**– జూలూరు గౌరీశంకర్**

మిలియన్ మార్చి 10 నాడు ట్యాంక్‌బండ్ పై జరిగింది. తెలుగు తేజోమూర్తుల విగ్రహాల కూల్చివేతకాదు. తెలంగాణ తన చరిత్రను తాను రాసుకోవటానికి శ్రీకారం చుట్టిన రోజు తరతరాలుగా తొక్కివేయబడ్డ తన చరిత్రను, సంస్కృతిని నిలబెట్టుకునే క్రమంలో జరిగిన పెనుగులాటలో ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు నేలకూలాయి. ఎన్నెన్ని విజ్ఞప్తులు, ఎన్నెన్ని ఆందోళనలు, ఎన్నెన్ని నిరసనలు, ఎన్నెన్ని ఎన్నెన్ని ఆగ్రహారూపాలు, ఎన్నెన్ని లాఠీదెబ్బలు, ఎంతెంత నొత్తురోడడం, ఎన్నెన్ని బుల్లెట్ల వర్షాలు, ఎన్నెన్ని భాష్ప వాయువులు, ఎంతెంత సహనం, ఎన్నేళ్ల నిట్టూర్పుల ఆవేదనలు. ఎన్ని కోట్ల మంది ఆశల ఎదురుచూపు తాకిడికి పట్టుసడలిన నిగ్రహానికి గుర్తుగా ట్యాంక్‌బండ్ పై విగ్రహాలు కూలాయి. కూలిన విగ్రహాల సంఖ్యెంత? ఎవరెవరి విగ్రహాలు కూలాయి? ఎవరెరి విగ్రహాలు హుస్సేనుసాగర్‌లోకి విసిరేయబడ్డాయి. తెగి మిగిలిన అన్నమయ్య విగ్రహాల కాళ్లు.. ఎన్నాళ్ల నుంచో సంకెళ్ల మధ్యన వున్నవాడి చేతులు ఒక్కసారిగా తెంచుకొని నిలబడ్డ ఒక స్వేచ్ఛా మానవుని ఆనందపు అరువులకు ట్యాంకుబండ్‌పై నాటిన సాంస్కృతిక అధిపత్యాన్ని ఒక్కసారి కుప్పకూలినట్లు అయ్యింది.

1969 ఉద్యమం 369 మంది అమరత్వం, వీరతెలంగాణ సాయుధ పోరాటం 4 వేల మంది నేలరాలారు. విప్లవోద్యమాలు ఎగిసిన తెలంగాణ నేలలో 1970ల తర్వాత ఇప్పటివరకు 10వేల మంది అటు నక్సల్స్, పోలీసులు అసువులు బాసారు దినపత్రిక తెరిస్తే ఎక్కడ ఎదురుకాల్పులల్లో తెలంగాణ బిడ్డలు నెత్తురు ముద్దలయి ఎగిసి పడతారో తెలియదు. 1990ల నుంచి ఊపందకున్న మలిదశ తెలంగాణ ఉద్యమం ఇప్పటికి 800 మందికి పైగా ఆత్మబలిదానాలు చేసుకున్న సందర్భం. ఇవన్నీ తెలంగాణ చరిత్ర పటం.

ఒక పక్క తెలంగాణ విలవిలలాడుతూ ముందుకు సాగుతున్న తరుణంలో తెలంగాణ గొంతు మీద ఒకే భాష పేరుతో, ఒకే తల్లిపేరుతో అధిపత్యవాద సంస్కృతిని బలవంతంగా రుద్దారు. పాఠ్యపుస్తకాలు, సినిమాలు, దినపత్రికల్లో ఆంధ్రా అధిపత్య భాషను చెప్పి అదే తెలుగు భాష అన్నారు. తెలుగు సంస్కృతి పేర తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేశారు. తెలుగు సాహిత్యం పేరు మీద తెలంగాణ సాహిత్యం గొంతు పిసికి చంపేశారు. కేంద్ర సాహిత్య అకాడమీకి ఇప్పటి వరకు వచ్చిన 47 అవార్డుల్లో ఒక ఆరు తప్ప అన్ని సీమాంధ్రులవే. ఇప్పటి వరకు వచ్చిన 200 పద్మశ్రీ అవార్డులో ఓ 20 తప్ప మిగతావన్నీ సీమాంధ్రుల ఖాతాలోనే వేసుకున్నారు. ఎప్పుడైనా, ఎక్కడనుంచైనా ఒకవేళ అనుకోని విధంగా 1969లాగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు ఎగుస్తాయేమోనని ముందస్తు చర్యగా హైద్రాబాద్‌లోని ట్యాంక్ బండ్ పై తెలుగు వెలుగుల పేరుతో తెలుగు మహానీయుల పేరుతో 33 విగ్రహాలను ఎన్టీఆర్ హయములో వేశారు. ఇందుకోసం ఎన్టీఆర్ తీసుకున్న శ్రద్ధ అంతా ఇంతా కాదు. తెలుగు తేజోమూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన పేరుతో తెలంగాణ సంస్కృతిని ఆణగద్రొక్కటమనే కుట్ర ఉందని తెలంగాణవాదులే కాదు, తెలంగాణ సాహిత్య సాంస్కృతిక రంగానికి చెందిన వాళ్లు గత రెండు దశాబ్దాలుగా చెబుతూనే వస్తున్నారు.

ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠింబడ్డ తెలుగు సాహితీ మూర్తుల పేర తెలంగాణ మహానియులను కనరాకుండా చేశారు. ఆ విగ్రహాల ప్రతిష్ఠించే సమయానికే తెలంగాణకు చెందిన వైతాళికులు ఎందరో ఉన్నప్పటికీ వారందరినీ

విస్మరించారు. మనందరిదీ ఒకే భాష పేరుతో తెలంగాణ గొంతుకోసే పనిచేశారు. ఒకే భాష పేరుతో ఒక ప్రాంత ఉద్యమాన్ని ఎలా తొక్కిపెట్టవచ్చునో దాన్ని ఆసరా చేసుకున్న సీమాంధ్ర ఆధిపత్యవాదులు తెలంగాణను అన్ని రంగాల్లో తొక్కిపట్టారు.

2011 మార్చి 10న మిలియన్ మార్చ్ సందర్భంగా అంతకు ముందు నాలుగైదు రోజులుగా అన్ని తెలంగాణ జిల్లాలో పోలీసు యాంత్రాంగం ఎన్నో అణిచివేత చర్యలు చేపట్టింది. హైద్రాబాద్‌కు తరలి వచ్చేందుకు సిద్ధమైన యువతను అరెస్టులు చేశారు. స్థానిక నాయకులను లాకప్‌లలో వేశారు. తెలంగాణ రాజకీయ జెఏసీ, పలు ప్రజాసంఘాలకు చెందిన వారిని ముందస్తుగానే అరెస్టు చేశారు. జెఏసీ ఛైర్మన్ గద్దర్‌తో సహా వేల సంఖ్యలో అరెస్టులు చేశారు. 9వ తేదీ ఉదయం నుంచే హైద్రాబాద్‌కు వచ్చే అన్ని రహదారుల్లోని వాహనాలను అణువణువునా పరిశీలించారు. బస్సుల్లో ప్రయాణీకులను చెక్ చేశారు. హైద్రాబాద్ నగరం నిండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంను దిగ్బంధనం చేశారు. ఆందోళన చేస్తున్న ఉస్మానియా విద్యార్థులపై పలుమార్లు లాఠీ చార్జీలు, భాష్పవాయువు ప్రయోగాలుచేసి నిర్బంధించారు. హైద్రాబాద్ నగరంలో రోడ్లపై జనసంచారం కనిపించకుండా పోయింది. రాజ్యం చేసిన క్రూర నిర్బంధాలకు నిదర్శనంగా రోడ్లన్నీ ఖాళీ అయిన హైదరాబాద్ నగరం కనిపించింది. జర్నలిస్టులు వృత్తిరీత్యా మత ఐడెంటిటీకార్డులు చూపించినా ట్యాంక్‌బండ్ పై అనుమతించలేదు. ట్యాంక్‌బండ్ అంతా ముళ్లకంచెల బండ్‌గా మారింది. ఒక పక్క పోలీసు పహారాలో నగరం బిక్కుబిక్కుమంటుంటే ఇంకోపక్క మండుతున్న ఎండల మంటలు ముదిరాయి. అయినా ఎక్కడనుంచి వచ్చారో ఎవ్వరికీ తెలియదు.

బస్సులను చెక్ చేస్తుంటే 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం నుంచి నడిచి వచ్చిన వాళ్లు ట్యాంక్‌బండ్‌పైకి నిర్బంధాన్ని చీల్చుకుని వచ్చారంటే ఆ సందర్భాన్ని వూహించండి. పోలీసు కంచెలు దాటి లాఠీదెబ్బలు తింటూ ఒళ్లంతా చీరుకుపోయిరక్తం  కారుతున్న యువకుడొకడు. ట్యాంక్‌బండ్ మీదకు చేరాడు. అరెస్టుయి లాకప్‌లో ఉన్న కోందడరామ్‌కు ఆ యువకుడు ఫోన్ చేసి జరిగిన సంగతి, పగిలిన వొళ్లు, కారిన నెత్తురు గురించి చెప్పాడు. సార్! నన్ను పోలీసులు కొట్టారని చెప్పటం కోసం ఫోన్ చేయలేదు. నేను ట్యాంక్‌బండ్ పైకి వచ్చానని చెప్పేందుకు ఫోన్ చేశానని చెప్పటం తెలంగాణ ఉద్యమంలో అపూర్వమైన ఆకాంక్షల ఆవిష్కరణకు నిదర్శనం. ఈ ఒక్క సంఘటనే కాదు. ఆ రోజు ఇలాంటివి కొన్ని వందల సంఘటనలు జరిగాయి.

ఎన్నో ఏండ్ల నుంచి తెలంగాణ పడుతున్న బాధలకు, కన్నీళ్లకు ప్రతీకలుగా నిలబడ్డ యువత ఒక్కసారిగా ట్యాంక్‌బండ్ పైకి ఎక్కారు. ఎన్నో దారుల్లోంచి, ఎన్నో మార్గాలు నుంచి వచ్చిన యువత ఒక్కసారిగా పోలీసు బారీకేడ్లను నెట్టివేసి వేలామంది యువత ట్యాంక్‌బండ్‌పైకి ఎక్కారు. అదొక విజయగర్వయాత్ర. అదొక పోరాట ప్రతీక, అదొక బలమైన అస్థిత్వ పెనుకేక, అదొక జన సంగీత సామూహిక స్వరం. వాళ్లంతా గుండె మండిన తెలంగాణ గురుతులు. వాళ్లు ఎవ్వరినీ మన్నించే విధంగా లేరు. వాళ్లు ఎవ్వరినీ క్షమించే విధంగా లేరు. తెగతెంపుల సంగ్రామంలో ముందుకు ఉరుకుతున్న యువస్వరాలవి. తెలంగాణ విషయంలో రెండు నాల్కలతో మాట్లాడేవారిని వదలలేదు. రాజకీయ నాయకులు ఆడే దొంగనాటకాలను సహించలేదు. కేశవరావైనా, మధుయాష్కి అయినా ఎవ్వరైనా సరే ఉద్యమాన్ని వెనక్కు తీసుకపోతే సహించమని హెచ్చరిక చేశారు. ఉద్యమాన్ని ముందుకు తీసుకపోవాలన్న ఒక చిత్తశుద్ధి వేలమంది యువత మనస్సుల్లో బలంగా ఉంది.

సాయంత్రానికి విడుదలైన కోదండరాం, గద్దర్‌లు ట్యాంక్‌బండ్ పైకి వచ్చారు. కెసిఆర్ పలువురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, తదితర నేతలు, బిజెపి నేతలు వచ్చారు. వందల సంఖ్యలో ఉన్న ప్రజా సంఘాలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కవులు, కళాకారులు, రచయితలు తమ ఆట పాటలతో ట్యాంక్‌బండ్‌పై కదం తొక్కుతున్నారు. అంతా అయిపోయే ముందు ఇక తిరిగి ఇళ్లకు పోయే ముందు పొద్దుగుంకే వేళ ఆగ్రహం కట్టలు తెగిన కొందరు యువకులు ఆవేశంతో ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలపైకి దూసుకెళ్లారు. ఆవేశానికి భాష లేదు. తెలంగాణ వెన్నుపై నిలబెట్టిన సీమాంధ్ర సాహిత్య సాంస్కృతిక అధిపత్యాన్ని తమ చేతులతో నేలరాల్చుతున్నట్లుగా భావించారు. కొన్ని

విగ్రహాలు నేలరాలాయి.

తెలంగాణ ప్రజలు శ్రీశ్రీ, జాషువా, వేమన తదితరులను ఎంతగానో ప్రేమించారు. ప్రేమించటమేకాదు. తమ మనస్సుల్లో వారి సాహిత్యమూర్తులను దాచుకున్నారు. వారి సాహిత్య స్ఫూర్తిని నిత్యం మననం చేశారు. శ్రీశ్రీ కవిత్వానికి అద్దంగా తెలంగాణ జిల్లాలలో విప్లవోద్యమం ఎగిసింది. ఇక్కడ దళిత ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన భాగ్యరెడ్డి వర్మను పట్టించుకోనప్పటికినీ జాషువాను ఏనాడూ చిన్నచూపు చూడలేదు. కానీ తెలంగాణ యువతలో రగిలిన కోపాగ్నికి ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు నేలకూలాయి.

విగ్రహాలు కూలిన జాతీయంగా చర్చనీయాంశమైంది. పార్లమెంటు, అసెంబ్లీలలో ఈ అంశంపై చర్చ జరిగింది. అన్ని రాజకీయ పార్టీలు స్పందించాయి. విగ్రహాలు కూలడానికి అసలు కారణాలు విస్మరించి తెలుగు భాష కూలిపోయిందని, తెలుగు సంస్కృతికి ఘోర అవమానం జరిగిందని కొందరు గుండెలు బాదుకుంటూ తిరుగుతున్నారు. కూలిన విగ్రహాలు కూలినప్పుడు ఆ బాధను అందరూ పడతారు. కాని విగ్రహాలు కూలిన తర్వాత కూడా కొత్త నిర్మాణం తిరిగి జరుగుతున్నప్పుడు కూడా తెలంగాణ వైతాళికుల విగ్రహాలను పెట్టమని మాత్రం ఇప్పటి వరకు ఆ నోళ్లనుంచి రాలేదు. అది దారుణమైన విషయం. ఒక ప్రాంతాన్ని విస్మరించి, తన నేలపై తన ఆవవాళ్లను లేకుండా చేస్తే మళ్లీ జరుగబోయేది. చెప్పాల్సిన అవసరం లేదు. ఒక ఆగ్రహం కట్టలు తెగినాక తిరిగి అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పరిష్కారాలను వెతకాలి. మూలాలను మాట్లాడకుండా విగ్రహాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి.

ప్రపంచంలో అధిపత్యంపై తిరుగుబాటు జరుగుతున్న కాలంలో ఎన్నో విగ్రహాలు కూలిన విషయం తెలిసిందే. ప్రపంచంలో ఎక్కువ జనాభా ప్రేమించిన లెనిన్, అఫ్ఘనిస్థాన్‌లో ఆకలితో జనం అల్లాడుతుంటే సాయం చేయకుండా పాత పురాతన విగ్రహాల రిపేర్లకు మిలియన్ డాలర్లు వెచ్చిస్తుంటే కడుపు మండిన తాలిబన్లు ఆ విగ్రహాలను కూల్చివేశారు. సరిగ్గా ఆగ్రహంతో వున్న తెలంగాణ యువత ట్యాంక్‌బండ్ పై విగ్రహాలను కూల్చివేత కొన్ని పత్రికలలో "తెలంగాణ తాలిబన్లు" అని వ్యాసాలు రాశారు. ఇది విధ్వంసకు చర్య అని కొందరు మాట్లాడారు. కాని 4 కోట్ల మంది ప్రజలు యాభై ఏళ్లుగా శాంతియుత మార్గంలో మా తెలంగాణ మాకు కావాలని అడిగితే కేంద్రం పట్టించుకోలేదు. గత దశాబ్ద కాలంగా అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ కోరుతున్నారు.

ఈ మిలియన్ మార్చ్ సందర్భంగా జరిగిన ఘటనలపై పలు పత్రికలలో వ్యాసాలొచ్చాయి. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాలు కూలిన సంఘటనలపై పలు కోణాల్లో పత్రికలలో వ్యాసాలొచ్చాయి. విగ్రహాలను అడ్డుపెట్టుకొని తెలంగాణ ఉద్యమంపై నిప్పులు గక్కేందుకు దీన్నొక అవకాశంగా తీసుకొన్న వారు ఎంతో దుర్మార్గంగా దాడిచేశారు. కొందరు తెలంగాణ ఉద్యమాకారులను బాల్‌ఠాక్రే అని సంబోధిస్తే, మరికొందరు తాలిబన్లని పోలికలు చేశారు. ఇంకొందరు కోదండాలని వ్యాఖ్యానించారు. భిన్న కోణాలలో దినపత్రికలలో వచ్చినటువంటి వ్యాసాలన్నింటిని ఈ పుస్తకంలో పొందుపర్చటం జరిగింది. తెలంగాణ ఉద్యమం పై ఎవరు ఎలా స్పందిస్తున్నారో వీటన్నింటిని రికార్డు చేయాలన్న తలంపుతో దినపత్రికలలోని భిన్నస్వరాలను కూడా ఒక దగ్గరకు చేర్చటం జరిగింది. ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల కూల్చివేత తర్వాత తెలంగాణ 10 జిల్లాలలోని సాహిత్య, సాంస్కృతిక రంగానికి చెందిన వ్యక్తులు అప్పటికప్పుడు స్పందించి రాసిన వ్యాసాలన్నింటిని ఈపుస్తకంలో చేర్చటం జరిగింది. ట్యాంక్‌బండ్ పై సాంస్కృతిక అధిపత్యం పై సీమాంధ్రకు చెందిన సాహితీవేత్తలు స్పందించిన తీరు అద్భుతమైనది. పైడి నరేష్‌బాబు, జి.వి. రత్నాకర్‌రావు, అప్పలనాయుడు తదితర సీమాంధ్ర ప్రాంతానికి చెందిన సహితీవేత్తలు సాంస్కృతిక అధిపత్యంపై దాడి చేశారు. అందరి మాట ఒక్కటే ప్రాంతాల మధ్య సమతుల్యతను పాటించకుండా తిరిగి విగ్రహాల నిర్మాణాలను చేస్తే ఒప్పుకోమంటున్నారు. తెలంగాణ సహితీమూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించాలంటున్నారు. సాహితీవేత్తలతోపాటు పలు విశ్వవిద్యాలయ విద్యార్థులు స్పందించిన తీరు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది. ఎవరికైనా ఆవేదన కూడా కలుగుతుంది. ఆ విద్యార్థుల గోస తెలంగాణ గోస వారికి ఎత్తుగడలు తెలియవు పదవుల గురించి ఆశ

లేదు. మనస్సులో వున్నది కుండబద్దలు కొట్టినట్లు రాశారు. వాటిని యధావిధిగా ఈ తరం తెలంగాణ గుండె చప్పుళ్లుగా పుస్తకంలో చేర్చటం జరిగింది.

ట్యాంక్‌బండ్ పై ఘటన జరిగిన ఇరవై రోజులలో ఇంత పెద్ద సంఖ్యలో వ్యాసాలు రావడం చూస్తే తెలంగాణ ఉద్యమం ఎంత బలంగా వుందో తెలుస్తుంది. ప్రజల ఆకాంక్షలకు దర్పణంగా కవులు, రచయితలు, కళాకారులు నిలబడ్డారు. సాహిత్య, సాంస్కృతిక రంగం తెలంగాణకు మొదటి నుంచి కొండంత అండగా వుంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సాహిత్యరంగం పాత్ర తక్కువదేమి కాదు. తెలంగాణ సాధనలో ఈ రంగాల పాత్ర మరువలేనిది.

కూలిన విగ్రహాల గురించి రాలిపోతున్న విద్యార్థి యువత గురించి ఆలోచిస్తే ఆందోళన కలుగుతుంది. విగ్రహాల కూల్చివేత చూసిం తర్వాత మరేరకమైన సంఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాలి. జరుగుతున్న సంఘటనలను రాజకీయం చేయకుండా రాజకీయ పార్టీలన్నీ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. లేకపోతే తెలంగాణలో రాజకీయం చేసే పార్టీలకు పుట్టగతులుండవు. తెలంగాణ ప్రజలలో వున్న ఆకాంక్షలను గౌరవించడమంటే ప్రజాస్వామిక ఆకాంక్షల్ని ప్రేమించటమే. ఇంత దూరం ప్రయాణించాక ఇక వెనుకకు పోవటం జరగనిపని అలాగే లక్ష్యానికి చేరువవుతున్న సమూహాన్ని అడ్డుకోగలమనుకుంటే అవివేకమే అవుతుంది. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటాన్ని ఏ నీళ్లు పోసి చల్లార్చలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఈ పోరాటం కొనసాగుతునే వుంటుంది. ప్రతి రోజు ఒక మిలియన్ మార్చ్‌గా తెలంగాణ కదం తొక్కుతూనే వుంటుంది.

ఇంతకాలం సందర్శకుల ఆనందానికి, వినోదానికి మాత్రమే కేంద్రంగా నిలిచిన ట్యాంక్‌బండ్ మిలియన్ మార్చ్ అనంతరం శతకోటి ఆలోచనలకు మూలమై భిన్న అభిప్రాయాల అభివ్యక్తికి కారణమైంది.

ఆ ఆలోచనల సంఘర్షణల సమాహారమే ఈ సంకలనం.

అదే థింక్ బండ్.

ట్యాంక్ బండ్ థింక్ బండ్ అయిన సందర్భమిది.

**– జూలూరు గౌరీశంకర్**

విరుగుడు
పుస్తకం ముందుమాట

---





తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజలు కోరుకునే
విధానంలో చర్చిస్తున్న అంశాలను సీమాంధ్ర పాంత్రం
వారు వాదిస్తూన్న తప్పుడు వాదనలను తిప్పి కొడుతు
అవి అబద్ధాలని చెబుతూ వాస్తవాలను బయటకు
తెచ్చిన పుస్తక రూపమే తెలంగాణ – సమైక్యాంధ్ర
భ్రమలు – అబద్ధాలు – వాస్తవాలు

Forum For SUSTAINABLE TELANGANA

ప్రతులకు : సహచర, దిశ బుక్ షాపులు

# విధ్వంసం ... ధ్వంసం !

**- సహచరి**

ఆత్మాభిమానాన్ని
స్వయం నిర్ణయాధికారాన్ని
తెలంగాణ మా జన్మహక్కుని
నినదించే స్వేచ్ఛను
నిర్బంధించినందుకు ...
నిగ్రహం కోల్పోయినం వాళ్ళు ...
విగ్రహాల్ని కూల్చడం నేరమేం కాదు!

విగ్రహాలెవరివైతేనేం
కూల్చిందెవరైతేనేం ...
వలసాధిపత్యానికి
సాంస్కృతిక చిహ్నాలై
వెలసినందుకు ...
ధ్వంసం చేయబడ్డవి!

ధ్వంసం చేయాల్సిన దాన్ని
ధ్వంసం చేయకుండా
మరో మహత్తర మైన దాన్ని
నిర్మించలేం కదా ...

దేహాన్ని కబలిస్తుందనుకుంటే
గుండెనైనా కోయాల్సిందేగా
ప్రాంతాన్ని పాతరేస్తున్నందుకు
మట్టి విగ్రహాల్ని కూల్చడం సహజమే!

హుస్సేన్ సాగర్ ఒడ్డున
మా విద్యుత్ కేంద్రాన్ని పాతరేసినందుకు
మా వక్ఫ్ భూములని ఆక్రమించి
కావూరి ల్యాంకో హిల్స్ నిర్మించినందుకు ....
మీ రింగు రోడ్ల వెంట
మా కొంపల్ని కూల్చినందుకు ...
మా జీవనది మూసిని
కాలుష్య కాసారంలా మార్చినందుకు
హైదరాబాద్‌ను ఫ్రీజోనని
మా కొలువుల్ని కొల్లగొట్టినందుకు
గ్రేటర్ హైదరాబాద్ పేరిట
తెలంగాణ గుండెకాయను
కబలిస్తున్నందుకు ...

మీ సీమాంధ్ర పెట్టుబడులకు
సామ్రాజ్యవాద బహుళజాతి
ఆధిపత్యాల కేంద్రంగా మార్చినందుకు
తెలంగాణ మా జన్మహక్కుని
నినదించిన విశ్వ విద్యాలయాల్ని
యుద్ధ భూములుగా
నెత్తురు చిందించినందుకు ...

రగిలిపోయిన మా బిడ్డల
ఆత్మ బలిదానాల సాక్షిగా
పాతిపెట్టిన మా ఆత్మగౌరవం
విధ్వంసాన్ని ధ్వంసం చేసింది ...
విధ్వంస రహిత స్వప్నం కోసం
సాగుతున్నది ....

# హమారా హైదరాబాద్ తెలంగాణ వ్యాస సంకలనం

*డా॥ శ్రీమతి ముదిగొండ భవాని*

## "హమారా హైదరాబాద్" పుస్తక సమీక్ష

ఇటీవల హమారా హైదరాబాద్ (తెలంగాణ వ్యాస సంకలనం) పుస్తకం వెలువడింది. దీనిని మా కళాశాల పూర్వ విద్యార్థి భోనకుర్తి సోమేశ్వర్ సంపాదకులుగా ఎంతో శ్రద్ధతో అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చాడు. ఈ పుస్తకం పూర్తిగా చదివి సమీక్ష రాస్తే బాగుంటుందని, వివరాల్ని పూర్తిగా తెలుసుకోవాలన్న ఆసక్తితో నా సందేహాల్ని హైదరాబాద్ గురించి నివృత్తి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో చాలా నెమ్మదిగా చదవటం జరిగింది.

నేను పుట్టిందీ, పెరిగిందీ, చదివిందీ, ఉద్యోగం చేస్తున్నదీ హైదరాబాదులోనే కావటం చేత మరింత ఆసక్తితో చదివాను. అయితే పాతబస్తీలో బడిలో చదివే రోజుల్లో దినాం పొద్దున మంచి నీళ్ళు పట్టుకుంటే తిరిగి సాయంత్రం నాలుగు గంటలకే అవి పారబోసి మళ్ళీ పట్టుకోవడం నాకు తెలుసు. ఇది ఒక 25 సం॥ల క్రిందటి మాట. మారి యిప్పుడేమో రెండు రోజులకొకసారి, కొన్ని చోట్ల వారానికొకసారి, కొన్ని చోట్ల అసలే నీళ్ళు లేక అవస్థలు పడే ప్రజల్ని చూసినప్పటి నుండి నా మనసులో ఈ పరిస్థితికి కారణమేంది? ఎందుకింత అవస్థ పడుతున్నారు అని ఆలోచిస్తూ ఉండేదాన్ని. ఈ సందేహానికి సమాధానం ఈ "హమారా హైదరాబాదు" పుస్తకం చివరి పేజీ చదవటం అయిపోగానే దొరికింది. ఏం చెప్పాలి? ఎంత చెప్పాలి? ఎంత చెప్పినా తక్కువనే. కర్ణుని చావుకి కారణాలు అనేకం అన్నట్లు చాలా వున్నాయి. ఈ పుస్తకంలో సుమారు 24 మంది సంపాదకునితో కలిపి తమ అభిప్రాయాల్ని, ఆవేదనల్ని ఖచ్చితమైన ఆధారాలతోటి, లెక్కలతోటి ఆరాలు తీసి మరీ చెప్పిండ్రు. ఇప్పుడు అర్థమైంది. నీళ్ళు ఎందుకు అందరికీ అందుబాటులో లేవో.

అంతేగాదు నేను చిన్నప్పుడు ఎవరైనా హైదరాబాద్‌కి కొత్తగా వస్తే చార్మినార్, గోల్కొండ, గండిపేట చెరువు, జూపార్కు చూపిస్తం అని చెప్పేటోళ్లం. మరి యిప్పుడెవరన్న వస్తే అవి చూడకుండ ఐమాక్స్‌లు, రామోజీరావ్ ఫిల్మ్ సిటీలు, ఫ్లైఓవర్లు చూడటానికి వస్తున్నరంటే ఎంత మారిపోయిందో తెలుస్తుంది. ముందొచ్చిన చెవులకన్న వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు ఈ తళుకు బెళుకులతో ప్రజల్ని ఆకర్షించి విలువైన కట్టడాల్ని మరుగునపడేసిండ్రు. మొన్నటిదాకా తెలంగాణ వస్తది, యిస్తారు. తెలంగాణ కోసమే ఉద్యమం, పోరాటం అని విద్యార్థులు, మేధావులు కృషి చేస్తే యిప్పుడు 'హైదరాబాద్' అనే అంశాన్ని లేవనెత్తి తప్పుదోవ పట్టిస్తున్న వైనాన్ని ఈ పుస్తకంలో వివరించారు.

51% తెలుగు వాళ్ళున్న చెన్నయ్ తెలుగువాళ్ళది కాలేదు కానీ సుమారు 2000 సంవత్సరాల చరిత్ర ఉన్న హైదరాబాద్ కేవలం 50, 60 ఏళ్ళలో ఎట్లా ఆంధ్ర పెటుట్టబడిదార్లదైందని ప్రశ్నించినారు. 'హైదరాబాద్ రాజధాని చరిత్ర' అనే వ్యాసంలో హితైషిగారు 1418, 1510 సం॥రాలలోని శాసనాల ఆధారాలను చూపిస్తూ తెలుగోళ్ళ కొండ జన వ్యవహారంలో తెలుగు ఎగిరిపోయి గోళ్ళకొండ గోలుకొండగా మిగిలిందని అదే విధంగా 10, 15 కి.మీ. దూరంలో హైదరాబాద్ మహా నగరం ఉందనే విషయాన్ని ఆధారాలతో నిరూపించారు.

ఏది ఏమైనా ఆకలిలేని మనిషి తినే తిండికి నానా వంకలు పెట్టినట్లు వాస్తవాల్ని జీర్ణం చేసుకోలేక కాలికేస్తే

మెడకి, మెడకేస్తే కాలికి అన్నట్లు ప్రవర్తిస్తున్న తీరు ప్రతి తెలంగాణా వ్యక్తి గుండెలు బాదుకునేలాగా ఉందని ఈ పుస్తకం ఆసాంతం చదివితే తెలుస్తుంది. మొత్తం మీద అనేక అంశాలపై వ్రాసిన వ్యాసాలు ఎంతో విజ్ఞాన దాయకంగా ప్రతి ఒక్కరినీ చైతన్య పరిచేవిగా గణాంకాలతోపాటు ఉన్నయి. తెలంగాణలో 'ణ'ల కోసం వచ్చి యింత కత చేసిన వైనాన్ని ప్రతి తెలంగాణ వ్యక్తి చదివి తీరాల్సిందే.

అందుకే అంటున్న ఈ పుస్తకం చదివినంక తెలంగాణలో ఉన్న 'ణ' (Mony) ఆంధ్రలో లేదన్నా అని అంటున్న. (హైదరాబాద్) ఎవడబ్బ సొమ్మని కులకుతు తిరిగేవు ... రామచంద్రా కాదు కాదు పెట్టుబడిదారులూ ....

జై తెలంగాణ !

జై జై తెలంగాణ !!

– తెలుగు ఉపన్యాసకురాలు
డా॥ శ్రీమతి ముదిగొండ భవాని
డా॥ బి.ఆర్. అంబేడ్కర్ డిగ్రీ కళాశాల,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

# టి.ఆర్.సి. ఉద్దేశాలు

తెలంగాణ సమాజాన్ని పరిశీలిస్తే మిగతా ప్రాంతాలకు పూర్తిగా భిన్నమైన సమాజంగా కన్పించకమానదు. ఈ ప్రాంత ప్రజల జీవితంలో పోరాటం ఒక భాగమైంది. ఆధిపత్య పోకడలో ఉన్న ఆంధ్ర నాయకులు ఇక్కడి ప్రజల, ఆర్థిక, సామాజిక అంశాలయిన, భూమి, నీరు, ఉద్యోగాలు, వనరులపైన మాత్రమేగాక ఇక్కడి ప్రజల చరిత్రను, సంస్కృతిని, భాష, యాసలను నాశనం చేసి మన ఆత్మగౌరవం మీద దెబ్బతీసే ప్రయత్నంలో సఫలమవుతున్న ప్రతిసారి.... తెలంగాణ ప్రజలు పోరాటం చేస్తూ ఆత్మగౌరవాన్ని రక్షించు కోవడం కోసం తపన పడుతున్నారు. ఆ తపన, అదే దీక్ష అదే పట్టుదలతో మూడుతరాల నుంచి తెలంగాణ ప్రజలు ఎన్నో మోసాలకు, వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు.

ఎన్నో పరిశోధనలు, ఎన్నో పోరాటాలు. కాని ఆ పోరాటాన్ని, ఆ సంస్కృతిని, ఆ చరిత్రను, అపారమైన వస్తు, శిల్ప సాహిత్య సంపదను వెలుగులోకి రాకుండా తొక్కి పట్టినా, సమైక్యాంధ్ర, విశాలాంధ్ర ముసుగులో తప్పుడు చరిత్రను లిఖించిన వారిని ప్రశ్నిస్తూ, తెలంగాణ చరిత్ర పునర్‌నిర్మాణం కోసం.... తెలంగాణ రిసోర్స్ సెంటర్‌ను స్థాపిస్తున్నాం. వెలికి తీయ్యాల్సిన విషయాలను, ప్రతి గ్రామ చరిత్రను, సంస్కృతిని, ప్రజల ముందు పెడదాం... భావితరాల కోసం భద్రపరుచుదాం.

ఇందులో భాగంగా తెలంగాణ సంస్కృతి, పోరాటం, జీవితం లాంటి విభిన్న అంశాలపై వెలువడిన సాహిత్యంతో ఒక గ్రంథాలయాన్ని కూడా నెలకొల్పాం. తెలంగాణవాదంపై ఆసక్తిగలవారెవరైనా ఈ గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవచ్చు. అంతేగాకుండా తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాల (జానపదం, కథలు, నవలలు, నాటికలు, కవితలు, ఇతరత్రా సాహిత్యరూపాలు) పై తమ వద్ద ఉన్న పుస్తకాలను దాతలు ఈ గ్రంథాలయానికి విరాళంగా ఇవ్వాలని కూడా అభ్యర్థిస్తున్నాం. ఆ విధంగా విరాళంగా అందిన పుస్తకాలు నలుగురికీ అందుబాటులోకి వస్తాయి. తద్వారా తెలంగాణవాదం మరింత పటిష్ఠమయ్యేందుకు, భవిష్యత్తు తరాలవారికి తెలంగాణ సాహిత్యంపై అవగాహన పెంచుకునేందుకు తోడ్పడుతుంది. తెలంగాణ చారిత్రక సత్యాలను సమాజానికి అందించాలనే తపన ఉన్న వారందరు భాగస్వాములు కండి.....

***తెలంగాణ రిసోర్స్ సెంటర్, హైదరాబాద్***

# తెలంగాణ రిసోర్స్ సెంటర్ ప్రచురణలు














ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల విషయంలో అలనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో అప్పుడే గొడవపడ్డాం. ఎం.ఐ.ఎం. వాళ్లయితే ఏ విగ్రహాలు పెట్టినా కూల్చేస్తామని అప్పుడే అన్నారు. మనుషులకు లేని రక్షణ విగ్రహాలకు ఎందుకన్నారు. ఈ విషయం ఇటీవల అసెంబ్లీలో అక్బరుద్దీన్ కూడా ప్రస్తావనకు తీసుకొచ్చాడు. కవులు శ్రీశ్రీ, జాషువాలు గొప్పవారే ... అందులో మాకు ఎలాంటి సందేహం లేదు. కానీ దాశరథి కూడా శ్రీశ్రీ అంతటి గొప్పవాడే. ఎందుకు ఆయన విగ్రహం పెట్టలేదు? ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చేసరికి దాశరథి ఆస్థాన కవిగా ఉండేవారు. ఎన్టీఆర్ ఆయనను తొలగించి, అవమానపరిచారు. ఆ అవమాన భారంతోనే ఆయన చనిపోయారు. సరే ... ఎలాగూ చంపేశారు కనీసం ఆయన విగ్రహమైనా పెట్టమని అడిగితే పట్టించుకోలేదు.

– ప్రొ॥ జయశంకర్

మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ సాధిస్తామని
ప్రజలు, ఉద్యమకారులచే ప్రమాణాలు చేయిస్తున్న
తెలంగాణ ప్రజాఫ్రంట్ చైర్మన్, ప్రజాయుద్ధనౌక గద్దర్

**TELANGANA RESOURCE CENTRE**
"CHANDRAM", 490, St. No. 11, Himayatnagar, Hyderabad-500 029.
Telanganaresource@gmail.com; Mobile : 9030626288